www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 26-8-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 132 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 2.20 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక మ. 3.55 తదుపరి రోహిణి; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ. 12.41-1.31, మ. 3.10-4.00; అమృతఘడియలు: మ. 1.36-3.08; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహిళలపై నేరాలు.. క్షమించరాని పాపాలు



- దోషులను వదిలే ప్రసక్తే లేదు.. ఈ సందేశం పై నుంచి కింది వరకు వెళ్లాలి
- ప్రభుత్వాలు వస్తాయి పోతాయి.. కానీ మహిళల రక్షణ అందరి బాధ్యత
- స్వయం సహాయ బృందాలకు రూ.9 లక్షల కోట్లు సాయం చేశాం
- 'మన్ కీ బాత్', 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాల్లో ప్రధాని

2

తెలుగు భాష అద్భుతం: మోదీ

ఇజ్రాయెల్ x హెజ్బొల్లా

- 320కి పైగా కత్యూష రాకెట్లు, డ్రోన్లతో దాడికి సిద్ధమైన హెజ్బొల్లా
- ముందే పసిగట్టి 100 ఫైటర్ జెట్లతో విరుచుకుపడిన ఇజ్రాయెల్ సైన్యం
- దాడుల్లో లెబనాన్‌లో ముగ్గురి మృతి
- ఐరన్ డోమ్ ప్లాట్‌ఫారాలే లక్ష్యంగా రాకెట్ల వర్షం కురిపించిన హెజ్బొల్లా



తమవైపు దూసుకొస్తున్న హెజ్బొల్లా రాకెట్‌ను ఇజ్రాయెల్ వైమానిక దళం పేల్చివేసిన దృశ్యం



ఉత్తర ఇజ్రాయెల్‌లోని ఎకర్‌లో ధ్వంసమైన ఇల్లు

జెరూసలెం, ఆగస్టు 25: దాదాపు పది నెలలుగా ఉద్రిక్తంగా ఉన్న పశ్చిమాసియా.. ఆదివారం మరోసారి బాంబుల మోతలతో దద్దరిల్లింది! హెజ్బొల్లా నేత ఫవాద్ షుకూర్ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై కత్యూష రాకెట్లతో, డ్రోన్లతో దాడి చేయడానికి ఆ సంస్థ సిద్ధమైంది. అయితే, ఈ విషయాన్ని ముందుగానే నిఘా వర్గాల ద్వారా పసిగట్టిన ఇజ్రాయెల్.. ముందస్తు

మిగతా 2వ పేజీలో...

సిబ్బంది సర్దుబాటు!

గ్రామ, వార్డు సచివాలయాల ప్రక్షాళన



- నలుగురైదుగురికే పరిమితం చేసే చాన్సు
- మిగతా వారిని ఇతర శాఖల్లో సర్దేందుకు యత్నాలు
- తొలుత ఇరిగేషన్ ఏఈలుగా 660 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు!
- పంచాయతీరాజ్‌లోనూ ఇలాగే సర్దుబాటు
- గ్రామీణ తాగునీటి విభాగంలో కూడా..

అనాలోచితంగా గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసి.. ఇబ్బడి ముబ్బడిగా కార్యదర్శులను నియమించిన జగన్ ప్రభుత్వం వారికి సక్రమమైన జాబ్‌చార్ట్ చూపించలేకపోయింది. దీంతో ఎక్కువ మంది ఉద్యోగులు పనుల్లేక సచివాలయాల్లో గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటున్నారు. వారిలో ఎక్కువ మంది ఉన్నత చదువులు చదివిన వారే. వారి సేవలను విస్తృతంగా వాడుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సచివాలయాల్లో అవసరానికి మించి ఉన్న సిబ్బందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే దిశగా టీడీపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ/వార్డు సచివాలయాలను ప్రక్షాళన చేయాలని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. వాటిలో అవసరం ఉన్నంత వరకే సిబ్బందిని ఉంచి వారి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని యోచిస్తోంది. మిగతావారిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ముందుగా గ్రామ సచివాలయాల్లోని

మిగతా 12వ పేజీలో...



ఇసుక కోసం కృత్రిమ మేధ

- అక్రమ నిల్వలు, రవాణా నియంత్రణకు చెక్
- ఇసుక పాలసీలో ఏఐ వినియోగానికి నిర్ణయం
- లైవ్ శాటిలైట్ డేటాకు అనుసంధానం
- ఉచిత ఇసుక కోసం వెబ్‌సైట్
- రూపుదిద్దుకుంటున్న పాలసీ
- 28న మంత్రి వర్గం ముందుకు

3

'గాలి'ని మించిన ఘనులు

మైనింగ్ కింగ్ గాలి జనార్దన్‌రెడ్డి అక్రమాల వ్యవహారం అందరికీ తెలిసిందే. ఇనుప ఖనిజం లీజు ఆంధ్రప్రదేశ్‌లోని ఓబుళాపురంలో!! తవ్వకుంది మాత్రం కర్ణాటకలో! సరిహద్దులు చెరిపేసి మరీ జరిపిన దందా ఆయనది! ఇప్పుడు... రాష్ట్రంలో లేటరైట్ తవ్వకాల్లో అదే జరుగుతోంది! తామే బెదిరించి మూసివేయించిన గనిలో నాణ్యమైన లేటరైట్ తవ్వకాలు జరుపుతూ... దానిని తమ పరిధిలోని గనుల్లో తవ్వినట్లు చూపిస్తున్నారు. ఇలా చేస్తున్నది.. వైసీపీలోని 'పెద్ద' మనుషులు! సర్కారు మారినా వారి దందా మాత్రం సాగుతుండటమే విచిత్రం!

లేటరైట్ తవ్వకాల్లో అదే వ్యూహం

- లీజు కంపెనీని తరిమేసి... తవ్వకాలు
- పక్కనే మరో లీజు తీసుకుని 'మాయ'
- తమ గనుల్లోనే తవ్వినట్లుగా లెక్కలు
- అక్కడే లేటరైట్ డంప్.. తరలింపు
- అటవీ ప్రాంతంలోనూ యథేచ్ఛగా తవ్వకాలు
- నాడు గుట్టుగా.. నేడు బహిరంగంగా దోపిడీ
- 'తూర్పు'లో కొనసాగుతున్న వైసీపీ పెద్దల దందా
- నేటికీ సహకరిస్తున్న వైసీపీ అస్మదీయ అధికారులు
- అంతా సక్రమమేనని ప్రభుత్వానికి తప్పుడు నివేదిక



అన్యాయం సక్రమంగా లీజు పొందిన కంపెనీని జరిమానాల పేరుతో వైసీపీ హయాంలో మూయించడం.

అక్రమం పక్కనే మరో గని లీజు తీసుకుని.. మూయించిన కంపెనీకి కేటాయించిన ఏరియాలో తవ్వి రూ.కోట్లు పోగేసుకోవడం.

అకృత్యం కూటమి ప్రభుత్వంలో ఉన్న అధికారులను కూడా మేనేజ్ చేసి.. 'అంతా బాగుందని' నివేదికలు ఇప్పించడం.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బెదిరించడం, భయపెట్టడం... గనుల్లో వాటాలు కొట్టేయడం! కాదూ కూడదంటే... భారీగా జరిమానాలు వేయించి, అధికారుల ద్వారా ఆ గనులను మూసివేయించడం. వైసీపీ హయాంలో జరిగిన గనుల దందా ఇది! అదే క్రమంలో అంతకుమించిన 'పెద్ద' అక్రమం ఒకటి వెలుగులోకి వచ్చింది. తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు ప్రాంతంలో లేటరైట్ గనిని లీజుకు తీసుకున్న యజమానిని బెదిరించి, జరిమానాలు వేయించి.. ఆ గనిని మూసివేయించారు. ఆ తర్వాత అదే గనిలో ఈ పెద్ద మనుషులే అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. అదీ చాలదని అడవిని సైతం గుల్లచేస్తున్నారు. ఈ అక్రమానికి 'గాలి' తరహా వ్యూహం అమలు చేస్తున్నారు. అక్కడే మరో లేటరైట్ గనిని లీజుకు తీసుకుని... తవ్వకాలన్నీ అక్కడే జరిగినట్లుగా మాయ చేస్తున్నారు. సొంత గని పెట్టుకుని, పక్క గనులపై పడటం ఎందుకంటారా? వాళ్ల గనుల్లోని

మిగతా 12వ పేజీలో...

'ఆంధ్రజ్యోతి' కథనంతో..

ఈ నెల 4న 'లేటరైట్ రైట్..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌ను విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు ప్రత్తిపాడు ఏరియాకు వెళ్లి రెండు లీజు ఏరియాలు, అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అప్పుడు అసలు వాస్తవం బయటపడింది. జగన్ ప్రభుత్వంలో మూసివేయించిన ఓ ప్రముఖ కంపెనీ మైనింగ్ ఏరియాలో వైసీపీ పెద్ద తవ్వకాలు చేయిస్తున్నారని, అలా తవ్వితీసిన లేటరైట్‌ను ఆ సమీపంలోనే ఉన్న తన బినామీ కంపెనీ డంప్‌లో నిల్వచేస్తూ, దాన్ని అధికారికంగా అమ్ముకుంటున్నారని అధికారులు గుర్తించారు. పైగా పక్కనే ఉన్న అడవిలో కూడా అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని కూడా గుర్తించారు. కానీ, నివేదిక మాత్రం దీనికి భిన్నంగా ఇవ్వడం గమనార్హం.

ఈఎస్ఐపై విజి'లెన్స్'!

- జగన్ హయాంలో మందుల కొను'గోల్‌మాల్'పై దృష్టి.. రాజమండ్రి ఆస్పత్రి పేరుతో భారీగా పీవోలు
- లోకల్ పర్చేజ్ నిబంధన మాటున పెద్ద స్కాం.. డమ్మీ ఏజెన్సీని సృష్టించి తక్కువ ధరకు మందుల కొనుగోలు
- రూ.3 కోట్లకు కొని, బయట రూ.60 కోట్లకు అమ్మకం.. సూత్రధారి వసూల్‌రాజాయే!
- నాడే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'.. తూతూమంత్రంగా విచారణ.. ఏమీ జరగలేదని నివేదిక
- ఇప్పుడు విజిలెన్స్ విచారణకు ఆదేశించిన కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి

12

తప్పులు కప్పిపుచ్చే తనిఖీలు!

- సోషల్ ఆడిట్ బృందాల కమీషన్లు
- అవినీతిపరులతో బేరసారాలు
- 4 రకాల నిఘా వ్యవస్థలూ నిర్వీర్యం
- ఐదేళ్లుగా ఉపాధి హామీ పథకం తీరు

11



మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి



ఓపీడీ బ్లాకులో మందుల కోసం క్యూలో రోగులు

పేరు ఘనం.. సేవ గగనం

- పది రూపాయలకే వైద్య సేవలు... అందుబాటులో అత్యాధునిక వైద్య పరికరాలు... తక్కువ ధరలకే పరీక్షలు.. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు.. మంగళగిరి ఎయిమ్స్ ప్రత్యేకలు ఇవీ. ఇదంతా ఓ పార్శ్వం మాత్రమే.
- ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా.. డాక్టర్‌ను కలవాలన్నా... మందులు తీసుకోవాలన్నా... పరీక్షలు చేయించుకోవాలన్నా గంటల కొద్దీ క్యూలో నిరీక్షించాలి. వైద్యం పొందాలంటే రోగికి ఎంతో ఓపిక, శక్తి ఉండాలి. సీటీస్కాన్ లేదా ఎమ్మారై స్కాన్ చేయించుకోవాలంటే రోజుల కొద్దీ ఎదురుచూడాలి. పరిస్థితి అత్యవసరమైతే అంతే సంగతులు!

ఇదీ మంగళగిరి ఎయిమ్స్ పరిస్థితి

- 2019లో వైద్య సేవలు ప్రారంభం
- అప్పట్లో 300-400 మంది రోగులకు సేవలు
- నేడు రోజూ 3 వేల మంది వరకూ రాక
- డిమాండ్‌కు తగ్గట్టు లేని వైద్యులు, వసతులు
- ఓపీ రిజిస్ట్రేషన్‌కు గంటల కొద్దీ నిరీక్షణ
- డాక్టర్‌ను కలవాలంటే చాంతాడంత క్యూ
- అత్యవసరమైతే అంతే సంగతులు
- ఇంకా ఆరంభంకాని ప్రధాన విభాగాలు

- 2019లో మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్యసేవలు ప్రారంభించినపుడు 300-400 మంది రోగులు వచ్చేవారు. ఇపుడు రోజుకు 3 వేలమంది వరకు ఓపీకి వస్తున్నారు. అందుకు తగినట్టుగా ఓపీ రిజిస్ట్రేషన్స్, బిల్లింగ్ కౌంటర్లు కానీ, మందుల దుకాణంలోని కౌంటర్లు కానీ పెంచలేదు. మొదట్లో ఎన్ని ఉన్నాయో ఇప్పటికీ అన్నే ఉన్నాయి. డిమాండ్‌కు తగ్గ స్థాయిలో వైద్యులు లేరు. కీలకమైన వైద్య విభాగాలను ఇంకా ప్రారంభించనేలేదు.

(మంగళగిరి)

పచ్చని కొండల నడుమ ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో.. గుంటూరు, విజయవాడ నగరాల మధ్యలో మంగళగిరి ఎయిమ్స్ ఏర్పాటైంది. పది రూపాయలకే ఉత్తమ వైద్యసేవలు అందిస్తారనే పేరుంది. బాగా ప్రచారం జరగడంతో సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి రోగులు వస్తున్నారు. ఆస్పత్రి నిత్యం కిటకిటలాడుతోంది. ఇదంతా పైకి కనిపించే

మిగతా 11వ పేజీలో...

పాత-కొత్త కలయికే ఏకీకృత పింఛన్

- సీపీఎస్ కంటే ప్రయోజనాలు ఎక్కువే
- రాష్ట్రాల్లో అమలు చేస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లబ్ధి
- యూపీఎస్, ఎన్‌పీఎస్, ఓపీఎస్‌లో తేడాలెన్నో!

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మరో విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చింది. జాతీయ పెన్షన్ విధానం స్థానంలో పాత పథకాన్ని పునరుద్ధరించకుండా.. ఏకీకృత పింఛన్ పథకాన్ని (యూపీఎస్) తీసుకువచ్చేందుకు కేంద్ర కేబినెట్ శనివారం పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. ఈ మూడు పింఛన్ పథకాల మధ్య తేడాలేమిటి? ఏది మంచిది? యూపీఎస్ నిజంగానే ఉద్యోగుల భవిష్యత్‌కు భద్రత కల్పిస్తుందా?..

2

తెలుగు రాష్ట్రాల్లో.. 'తాగేస్తున్నారు'!

- దేశంలో అత్యధిక మందుబాబులిక్కడే
- తెలంగాణలో వార్షిక తలసరి వినియోగ వ్యయం రూ.1,623.. ఏపీలో 1,306
- తర్వాతి స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, పంజాబ్
- కేంద్ర ఆర్థిక శాఖ విభాగం 'నిపెప్' వెల్లడి

2

కేంద్రం కులగణన నిర్వహించాల్సిందే

» కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం కులగుణన నిర్వహించాల్సిందేనని కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ పట్టుబడుతుంటే.. ఇదే అంశంపై విపక్షంలో ఉండి కూడా కాంగ్రె‌స్‌పై విమర్శలు గుప్పిస్తూ బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతున్నారు మాయావతి! బీజేపీ మిత్రపక్షమైన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడిగా ఆదివారం మళ్లీ ఎన్నికైన సందర్భంగా చిరాగ్ మాట్లాడుతూ కులగణనపై తమ వైఖరిని పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నదే ఎప్పటి నుంచో తమ డిమాండ్ అని పేర్కొన్నారు. అప్పుడే ప్రభుత్వం వద్ద సరైన గణాంకాలు ఉంటాయన్నారు. అయితే కులగణన వివరాలను బహిర్గతం చేయాలని తాము కోరుకోవడం లేదని, వెల్లడిస్తే సమాజంలో చీలిక రావచ్చని పేర్కొన్నారు. ఈ విషయంలో బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మాత్రం బీజేపీని వదిలి.. కాంగ్రె‌స్‌పై విమర్శలు చేస్తున్నారు. బీజేపీకి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కులగణన ఎందుకు నిర్వహించలేదని, ఇప్పుడు ఎందుకు మాట్లాడుతోందని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలుగా విమర్శించిన ఆమె వాటితో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండదన్నారు.

టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్ అరెస్టు



పారిస్, ఆగస్టు 25: టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్‌ను పారిస్‌లో పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం పారిస్‌లోని లీ బోర్గెట్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మోసం, మాదకద్రవ్యాల అక్రమరవాణా, సైబర్ నేరాల ప్రోత్సహం, టెలిగ్రామ్‌లో కంటెంట్‌పై నియంత్రణ లేకపోవడం వంటి ఆరోపణల నేపథ్యంలో ఆయనపై గతంలో అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో శనివారం అజర్‌బైజాన్ నుంచి పారిస్ బయలుదేరిన పావెల్‌ను లీ బోర్గెట్ విమానాశ్రయంలో కస్టడీలోకి తీసుకున్నారు. టెలిగ్రామ్ సీఈవో అరెస్టుపై రష్యా స్పందిస్తూ.. భావప్రకటన స్వేచ్ఛపై పశ్చిమ దేశాలు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నాయని ఆరోపించింది.

దెయ్యం పోవాలని దెబ్బలు..యువకుని మృతి

చండీగఢ్, ఆగస్టు 25: దెయ్యాన్ని వదిలిస్తానంటూ పంజాబ్‌లో ఓ పాస్టరు చేసిన చికిత్స 'వికటించింది.' దెయ్యాన్ని పారదోలడం పేరుతో అతడు కొట్టిన దెబ్బలకు 30 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గురుదాస్‌పూర్ జిల్లాలోని సంఘపురాకు చెందిన శామ్యూల్ మాసిహ్ అనే దినసరి కూలీ నిత్యం అనారోగ్యానికి గురయి కేకలు వేస్తుండేవాడు. దాంతో కుటుంబ సభ్యులు స్థానిక పాస్టర్ జాకోబ్ మాసిహ్‌ను సంప్రదించగా బుధవారం వారి ఇంటికి వచ్చి ప్రార్థనలు చేశాడు. అతనికి దెయ్యం పట్టిందని, దాన్ని వదిలించడానికి అతణ్ని కొడుతామని చెప్పాడు. కొట్టినా ఏమీ కాదని భరోసా ఇచ్చాడు. అనంతరం ఆయనతో పాటు మరో ఎనిమిది మంది శామ్యూల్‌ను గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మరుసటి రోజున శవానికి సమాధి చేశారు. కానీ రెండు రోజుల తరువాత శామ్యూల్ తల్లి, భార్య పాస్టరుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం సమాధి నుంచి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. పాస్టర్‌తో పాటు మరో ఎనిమిది మందిపై పోలీసులు కేసు పెట్టారు.

బ్రెజిల్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న భారతీయులు

బ్రసీలియా, ఆగస్టు 25: భారత్, నేపాల్, వియత్నాం దేశాలకు చెందిన వందలాది మంది వలసదారులు బ్రెజిల్‌లో సావోపాలోలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నారు. వీరు బ్రెజిల్‌లోకి ప్రవేశించేందుకు గ్వారుల్హోస్ విమానాశ్రయంలో వారాలుగా ఎదురు చూస్తున్నారు. అయితే వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, వారు నేలపైనే నిద్రించాల్సి వస్తోందని రాయిటర్స్ కథనం పేర్కొంది. కనీసం 666 మంది వలసదారులు వీసాలు లేకుండా బ్రెజిల్‌లోకి ప్రవేశించేందుకు వేచి చూస్తున్నట్టు పబ్లిక్ డిఫెండర్స్ ఆఫీస్ అధికారి ఒకరు తెలిపారు. సోమవారం నుంచి అమల్లోకి వచ్చే కొత్త రూల్స్ ప్రకారం.. బ్రెజిల్ వీసా లేకుండా వేరే దేశానికి వెళ్లే విదేశీ ప్రయాణికులు నేరుగా వారి గమ్యస్థానానికి వెళ్లాలి లేదా తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

మహిళలపై నేరాలు క్షమించరాని పాపాలు

దోషులను వదిలే ప్రసక్తే లేదు.. ఈ సందేశం పై నుంచి కింది వరకు వెళ్లాలి

» ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి కానీ మహిళల రక్షణ అందరి బాధ్యత

» 'మన్ కీ బాత్', 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాల్లో ప్రధాని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న నేరాలు క్షమించరాని పాపాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై హత్యాచారం, ముంబై సమీపాన బద్లాపూర్‌లో నాలుగేళ్ల చిన్నారులపై లైంగిక వేధింపుల ఉదంతాల నేపథ్యంలో ఆదివారం మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగిన 'లఖ్‌పతి దీదీ సమ్మేళన్'లో ఆయన మాట్లాడారు. అలాగే ఆకాశవాణిలో 'మన్ కీ బాత్' 113వ సంచికలోనూ ప్రసంగించారు. 'దేశంలో తల్లులు, అక్కచెల్లెళ్ల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి. నా ఎర్రకోట ప్రసంగంలో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాను. మహిళలపై నేరాలు క్షమించరాని పాపాలని ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి చెబుతున్నాను. దోషులెవరైనా వదిలిపెట్టవద్దు. ఈ నేరాలను ప్రోత్సహించే వారిని కూడా విడిచిపెట్టకూడదు. ఈ సందేశం పై నుంచి కిందిస్థాయి వరకు వెళ్లాలి. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ మహిళల జీవితాలు, గౌరవాన్ని కాపాడడం సమాజం, ప్రభుత్వం సహా మనందరిపై ఉన్న అతి పెద్ద బాధ్యత' అని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన ప్రభుత్వాల కంటే గత పదేళ్లలో తన ప్రభుత్వం మహిళల కోసం ఎంతో చేసిందన్నారు. 2014 వరకు స్వయం సహాయక సంఘాలకు కేవలం రూ.25 వేల కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చారని, గత దశాబ్ద కాలంలో తన ప్రభుత్వం రూ.9 లక్షల కోట్లు ఇచ్చిందని తెలిపారు. జల్గావ్‌లో లక్షాధికారి సోదరీమణు(లఖ్‌పతి దీదీ)లతో ఆయన సంభాషించారు. 4.3 లక్షల సంఘాలకు చెందిన 48 లక్షల మంది సభ్యులకు రూ.2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. 'లఖ్‌పతి దీదీ స్కీం కేవలం మహిళల ఆర్థికాభివృద్ధికి మాత్రమే సంబంధించింది కాదు. ఇది భావితరాల సాధికారతకు సంబంధించింది. గత పదేళ్లలో కోటి మంది లక్షాధికారిణులను తయారుచేశాం. గత రెండు నెలల్లోనే 11 లక్షల మంది లక్షాధికారిణులు ఆవిర్భవించారు. త్వరలో మన దేశం మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరించనుందని మీరు వినే ఉంటారు. ఇందులో మహిళలదే అతిపెద్ద పాత్ర. అందుకే మీ కొడుకుగా, సోదరుడిగా మీ జీవితాలను సుఖమయం చేయాలని సంకల్పించాను. ఏటికేడాదీ మీ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటున్నాం. కేంద్రం 3 కోట్ల కొత్త ఇళ్లు నిర్మించనుంది. అవన్నీ మహిళలకే కేటాయిస్తాం' అని మోదీ వివరించారు.



జల్‌గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ సమ్మేళన్‌లో ప్రధాని మోదీ

సమష్టి కృషితో రాజకీయంగా ఎదగాలి...

రాజకీయ నేపథ్యం లేని యువత సమష్టి కృషితో రాజకీయాల్లో ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఇలాంటి వారే ఎదిగారని.. వారి స్ఫూర్తితో 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ఉపక్రమించాలని 'మన్ కీ బాత్'లో పిలుపిచ్చారు. 'కుటుంబ రాజకీయాలు కొత్త టాలెంట్‌ను అణగదొక్కుతున్నాయని కొందరు యువత నాకు తెలియజేశారు. చాలా మంది రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తిగా ఉన్నారు. సరైన అవకాశం, మార్గనిర్దేశం కోసం వారు ఎదురుచూస్తున్నారు. తమకు ఆసక్తి ఉన్నప్పటికీ.. తాత తండ్రుల నుంచి రాజకీయ వారసత్వం లేనందున రాలేకపోతున్నామని పలువురు లేఖల్లో తెలిపారు. వీరంతా సమష్టి కృషితో కచ్చితంగా రాజకీయాల్లో రాణించగలరు' అని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐఐటీ-మద్రాస్‌లో చదివి.. 'గెలాక్స్‌ఐ' అంతరిక్ష స్టార్టప్ ఏర్పాటు చేసిన యువ పారిశ్రామికవేత్తలతో ఆయన సంభాషించారు. హూలాక్ గిబ్బన్స్ (వానర జాతి)తో అసోంలోని బరేకురి గ్రామానికి చెందిన మోరన్ తెగవారికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'గిబ్బన్స్‌కు అరటిపండ్లు అంటే ఇష్టమని వారు తమ చేలో అరటి సాగు చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులు పుట్టినా, చనిపోయినా నిర్వహించే కార్యక్రమాలను ఈ వానరాల విషయంలోనూ చేస్తున్నారు. వాటికి పేర్లు కూడా పెడుతున్నారు. ఇటీవల... కనిపించని విద్యుత్ తీగల కారణంగా ఈ కోతులు ఇబ్బంది పడ్డాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు ప్రభుత్వానికి తెలియజేయడంతో సత్వరమే ఆ సమస్యను పరిష్కరించాం" అని మోదీ చెప్పారు.

తెలుగు భాష అద్భుతం

తెలుగు అద్భుతమైన భాష అని మోదీ 'మన్ కీ బాత్'లో కొనియాడారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచంలోని తెలుగు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 19న రక్షాబంధన్‌తో పాటు 'ప్రపంచ సంస్కృత దినోత్సవం' కూడా జరుపుకున్నామని మోదీ గుర్తుచేశారు. విదేశాల్లోనూ సంస్కృతంపై అధ్యయనాలు జరుగుతున్నాయని చెప్పారు.

కోల్‌కతా ఘటనపై 'బార్' తీర్మానం పేలవం

కోల్‌కతాలోని ఆర్.జి.కర్ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టరుపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనను తక్కువగా చూపించే ప్రయత్నం చేశారంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్‌పై మాజీ అధ్యక్షుడు ఆదిశ్ అగర్వాలా విమర్శలు చేశారు. ఆ సంఘటనను ఖండిస్తూ సిబల్ పేరున విడుదలైన బార్ తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకొని 72 గంటల్లోగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. అసలు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోకుండానే తీర్మానాన్ని ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. ఆ తీర్మానం చెల్లదని తెలిపారు.

ఆర్జీ కర్ మాజీ ప్రిన్సిపాల్ ఇంట్లో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ, కోల్‌కతా, ఆగస్టు 25: మహిళా జూనియర్ డాక్టర్ హత్యాచారానికి గురైన కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంతోపాటు కాలేజీలోని ఆయన ఆఫీసులో సీబీఐ ఆదివారం సోదాలు జరిపింది. ఇదే కేసుకు సంబంధించి మాజీ ప్రిన్సిపాల్ సంజయ్ వశిష్ఠ్‌తోపాటు మరో 13 మంది ఇళ్లలోనూ సీబీఐ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ప్రశ్నించారు. ఆస్పత్రికి సరఫరా అయ్యే పలు రకాల ఉత్పత్తులకు సంబంధించిన లావాదేవీలపైనా ఆరా తీశారు. సీబీఐ అవినీతి నిరోధక విభాగం ఈ సోదాల్లో పాలుపంచుకుంది. కాగా, సందీప్ ఘోష్ ఇంటికి ఉదయం 6 గంటలకు చేరుకున్న సీబీఐ బృందం.. గంటన్నరపాటు బయటే వేచి చూసింది. ఆ తర్వాతే ఘోష్ తన ఇంటి తలుపు తెరిచారు. మరోవైపు, ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సంజయ్ రాయ్‌పై ఫోరెన్సిక్ నిపుణులు ఆదివారం లై డిటెక్టర్ పరీక్ష జరిపారు.

లోకం తీరు



ఉక్రెయిన్ శాంతి సదస్సు భారత్‌లో!



మోదీకి జెలెన్‌స్కీ ప్రతిపాదన

కీవ్, ఆగస్టు 25: ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన లక్ష్యంగా రెండో విడత అంతర్జాతీయ శాంతి సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఇటీవల తనని కలిసిన ప్రధాని మోదీ వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించానని జెలెన్‌స్కీ విలేకరులకు వెల్లడించారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఈ సదస్సు నిర్వహణకు తగిన ప్రాంతమని అభిప్రాయపడ్డారు. అలాగే, భారత్‌తోపాటు సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే, స్విట్జర్లాండ్ దేశాలను కూడా సదస్సు నిర్వహణకు పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. కాగా, తొలి విడత ఉక్రెయిన్ శాంతి సదస్సు జూన్‌లో స్విట్జర్లాండ్‌లో జరిగింది. 60 దేశాల అధినేతలు హాజరయ్యారు. భారత్ నుంచి విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి మాత్రమే ఈ సదస్సులో పాల్గొన్నారు.


ప్రధాని మోదీకి పాక్ ఆహ్వానం

ఇస్లామాబాద్, ఆగస్టు 25: భారత ప్రధాని నరేంద్రమోదీని ఇస్లామాబాద్‌కు రావాల్సిందిగా పాకిస్థాన్ ఆహ్వానించింది. అక్టోబరు 15, 16 తేదీల్లో ఇస్లామాబాద్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) ప్రభుత్వాధినేతల మండలి (సీహెచ్‌జీ) సదస్సుకు హాజరు కావాల్సిందిగా మోదీతోపాటు ఇతర దేశాధినేతలను కోరింది. అయితే భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలు ప్రస్తుతం సరిగా లేని నేపథ్యంలో ఈ సదస్సుకు మోదీ వెళ్లడంపై సందేహాలు నెలకొన్నాయి. గతేడాది కజకిస్థాన్‌లో జరిగిన సీహెచ్‌జీ సదస్సుకు కూడా ప్రధాని మోదీ హాజరు కాలేదు. కాగా, సీహెచ్‌జీకి రష్యా, చైనా నేతృత్వం వహిస్తుండగా.. భారత్, పాకిస్థాన్ సభ్యులుగా ఉన్నాయి. రొటేషన్‌లో భాగంగా సీహెచ్‌జీ సదస్సు ఈసారి పాక్ అధ్యక్షతన ఇస్లామాబాద్‌లో జరగనుంది.

ఇజ్రాయెల్ X హెజ్బొల్లా

(మొదటి పేజీ తరువాయి)

దాడుల పేరుతో 100 యుద్ధవిమానాలతో తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్ సరిహద్దుల్లో 5 కిలోమీటర్ల మేర తమదేశం దిశగా హెజ్బొల్లా మోహరించిన రాకెట్ లాంచర్లే లక్ష్యంగా వైమానిక దాడులు జరిపింది. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు హెజ్బొల్లా తమ దేశంపై దాడులు చేయడానికి సిద్ధమైన విషయం తెలియడంతో.. ఆ సమయానికి అరగంట ముందే ఇజ్రాయెల్ తన దాడులు మొదలుపెట్టడం గమనార్హం. అటు నుంచి హెజ్బొల్లా కూడా.. పెద్ద సంఖ్యలో డ్రోన్లు, 320కి పైగా కత్యూష రాకెట్లతో 11 ఇజ్రాయెల్ సైనిక స్థావరాలు, బ్యారక్‌లు, ఐరన్ డోమ్ ప్లాట్‌ఫామ్స్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్టు ప్రకటించింది. అయితే, ఈ దాడుల్లో లెబనాన్‌వైపు ముగ్గురు చనిపోగా.. ఇజ్రాయెల్ వైపు ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదని సమాచారం. ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ.. ఇటీవలికాలంలో ఇజ్రాయెల్‌పై ఈ స్థాయి దాడి జరగడం ఇదే. కాగా.. తమ దేశ పౌరుల ప్రాణాలకు ఏర్పడ్డ ముప్పును తప్పించేందుకే తాము లెబనాన్‌లో దాడులు జరిపామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక, ఉత్తర ఇజ్రాయెల్ దిశగా హెజ్బొల్లా గురిపెట్టిన వేలాది రాకెట్లను తమ సైన్యం నిర్వీర్యం చేసిందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు క్యాబినెట్ మీటింగ్‌లో చెప్పారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. హెజ్బొల్లా దాడిపై సమాచారం నేపథ్యంలో ఆదివారం ఉదయాన్నే ఉత్తర ఇజ్రాయెల్‌లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు యుద్ధ సైరన్లు మోగించారు. ప్రజలంతా బాంబు షెల్టర్లకు దగ్గర్లో ఉండాలని ఇజ్రాయెల్ 'హోం ఫ్రంట్ కమాండ్' సూచించింది. ఆదివారం నాటి దాడులు కేవలం దక్షిణ లెబనాన్‌లో సరిహద్దులకు 5 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే చేశామని.. తమకు ముప్పు ఉందనుకుంటే లెబనాన్‌లో ఎక్కడైనా దాడులు చేస్తామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించగా.. ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండగా నిలుస్తామని అమెరికా అధికారులు వెల్లడించారు. కాగా.. తమ ప్రతీకారచర్యలకు ఇది ఆరంభం మాత్రమేనని హెజ్బొల్లా వర్గాలు పేర్కొన్నట్టు సమాచారం. ఈ పరిణామాలతో.. పశ్చిమాసియాలో పూర్తిస్థాయి యుద్ధం జరుగుతుందేమోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే.. "ఇజ్రాయెల్ పూర్తిస్థాయి యుద్ధాన్ని కోరుకోదు. కానీ, క్షేత్రస్థాయిలో జరిగే పరిణామాలకు అనుగుణంగా వ్యవహరిస్తుంది" అని ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి కాట్జ్ పేర్కొన్నట్టు రాయిటర్స్ వార్తాసంస్థ ఒక కథనంలో తెలిపింది. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ హమాస్ మధ్య సంధి చేసి.. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చేందుకు ఈజిప్టులో ఉన్నతస్థాయి చర్చలు జరుగుతున్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం. ఈ చర్చల్లో అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డైరెక్టర్ విలియమ్ బర్న్స్, ఖతార్ ప్రధాని మొహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ తాన్హి, ఈజిప్ట్ ప్రధాన నిఘా అధికారి అబ్బాస్ కమెల్ తదితరులు పాల్గొంటున్నారు. హమాస్ కూడా ప్రతినిధిని పంపింది.







లెబనాన్‌లోని ఓ ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడి, హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాహ్(ఇన్‌సెట్)

రాకెట్లు పాత మోడల్‌వేగానీ..

ఇజ్రాయెల్‌పై ఆదివారంనాటి దాడికి హెజ్బొల్లా ప్రధానంగా ఉపయోగించింది.. కత్యూష రాకెట్లు! ఎప్పుడో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో రష్యా అభివృద్ధి చేసిన అన్ గైడెడ్ రాకెట్లివి. ఆ తర్వాత రష్యా మరింత అధునాతన రాకెట్లను అభివృద్ధి చేసుకుందిగానీ.. హెజ్బొల్లా లాంటి సంస్థలు ఇప్పటికీ వాటిని వాడుతున్నాయి. ఇంకా చెప్పాలంటే హెజ్బొల్లా అమ్ములపొదిలో ప్రస్తుతానికి ఇవే ప్రధాన ఆయుధాలు!! వారు వాడే రాకెట్లు 20 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. అన్ గైడెడ్ కావడం ఒక లోపమే అయినప్పటికీ.. పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించగల సామర్థ్యం వీటి సొంతం. 2006లో జరిగిన లెబనాన్ వార్ సమయంలో కూడా ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా వేలాది కత్యూష రాకెట్లను ప్రయోగించింది. వీటితోపాటు.. షార్ట్ రేంజ్ రాకెట్లయిన ఫజ్ర్-1, ఫజ్ర్ 3, మీడియం రేంజ్ రాకెట్లయిన ఫజ్ర్ 5, ఎం-600, ఇరానియన్ జెల్‌జల్, ఫతే-110 వంటి మిస్సైళ్లు, యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైళ్లు, స్థానికంగా తయారుచేసిన అయాబ్, మిర్సాద్ డ్రోన్ల వంటివి హెజ్బొల్లా వద్ద ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో.. 'తాగేస్తున్నారు'!

» దేశంలో అత్యధిక మందుబాబులిక్కడే

» కేంద్ర ఆర్థిక శాఖ విభాగం 'నిపెప్' వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 25: 'మందుబాబులం.. మేము మందుబాబులం..' అన్న మాట తెలుగునాట నిజమైంది. దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం వినియోగం ఆధారంగా కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి సర్వే విభాగం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ(నిపెప్) తాజాగా విడుదల చేసిన అధ్యయనంలో వెల్లడించింది. ఈ అధ్యయనానికి నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్‌వో), కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే(ఎస్‌పీహెచ్ఎస్)లను ప్రామాణికంగా తీసుకుంది. దీని ప్రకారం.. మద్యంపై తెలంగాణ వార్షిక సగటు తలసరి వినియోగ వ్యయం రూ.1,623 ఉండగా, ఏపీలో రూ.1,306గా ఉంది. ఎన్ఎస్ఎస్‌వో ప్రకారం తర్వాత స్థానాల్లో ఛత్తీస్‌గఢ్ రూ.1,227, పంజాబ్ రూ.1,245, ఒడిశా రూ.1,156గా ఉన్నాయి. కేరళ రూ.486, హిమాచల్ ప్రదేశ్ రూ.457, తమిళనాడు రూ.330, రాజస్థాన్ రూ.308 వ్యయం చేస్తున్నాయి. ఇక, రెండు సర్వే సంస్థలు ఇచ్చిన నివేదికల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో తలసరి వినియోగ వ్యయం రూ.75, రూ.49గా ఉండడం విశేషం. మద్యం వినియోగం ద్వారా ఆయా రాష్ట్రాలు పన్నులు పిండుకుంటున్నాయని నిపెప్ అధ్యయనం తెలిపింది. మద్యంపై వస్తున్న పన్నులు రాష్ట్రాలకు మూడో అతి పెద్ద ఆదాయ వనరుగా ఉందని పేర్కొంది. జార్ఖండ్ అత్యల్పంగా 67 శాతం పన్నులు వసూలు చేస్తుండగా, గోవా అత్యధికంగా 722 శాతం ఆదాయం పొందుతున్నట్టు వివరించింది.

పాత-కొత్త కలయికే ఏకీకృతం!

» సీపీఎస్ కంటే ప్రయోజనాలు ఎక్కువే

» రాష్ట్రాల్లో అమలు చేస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లబ్ధి

పాత పెన్షన్ పథకం

ఇప్పటికీ ఉద్యోగ సంఘాలు తమకు పాత పెన్షన్ విధానమే కావాలని ఆందోళనలు చేస్తున్నాయి. అందుక్కారణం.. ఉద్యోగిపై ఎలాంటి భారం లేకుండానే భవిష్యత్‌కు ఓపీఎస్ విధానం భద్రత కల్పిస్తుండడమే..! అంతేకాకుండా.. ఒకవేళ పెన్షన్‌దారుడు మరణిస్తే.. అతనిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఎలాంటి కోత లేకుండా.. పూర్తి పెన్షన్ రావడమే.

- ఈ విధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు అమలయ్యేది. పెన్షన్ పథకం కోసం ఉద్యోగి జీతంలో ఎలాంటి కోతలు ఉండేవి కాదు. ఈ విధానంలో ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే సమయానికి చివరి నెలలో తీసుకున్న బేసిక్ వేతనంలో 50శాతాన్ని నెలసరి పింఛన్‌గా నిర్ధారించేవారు.
- దీంతోపాటు.. కరువు భత్యం(డీఏ) ఉండేది. అంటే.. ప్రభుత్వోద్యోగులకు ఎప్పుడు డీఏ పెరిగినా.. అది పెన్షనర్లకు కరువు ఉపశమనం(డీఆర్)గా వర్తించేది. వేతన సవరణ కమిషన్(పీఆర్సీ) సిఫారసులు కూడా అమలయ్యేవి.
- ఈ విధానంలో పెన్షన్ మొత్తం క్రమంగా పెరిగే అవకాశాలుండేవి. డీఏ, పీఆర్సీ ఎంత శాతం పెరిగితే.. పింఛన్ మొత్తం కూడా అంతే శాతం పెరిగేది. ఈ పథకానికి అనుబంధంగా సాధారణ భవిష్య నిధి(జీపీఎఫ్) వంటివి పదవీ విరమణ ప్రయోజనాలుగా ఉండేవి.
- పాత పెన్షన్ విధానంలో ఓ ఉద్యోగి రిటైర్ అయ్యాక రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీ వచ్చేది.
- ఓపీఎస్ అనేది ప్రభుత్వ ఖజానా నుంచి అందేది. ఒకవేళ పెన్షనర్ చనిపోతే.. అతనిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో పింఛన్ ప్రయోజనాలు అందేవి. పాత పెన్షన్ విధానంలో ఇంటి నిర్మాణానికి, పిల్లల పెళ్లిళ్లకు పీఎఫ్ నుంచి విత్‌డ్రాకు వెసులుబాటు ఉండేది

జాతీయ పెన్షన్ పథకం

అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానంపై ఉద్యోగ సంఘాలు వ్యతిరేకంగా ఉన్నాయి. ఉద్యోగి వేతనంలోంచి నెలనెలా కొంత మొత్తం వెచ్చించడం.. చివరకు వచ్చే పెన్షన్ చాలా తక్కువగా.. కొన్ని సందర్భాల్లో వితంతు, వృద్ధాప్య పింఛన్ల కంటే హీనంగా ఉండడమే కారణం.

- ఈ పెన్షన్ స్కీమ్‌ను కేంద్రంలో జాతీయ పింఛన్ పథకం(ఎన్‌పీఎస్)గా.. రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)గా అమలు చేస్తున్నారు.
- ఈ విధానంలో మూలవేతనం, డీఏను కలిపి.. దానిపై 10% ఉద్యోగి, 10% ప్రభుత్వం నెలనెలా జమచేయాలి. ఈ మొత్తాన్ని 100% ఎస్‌బీఐ, యూటీఐ, ఎల్ఐసీ షేర్లలో పెట్టేవారు. షేర్ విలువను బట్టి పెన్షన్‌లో రిటర్న్స్ చేరేవి.
- రిటైర్ అయ్యాక.. పొదుపు చేసిన దాంట్లో 60% లంప్సమ్‌గా ఇస్తారు. మిగతా దాంట్లో 40శాతాన్ని నెలవారీగా సమాన విలువగట్టి పింఛన్‌గా అందజేస్తారు. అంటే.. తీసుకునే జీతానికి.. చివరి బేసిక్ పేతో పోలిస్తే.. ఈ పింఛన్ చాలా తక్కువ. సర్వీసును బట్టి.. కొన్ని సందర్భాల్లో రూ.2వేలు.. అంతకంటే తక్కువ కూడా ఉండొచ్చు.

ఏకీకృత పెన్షన్ పథకం

- ఈ విధానం ఓపీఎస్, ఎన్‌పీఎస్/సీపీఎస్‌ల కలయికగా ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎన్‌పీఎస్‌తో పోలిస్తే.. యూపీఎస్ విధానం ఉద్యోగులకు పింఛన్ హామీని పెంచుతూ.. గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలకు భరోసా ఇవ్వనుంది.
- కనీసం 25 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యేవారికి పదవీ విరమణకు ముందు 12 నెలలు తీసుకున్న బేసిక్ పే+డీఏ మొత్తం సగటులో 50% పింఛన్‌గా వస్తుంది.
- కనీసం 10 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యే వారికి వారి సర్వీసు కాలాన్ని బట్టి పింఛన్ వస్తుంది. ఇది 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారితో పోలిస్తే.. తక్కువగా ఉంటుంది. అంటే.. పింఛన్ హామీ కనీసం రూ.10 వేలుగా ఉంటుంది.
- ఉద్యోగి మరణిస్తే.. పింఛన్‌లో 60% ఆయన/ఆమె కుటుంబ సభ్యులకు నెలవారీ పింఛన్‌గా అందుతుంది. డీఆర్ కూడా లభిస్తుంది. ఉద్యోగి రిటైర్ అయ్యాక గ్రాట్యుటీతోపాటు అదనపు ప్రయోజనాలుంటాయి.

మూడు పింఛన్ విధానాల్లో తేడాలివే!

ప్రయోజనం	ఓపీఎస్	సీపీఎస్/ఎన్‌పీఎస్	యూపీఎస్
ఉద్యోగి వాటా	లేదు	బేసిక్+డీఏపై 10%	బేసిక్+డీఏపై 10%
షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు	లేదు	ఉంది	ప్రభుత్వమే భరిస్తుంది
గ్రాట్యుటీ	ఉంది	ఉంది	ఉంది
పథకం మార్పిడి	ఉంది	లేదు	ఉంది
పెన్షన్	చివరి బేసిక్ +డీఏపై 50%	మూలధనంలో 40%లో వాటాలుగా..	చివరి 12 నెలల బేసిక్+డీఏ సగటుపై 50%
పీఆర్సీ	ఉంది	లేదు	లేదు
అదనపు పెన్షన్	ఉంది	లేదు	స్పష్టత రావాల్సి ఉంది
కుటుంబ పెన్షన్	ఉంది	ఐచ్ఛికం	60% ఉంటుంది
కరువు ఉపశమనం(డీఆర్)	ఉంది	లేదు	ఉంది
హెల్త్ కార్డులు	ఉన్నాయి	లేవు	స్పష్టత లేదు
కారుణ్య నియామకం	ఉంది	ఉంది	ఉంది
రిటైర్‌మెంట్ లంప్సమ్	పీఎఫ్ 100%	ఎన్‌పీఎస్‌లో 60%	స్పష్టత రావాల్సి ఉంది
విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు పెన్షన్	ఉంటుంది	ఉంటుంది	ఉంటుంది

యూటర్న్ మోదీ!



న్యూఢిల్లీ, ఆగస్టు 25: ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం కొత్తగా ప్రకటించిన 'యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)'ను కాంగ్రెస్ ఎద్దేవాచేసింది. ఈ యూపీఎస్‌లో 'యూ' అంటే మోదీ ప్రభుత్వ యూటర్న్‌లు అని అర్థమని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన 'ఎక్స్'లో స్పందించారు. జూన్ 4 (ఎన్నికల ఫలితాల రోజు) తర్వాత ప్రధాని మోదీ అహంభావంపై ప్రజాధికారం విజయం సాధించిందన్నారు. దీర్ఘకాలిక కేపిటల్ గెయిన్/ఇండెక్సేషన్, వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపడం, బ్రాడ్‌కాస్ట్ బిల్లు, సివిల్స్‌లో లేటరల్ ఎంట్రీపై కేంద్రం వెనక్కి తగ్గడాన్ని ప్రస్తావించారు. 'ఈ నిరంకుశ ప్రభుత్వం నుంచి 140 కోట్ల మంది భారతీయులను కాపాడేందుకు.. అది జవాబుదారీతనంతో వ్యవహరించేలా ఒత్తిడి కొనసాగిస్తాం' అని పేర్కొన్నారు. కాగా.. కొత్త యూపీఎస్ స్కీంను దళితులు, గిరిజనులు, ఓబీసీలపై దాడిగా ఏఐసీసీ మీడియా-పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా అభివర్ణించారు. 'పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వుడు కేటగిరీ వారికి వయో పరిమితి 40 ఏళ్లుగా ఉంది. యూపీఎస్‌సీలో 37 ఏళ్లు మాత్రమే. యూనిఫైడ్ పెన్షన్ స్కీం ప్రకారం.. పూర్తి పెన్షన్ అందాలంటే ఉద్యోగి 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకోవాలి. ఈ పరిస్థితిలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు ఈ సౌకర్యం ఎలా లభిస్తుంది' అని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ పార్టీకే చెందిన 'ప్రొఫెషనల్స్ కాంగ్రెస్' చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి ఆయనతో విభేదించారు. కొత్త స్కీంను ఆయన స్వాగతించారు.

ఇసుక కోసం కృత్రిమ మేధ


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అక్రమ నిల్వలు, రవాణా నియంత్రణకు చెక్

- ఇసుక పాలసీలో ఏఐ వినియోగానికి నిర్ణయం
- లైవ్ శాటిలైట్ డేటాకు అనుసంధానం
- రూపుదిద్దుకుంటున్న సమగ్ర ఇసుక పాలసీ
- 28న మంత్రి వర్గం ముందుకు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన ఇసుక అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానాన్ని ఆపేసింది. బినామీలను రంగంలోకి దించింది. ఆన్‌లైన్ చెల్లింపులు నిలిపేసి.. నదీ తీరాన్ని తోడేసింది.! ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఉచిత ఇసుక పాలసీతో ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. అయితే ఈ విధానంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కూటమి సర్కారు భావిస్తోంది. ఉచిత ఇసుక ప్రయోజనాలు, లక్ష్యాలను దెబ్బతీసే చర్యలను గుర్తించి ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు లైవ్ శాటిలైట్ డేటాతోపాటు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను వినియోగించాలని నిర్ణయించింది. త్వరలో తీసుకురానున్న ఇసుక సమగ్ర పాలసీలో దీన్నే ప్రాధాన్యతా అంశంగా చేర్చబోతోంది.

ఇసుక వాహనాలకు బ్యానర్లు..!

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా ఇప్పటికే లైవ్ శాటిలైట్ డేటాను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలోనూ అనేక ఆధునిక మార్పులొచ్చాయి. వీటిని కూడా జోడించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత టాస్క్‌లు నిర్వహించాలని సర్కారు కార్యాచరణ ప్రణాళిక రచిస్తోంది. ఇసుక అక్రమ నిల్వలను గుర్తించేందుకు, వాటి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా వాస్తవిక ప్రాంతాన్ని జియో సెన్సింగ్ చేసేందుకు ఈ సాంకేతికను ఉపయోగిస్తారు. ప్రస్తుతం ప్రభుత్వ నియంత్రణలో 84 ఇసుక స్టాక్ యార్డ్‌లున్నాయి. వర్షాకాలం తర్వాత మరికొన్ని పెరిగే అవకాశం ఉంది. ఇలా ప్రతీ స్టాక్ యార్డ్‌ను జీపీఎస్ డేటా పరిధిలోకి తీసుకొచ్చి మ్యాపింగ్ చేస్తారు. ఇవి కాకుండా.. మరెక్కడైనా భారీగా ఇసుక నిల్వలు ఉంటే శాటిలైట్ లైవ్ డేటాకు ఏఐ టెక్నాలజీని జోడించి వాటిని కనిపెట్టనున్నారు. తద్వారా తక్షణమే ఆ ప్రాంతాన్ని గుర్తించి గనుల శాఖ విజిలెన్స్, పోలీసు బృందాలను అక్కడికి పంపించి తనిఖీలు నిర్వహించేందుకు వీలుంటుంది. అది అక్రమ నిల్వే అని గుర్తిస్తే దాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకునేలా సమగ్ర ఇసుక పాలసీలో విధివిధానాలు పొందుపరుస్తున్నారు. ఉచిత ఇసుక తరలించే వాహనాలను ముందుగా ఏపీ గనులశాఖ డేటాలో రిజిస్టర్ చేయబోతున్నారు. వాటికి ఇసుక రవాణా పర్మిట్లు ఇస్తారు. సగటున ఒక కిలోమీటరుకు ఎంత మేర చార్జీ ఉండాలో ప్రభుత్వమే నిర్దేశించనుంది. ఆ తర్వాత వినియోగదారుడు ఇసుకను బుక్ చేసుకున్నాక ఈ వాహనాలను స్టాక్‌యార్డ్‌కు అనుమతిస్తారు. ఆ వాహనాలకు 'ఉచిత ఇసుక రవాణా వాహనం' అనే బ్యానర్ కడతారు. దాని కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా జీపీఎస్ పరికరాన్ని అమరుస్తారు. ఇలా రహదారులపై వెళ్లే ఇసుక వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ ఉందా..? ఉచిత ఇసుక రవాణా వాహనం బ్యానర్ ఉందా..? అది పర్మిట్ ఉన్న వాహనమేనా..? అని లైవ్ శాటిలైట్ డేటా ద్వారా గుర్తించేందుకు కృత్రిమ మేధను ఉపయోగిస్తారు. అంటే.. ఈ డేటాను విశ్లేషించడం ద్వారా ఏదైనా వాహనం అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే వెంటనే గుర్తించి రెగ్యులర్ పోలీసులు, గనుల విజిలెన్స్ విభాగాలను అప్రమత్తం చేయడం సాధ్యమవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఉచిత ఇసుక కోసం ప్రత్యేక వెబ్‌సైట్

ఉచిత ఇసుక పంపిణీ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. సమగ్ర ఇసుక పాలసీ ఆమోదం తర్వాత ఈ వెబ్‌సైట్ సెప్టెంబరు 11న అందుబాటులోకి రానుంది. ఇందులో రీచ్‌ల వారీగా బుకింగ్‌లు, ఇసుక లభ్యత, పెండింగ్‌లో ఉన్నవి, డిస్పాచ్ అయినవి వంటి కీలకమైన వివరాలు ఉంటాయి. రవాణా చార్జీల వివరాలను కూడా అందులో పొందుపరచనున్నారు. ఇవన్నీ కూడా సమగ్ర పాలసీలో పొందురచనున్నారు. ఇప్పటికే మార్గదర్శకాలను అధికారులు సిద్ధం చేశారు. అటవీ, పర్యావరణ శాఖల అనుమతులు తీసుకున్నాక ఫైలును ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపించనున్నారు. ఈ నెల 28న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఇది కేబినెట్ ముందుకు చర్చకు రానుంది.


జస్టిస్ సుజాతను సత్కరిస్తున్న సూర్యనారాయణస్వామి ఆలయ కమిటీ సభ్యులు

'అనంత'లో ఆలయాలు సందర్శించిన జస్టిస్ సుజాత

ఉరవకొండ, ఆగస్టు 25: అనంతపురం జిల్లాలోని పలు ఆలయాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత ఆదివారం సందర్శించారు. ఉరవకొండలోని గవిమఠం, మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి, బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయాలను కుటుంబ సభ్యులతో కలిసి ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తి వెంట జిల్లా అదనపు న్యాయాధికారి సత్యవాణి, ఉరవకొండ ఇన్‌చార్జి న్యాయాధికారి మంజుల, గ్రూప్ టెంపుల్ ఈఓ కృష్ణయ్య ఉన్నారు.

పెన్సిల్ ముల్లుపై బాల మురళీకృష్ణుడు!

- సూక్ష్మ కళాకారుడి నైపుణ్యం




నక్కపల్లి, ఆగస్టు 25: కృష్ణాష్టమిని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేశ్ తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చార్‌కోల్ పెన్సిల్ ముల్లుపై బాల మురళీకృష్ణుడి రూపాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. 8 మిల్లీమీటర్ల పొడవు, 14 మిల్లీమీటర్ల వెడల్పుతో తీర్చిదిద్దిన బాల మురళీకృష్ణుడి రూపం విశేషంగా ఆకట్టుకుంటోంది. దీనిని తీర్చిదిద్దేందుకు తాను ఐదు గంటలపాటు శ్రమించానని వెంకటేశ్ తెలిపారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

- పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలి: బొప్పరాజు

ఏలూరు అర్బన్, ఆగస్టు 25: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీజేఏసీ-అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్సీ కమిషనర్ రాజీనామా చేసినందున వెంటనే కమిషనర్‌ను నియమించి నిర్ణీత కాల వ్యవధిలోగా నివేదిక తెప్పించుకుని వీలైనంత త్వరగా కొత్త వేతన స్కేళ్లను అమలుచేయాలని కోరారు. ఆదివారం ఏలూరు జిల్లా ఏలూరులో ఏపీ జేఏసీ-అమరావతి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అడగకుండానే వారానికి ఐదురోజుల పనిదినాలు, వసతి, తదితర 8 అంశాల్లో సానుకూల నిర్ణయాలను ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు.

మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు కన్నుమూత

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి



ఒంగోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు (66) ఆదివారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. టీడీపీ నుంచి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన డేవిడ్ రాజు మండల వ్యవస్థ ఏర్పడిన తొలి ఎన్నికల్లోనే నాగులుప్పలపాడు మండల పరిషత్ అధ్యక్షుడిగా గెలుపొందారు. 1995 ఎన్నికల్లో అదే మండలం నుంచి జడ్పీటీసీగా ఎన్నికై ఎస్సీ రిజర్వ్ అయిన అప్పటి ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. టీడీపీ తరఫున 1999 ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2004లో అదే నియోజకవర్గం నుంచి, 2009లో యర్రగొండపాలెం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికల్లో యర్రగొండపాలెం నుంచి వైసీపీ తరఫున గెలుపొంది అనంతరం టీడీపీలో చేరారు. తర్వాత కాలంలో ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం రాకపోవడంతో ఇటీవల ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ తరఫున తన కుమారుడిని సంతనూతలపాడు నుంచి పోటీ చేయించారు. తెలుగుదేశం పార్టీలో వివిధ పదవులు చేపట్టిన ఆయనకు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఉధృతంగా సాగిన రోజుల్లో జిల్లాలో డేవిడ్‌రాజు వారికి పూర్తి అండగా నిలిచారు.

బంగ్లాదేశ్ పరిసరాల్లో అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం దక్షిణ బంగ్లాదేశ్ పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా వెళ్లి పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా వైపుగా పయనించనుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా.. ఉత్తరప్రదేశ్ పరిసరాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడి పశ్చిమ వాయవ్యంగా పయనించి మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో వాయుగుండంగా మారింది. ఇది ఆదివారం రాత్రికి మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారి గుజరాత్ మీదుగా అరేబియా సముద్రం మీదుగా పయనించనుందని వాతావరణశాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ అల్పపీడనం రెండు రోజుల్లో ఉత్తర ఒడిశా వైపుగా పయనించే క్రమంలో ఉత్తరాంధ్రలో వర్షాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా... ఆదివారం కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురవగా అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. దేశంలో అత్యధికంగా తిరుపతిలో 38.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధం


ఆర్మీ ర్యాలీ నిర్వహణకు సిద్ధమైన పోర్టు స్టేడియం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని పోర్టు స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించేందుకు సర్వం సిద్ధమయింది. నగర పరిధి అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో ఈ నెల 26 తెల్లవారుజామున ప్రారంభమయ్యే ర్యాలీ వచ్చే నెల ఐదో తేదీ వరకు జరగనుంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లాకు చెందిన అభ్యర్థులు ఇందులో పాల్గొననున్నారు. ప్రతిరోజూ 500 నుంచి 800 మంది వరకు ర్యాలీలో పాల్గొంటారని, ఈ మేరకు ఇప్పటికే అభ్యర్థులకు వివరాలను తెలియజేశామని అధికారులు తెలిపారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీలు, వేళల్లో ర్యాలీలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్‌మన్ పోస్టులను భర్తీ చేసేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

అమెరికాలో ఆంధ్రా డాక్టర్ మృతి

- దుండగుల కాల్పుల్లో దుర్మరణం
- ఆరోగ్య రంగంలో 38 ఏళ్లుగా సేవలు
- టస్కలూసాలో ఓ వీధికి ఆయన పేరు
- కొవిడ్ సమయంలో సేవలకు అవార్డులు


డాక్టర్ పేరంశెట్టి రమేష్ బాబు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25: అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ పేరంశెట్టి రమేశ్ బాబు(64) దుర్మరణం చెందారు. టస్కలూసా నగరంలోని ఆయన ఇంటి సమీపంలో ఉన్న కారు షెడ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఈ దారుణం జరిగింది. అమెరికాలో అనేక ఆసుపత్రులను నిర్వహించిన రమేశ్‌బాబు.. క్రిమ్సన్ నెట్‌వర్క్ పేరుతో పనిచేస్తున్న స్థానిక వైద్యాధికారుల బృందానికి వ్యవస్థాపకుడు. ఈ బృందానికి మెడికల్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య రంగంలో 38 సంవత్సరాల పాటు ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా టస్కలూసాలోని ఓ వీధికి ఆయన పేరు పెట్టారు. కొవిడ్-19 మహమ్మారి సమయంలో ఆయన అందించిన విస్తృతమైన సేవలకు పలు అవార్డులు కూడా అందుకున్నారు. చేనేత కుటుంబానికి చెందిన పేరంశెట్టి చిన్న గురునాథం-రాజేశ్వరమ్మ దంపతుల మూడో సంతానం డాక్టర్ రమేష్‌బాబు. మేనకూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి, తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తర్వాత అమెరికా వెళ్లి జమైకాలో పీజీ వైద్యవిద్య పూర్తిచేసి డాక్టర్ ప్రాక్టీసు పెట్టి మంచిపేరు తెచ్చుకున్నారు. అక్కడే డాక్టర్‌గా పనిచేస్తున్న శ్రీలతను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు అమెరికాలో స్థిరపడ్డారు. ఇండియాలో ఉన్న తన సోదరులు, వారి పిల్లలు అమెరికాలో స్థిరపడటానికి కూడా తనవంతు సహకారం అందించారు. రమేశ్ బాబు మృతి సమాచారంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

మలేసియాలో మ్యాన్‌హోల్‌లో పడిన కుప్పం మహిళ

- మూడు రోజులైనా లభ్యంకాని ఆచూకీ
- ఇమ్మిగ్రేషన్ అధికారులకు సీఎం చంద్రబాబు ఫోన్


జయలక్ష్మి

కుప్పం, ఆగస్టు 25: మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో మ్యాన్‌హోల్‌లో పడిన చిత్తూరు జిల్లా కుప్పం మహిళ జయలక్ష్మి ఆచూకీ మూడ్రోజులైనా లభ్యం కాలేదు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని అనిమిగానిపల్లెకు చెందిన ఆరేడు కుటుంబాలు ఫ్యాన్సీ వస్తువులు తీసుకుని కౌలాలంపూర్ వెళ్లి వ్యాపారం చేస్తుంటారు. వారిలో జయలక్ష్మి కుటుంబం కూడా ఒకటి. ఆమె తన భర్త, కుమారుడితో కలిసి 20 రోజుల క్రితం కౌలాలంపూర్ వెళ్లి ఒక దుకాణం ముందు, ఫ్యాన్సీ వస్తువుల విక్రయం మొదలు పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం (ఈ నెల 23న) ఉదయం టిఫిన్ చేసేందుకు వెళ్తుండగా హఠాత్తుగా రోడ్డు కుంగింది. సరిగ్గా డ్రైనేజీ మ్యాన్ హోల్ మీద ఉన్న జయలక్ష్మి మురుగు నీటి కాలువలో పడిపోయింది. అక్కడి అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమాచారం ఇవ్వడంతో సీఎం చంద్రబాబు, బాధితురాలి కుమారుడు సూర్యకు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. 23వ తేదీ రాత్రి 12 గంటలదాకా గాలించిన మలేసియా అధికారులు తర్వాత చేతులెత్తేశారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు మలేసియాలోని భారత దౌత్య కార్యాలయం అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. వాళ్లు అక్కడి అధికారులతో మాట్లాడారు. దీంతో జయలక్ష్మి కోసం మళ్లీ గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి. దీనిపై జయలక్ష్మి దగ్గరి బంధువు, టీడీపీ నాయకుడు ఆర్ముగం మాట్లాడుతూ.. ఆదివారం రాత్రిదాకా ఆమె ఆచూకీ లభ్యం కాలేదన్నారు.

రెండేళ్లా.. ఐదేళ్లా!

- రవాణా శాఖలో బదిలీలపై గందరగోళం
- ఆర్థిక శాఖ ఆదేశాలే ఫైనల్ అంటున్న కమిషనర్
- రెండేళ్లకే బదిలీలు చేసుకోవచ్చంటున్న కార్యదర్శి

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే శాఖల్లో ఒకటైన రవాణాశాఖలో అవినీతి దారులు కూడా ఎక్కువే. ఆ దారుల్లో పోస్టింగ్స్ దక్కించుకోవడం కోసం ఎంవీఐలు నాలుగు మార్గాల్లో ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రతి రెండేళ్లకోసారి బదిలీలు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి ప్రయత్నం ఇప్పుడు రవాణా శాఖలో గందరగోళానికి దారి తీసింది. ప్రభుత్వం(ఆర్థిక శాఖ) ఐదేళ్లు దాటిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ఇటీవలే మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇదే అవకాశంగా ఎంవీఐలు, ఆర్టీవోలు బదిలీల కోసం చక్రం తిప్పారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి విజయవాడలోని ఒక హోటల్లో సమావేశం ఏర్పాటు చేసి బదిలీలు కోరుకొంటున్న వారి సమ్మతితో రెండేళ్ల జీవో తీసుకురాగలిగినట్లు రవాణా శాఖలో ప్రచారం జరుగుతోంది. ఈ నెల 17న ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవో నంబర్ 75కు భిన్నంగా రవాణా శాఖ జీవో 23విడుదల చేసింది. శాఖాధిపతి సౌలభ్యం కోసం బదిలీలు చేసుకోవచ్చంటూ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే జీవోలో పేర్కొన్నారు. ఆదాయ మార్గాల్లోని పోస్టింగ్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్న ఎంవీఐలు, ఆర్టీవోలు, డీటీసీలు సైతం ఆర్థిక పరమైన ఆఫర్లతో పైరవీలు మొదలు పెట్టారు. ఈ విషయం కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా దృష్టికి రావడంతో కొందరు ఉన్నతాధికారులతో చర్చించారు. ఎలాంటి వివాదాలకూ తావివ్వకూడదని, ప్రభుత్వ మార్గదర్శకాలే పాటించాలంటూ అంతర్గత సర్క్యులర్ జారీ చేశారు. రెండేళ్లకు తప్పనిసరిగా బదిలీ చేయాలన్న నిబంధన ఇప్పుడు అమలు చేయవద్దంటూ ఉన్నతస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో బదిలీల ఆశలు పెట్టుకున్న ఎంవీఐలు, ఆర్టీవోలు ఉలిక్కిపడ్డారు. ఇదేంటని రవాణా శాఖ మంత్రికి చెప్పే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదని తెలిసింది.

యూపీఎస్.. కేంద్ర ప్రభుత్వ గారడీ

- కొత్త పెన్షన్ స్కీంపై సీపీఎస్ ఉద్యోగుల ఆగ్రహం

విజయవాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తామంటున్న యూపీఎస్ పెన్షన్ స్కీమ్‌పై రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. యూపీఎస్‌లోకి వెళ్లడమంటే ఉద్యోగి తన ప్రాన్ అకౌంట్‌లో ఉన్న సంపదను ప్రభుత్వానికి పుణ్యానికే వదిలేయటమేనని చెబుతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగుల నుంచి కంట్రిబ్యూషన్ లేకుండా పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కిందటి వైసీపీ ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) పేరుతో గారడీ చేసిన విధంగా కేంద్రంగా యూపీఎస్ పేరుతో చేస్తోందని మండిపడుతున్నాయి. ఈ మేరకు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీఎం దాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం ఎవరి ప్రయోజనం కోసమని, దీనికంటే పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయటమే ప్రభుత్వాలకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా తలాతోక లేకుండా ఇస్తున్న కేంద్ర ప్రభుత్వ లీకులను తాము పట్టించుకోవటం లేదని ఏపీసీపీఎస్ఈ (ఏపీజేఈఏ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు పేర్కొన్నారు. యూపీఎస్‌లో కేంద్రం ప్రకటించిన వివరాలు అస్పష్టంగా ఉన్నాయన్నారు.

పడకేసిన పశువైద్యం



ఖాళీగా పశువైద్య సిబ్బంది పోస్టులు

- గ్రామీణంలో అరకొరగా సేవలు
- గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం
- కొందరు వైద్యులు పట్టణాలకే పరిమితం!
- మొబైల్ అంబులెన్స్‌లే దిక్కు

గ్రామీణంలో రైతన్నలకు వ్యవసాయం ఎంతగా జీవనాధారమో.. పాడి పెంపకం కూడా అంతే ముఖ్యం! అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యం పుణ్యమా అని అరకొరగానే సేవలందుతున్నాయి. పశువైద్య పోస్టులు భారీగా ఖాళీలుండడంతో పశువులకు వైద్యం గగనమైపోయింది. కొన్నిచోట్ల పశువైద్యులున్నా వారు పట్టణప్రాంతాల్లో నివాసముంటూ.. తమ పరిధిలో పారా వెటర్నరీ, గోపాలమిత్రలు, అటెండర్లతో నెట్టుకొస్తున్నారు! ఫలితంగా ఆశించిన సేవలందడంలేదని పశుపోషకులు వాపోతున్నారు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ పశువైద్యం పడకేసింది! పశువైద్యులు, పారా మెడికల్ సిబ్బంది కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వం పశువైద్యుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందటం లేదు. కేవలం అంబులెన్స్‌ల్లో ఉండే సిబ్బందితోనే వైద్యం చేయిస్తున్న పరిస్థితి నెలకుంది. రాష్ట్రవ్యాప్తంగా 1,790 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల్లో దాదాపు 300 పోస్టులు ఖాళీలున్నాయి. 3,121 పారా వెటర్నరీస్ పోస్టుల్లో 690 ఖాళీలున్నాయి. గత ప్రభుత్వం 9,844 గ్రామ పశువైద్య సహాయకులను నియమిస్తామని చెప్పి, 3,739 పోస్టులు ఖాళీగా ఉంచింది. రాష్ట్రవ్యాప్తంగా పశువైద్యశాలలు, జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో 2,800 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు మంజూరై ఉండగా, అందులో 1,832 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో గ్రామాల్లో పశుపోషకులకు ఆశించిన సేవలు అందకుండా పోతున్నాయి. కేవలం గతంలో టీడీపీ ప్రభుత్వం 2,600మంది గోపాలమిత్రలను నియమించగా, వారిలో 370మంది సచివాలయ పోస్టులకు ఎంపిక కాగా, మిగతా 2,240 మంది పని చేస్తున్నారు. వీరితోనే ఆయా గ్రామాల్లో పశువైద్యం చేయిస్తున్నారు.

గోపాలమిత్ర, అటెండర్లతోనే సేవలు!..

పశువైద్యంలో పట్టా ఉన్నా వారిలో కొంత మంది వైద్యులు అర్బన్ ప్రాంతాల్లో నివాసం ఉంటూ, పరిపాలన విభాగాల్లో పోస్టులు వేయించుకుని, గ్రామీణ పశువైద్యశాలల ముఖం కూడా చూడటం లేదు. కొంత మంది గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యులుగా ఉన్నా.. పారా వెటర్నరీస్, గోపాలమిత్ర, అటెండర్లతో పని చేయిస్తూ, నామమాత్రంగా పని చేస్తూ, తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్రంలో రెండు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, 12 వెటర్నరీ పాలిక్లినిక్‌లు, 323 ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్, 1,577వెటర్నరీ డిస్పెన్సరీలు, 1,218రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు ఉన్నాయి. వివిధ రకాల వెటర్నరీ ల్యాబ్‌లు 171ఉన్నాయి. ట్రైనింగ్ సెంటర్లు, లైవ్‌స్టాక్ ఫార్మ్‌లు 16ఉన్నాయి. 340 మొబైల్ అంబులేటరీ వెటర్నరీ క్లినిక్‌లు ఉన్నాయి. చాలా చోట్ల గ్రామీణ పశువైద్యశాలల్లో సేవలు అరకొరగా మారడంతో పశుపోషకులు మొబైల్ అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. కానీ నిర్వహణ లేక కొన్ని చోట్ల అంబులెన్స్‌లు కూడా మూలపడ్డాయి.

డిప్యుటేషన్లతో తంటా...

రాష్ట్రంలో 62లక్షల గేదెలు, 46లక్షల ఆవులు, 55లక్షల మేకలు, కోటి76లక్షల గొర్రెలు, 10లక్షల కోళ్లతో కలిపి మొత్తం 3.40కోట్ల పశుగణం ఉండగా, ఈ స్థాయిలో గ్రామాల్లో పశువైద్య సిబ్బంది లేరని సమాచారం. ఈ శాఖకు మంజూరైన పోస్టుల్లో ఖాళీలను ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడం, పోస్టు కేటాయించిన చోట పని చేయకుండా ప్రధాన కార్యాలయాలు, నగరాలు, పట్టణాలకు డిప్యుటేషన్ వేయించుకోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలు పేలవంగా మారాయి. ఇక నాణ్యమైన పాల ఉత్పత్తి, పశుపోషకులకు ఆర్థిక భారం తగ్గించేందుకు గతంలో ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన మిశ్రమ దాణ, సైలేజ్ గడ్డి, టీఎంఆర్ వంటివి సరఫరా చేసిన సంస్థలకు గత ప్రభుత్వం బకాయిలను చెల్లించకుండా, చేతులెత్తేసింది. ప్రస్తుత ప్రభుత్వమైనా పశువైద్య సేవల్ని మెరుగుపర్చి, రాయితీల దాణా, అవసరమైన వ్యాక్సీన్లను సరఫరా చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.

ఆయిల్‌ఫెడ్‌ను దోచేశారు

- గత ఐదేళ్లు అవకతవకలతో సంస్థ నిర్వీర్యం
- పీలేరులో సంస్థ భూమి కబ్జా
- 'అనంత'లో భూమి లీజుకు రెక్కలు
- అనామక బ్యాంక్‌లో డిపాజిట్‌తో సొమ్ము గల్లంతు
- 30 లక్షలు చెల్లించినా ఇంకా అందని వాహనం
- నాటి ప్రభుత్వ పెద్దలతో అంటకాగిన కీలక అధికారి
- పెదవేగి కర్మాగారానికి కోట్లు వెచ్చించినా ఫలితం శూన్యం
- రాష్ట్రంలో రైతులకు తెలంగాణ కన్నా తక్కువ ధర
- రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇచ్చే విధానానికీ స్వస్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ఆయిల్‌ఫెడ్‌లో గత ఐదేళ్లు అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఆయిల్‌ఫెడ్‌కు చెందిన విలువైన భూములను సంరక్షించడంలో అధికారులు విఫలమయ్యారు. ఆయిల్‌ఫెడ్ కీలక అధికారి వైసీపీ ప్రభుత్వ పెద్దలతో అంటకాగడం ద్వారా అన్ని వసతులున్న సంస్థ భూమిని అతి తక్కువ ధరకు లీజుకివ్వడం, విలువైన భూమిని వైసీపీ నేత అనుచరులు కబ్జా చేసినా చూస్తూ ఊరుకున్నారనే ఆరోపణలున్నాయి. కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆ అధికారి వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి ఆయిల్‌ఫెడ్‌ను నిర్వీర్యం చేశారన్న విమర్శలున్నాయి. అనంతపురంలోని 22 ఎకరాల భూమిని అతి తక్కువ లీజుకు ఇచ్చి సంస్థ ఆదాయానికి గండికొట్టారు. అనంతపురంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ఆయిల్‌ఫెడ్ భూముల్లో కార్యాలయ భవనాలు, ఆరు గోదాములు ఉన్నాయి. నాటి సీనియర్ మంత్రి ఈ భూమిని జగన్ బంధువులకు చెందిన ఎలక్ట్రికల్ కంపెనీకి తక్కువ ధరకు లీజుకు ఇప్పించారని చెప్తున్నారు. లీజుదారులు ఈ భూమిని సబ్‌లీజుకిచ్చి, ఎక్కువ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లా పీలేరులో ఆయిల్‌ఫెడ్ కోసం సేకరించిన 64 ఎకరాల భూమిలో కొంత ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించారు. అక్కడ 1989-94 మధ్య వేరుశనగ విత్తన, ఆయిల్ పరిశ్రమ పెట్టి, 1999లో మూసేశారు. అందులో ఉన్న ఎకరం భూమిని గతేడాది అప్పటి ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారు. ఇక ఏలూరు జిల్లా పెదవేగిలోని ఆయిల్‌పామ్ కర్మాగారం మరమ్మతులకు గత ప్రభుత్వం దాదాపు రూ.10కోట్లు ఖర్చు చేసింది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే అనుచరులతో ఏర్పడిన కమిటీ కర్మాగారాన్ని ఆధునికీకరిస్తున్నామంటూ కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం. ఆ కర్మాగారంలో ముడి చమురు నిష్పత్తి తక్కువ వస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రాష్ట్ర విభజనకు ముందు నుంచీ ఆయిల్‌పామ్ రైతులు గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం బాగు చేశామని చెప్పినా.. తాజా పండ్లలో 16.5% మించి చమురు రావడం లేదు. అదే తెలంగాణలో 19.5% చమురు వస్తోందని రైతులు చెప్తున్నారు. పాత కర్మాగారానికి కోట్లు వెచ్చించే కన్నా.. కొత్త మిషనరీని తెప్పించవచ్చని రైతులు మొత్తుకున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. మన రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ధరకు పెదవేగి కర్మాగారంలో వచ్చే శాతాన్నే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటున్నందున తెలంగాణ కన్నా రాష్ట్రంలో ఆయిల్‌పామ్ రైతులకు ఆశించిన ధర రావట్లేదు. గతంలో వేరుశనగ విత్తనాలను సేకరించి, రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసిన ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రస్తుతం అలాంటి పనులేమీ చేయడం లేదు. ఆయిల్‌ఫెడ్ మూలధనాన్ని అనామక బ్యాంక్‌లో డిపాజిట్ చేయడంతో 2022లో సొమ్ము గల్లంతైంది. రికవరీకి నెలల సమయం తీసుకున్నారు. ఆయిల్‌ఫెడ్‌లో పని చేసే ఉద్యోగులకు 60ఏళ్లకే రిటైర్మెంట్ అని ప్రభుత్వం నిర్దేశించగా, ఆ వయసు దాటినా 10 మంది కోర్టు ఉత్తర్వులతో కొనసాగుతున్నారు. ఈ సంస్థ కోసం ఖరీదైన వాహనం కొనుగోలు చేయడానికి ఒక డీలర్‌కు రూ.30లక్షలు అడ్వాన్స్ ఇచ్చినా.. వాహనం రాలేదని సమాచారం.

ముసుగుల్ని సహించని అక్షరం

కథలు, కవితలు, స్మృతి వ్యాసాలూ కూడా రాసినా గానీ కాశీభట్ల వేణుగోపాల్‌ను ప్రధానంగా నవలా రచయిత గానే పాఠకులు గుర్తుంచుకుంటారనుకుంటాను. ఆ నవలలు అలాంటి ఇతివృత్తాలతో, అలాంటి శైలితో తెలుగులో ఆయనొక్కరి దగ్గరే దొరుకుతాయి. 'నేనూ–చీకటి', 'దిగంతం', 'తపన', 'తెరవని తలుపులు', 'మంచు పూవు' లాంటి నవలలు తెలుగు సాహిత్యంలో ఆయన ప్రత్యేక సంతకంగా నిలుస్తాయి. 'నవలా శిల్పం' అన్న ఈ శీర్షిక కోసం కాశీభట్లను మాట్లాడించాలని జూలై నెలలో ఫోన్ చేశాను. ఆయన ప్రశ్నలు పంపమన్నారు. కానీ పంపిన ప్రశ్నలకు దేనికది జవాబు ఇవ్వకుండా అంతా కలిపి ఒకే చిన్న వ్యాసంలా రాశారు. అందులో కూడా నేను అడిగిన ప్రశ్నలన్నింటికీ జవాబులు లేవు. తర్వాత ఫోన్ చేసి వాటి గురించి అడిగాను. ఆ సంభాషణలో కూడా ఆయన్నుంచి పెద్దగా జవాబులు రప్పించలేకపోయాను. దాదాపు ఐదేళ్ళ గాప్ తర్వాత నేను చేసిన ఈ ఫోన్ కాల్స్‌లో ఆయన గొంతు చాలా మారిపోయి వినపడింది.

పదం పదం కూడబలుక్కున్నట్టు మాట్లాడుతున్నారు. దరిదాపుల్లో పొంచి ఉన్న మరణమే ఆ అలసటకి కారణమేమో. ఏదేమైనా ఆయన్ని నవలా రచన మీద మాట్లాడిద్దాం అన్న నా ప్రయత్నం అసంపూర్తిగా మిగిలింది. ఆగస్ట్ 19న ఆయన వెళ్ళిపోయారు.

కాశీభట్ల ఈ నిష్క్రమణ కోసం చాలా కాలం నుంచే పెట్టే బేడా సర్దుకుని సిద్ధంగా ఉన్నారేమో అనిపిస్తుంది. అంటే జీవితం పట్ల ఏదో నిరాశతో కాదు. 'మళ్ళీ ఎగరాలని...' ఆశ ఎప్పుడూ ఉంది. కానీ అప్పటిదాకా ఎలా పడితే అలా వాడిన శరీరం త్వరలోనే పగ తీర్చుకుంటుందని ఆయనకి తెలుసు. 2013లో ఒక వెబ్‌మేగజైన్ కోసం ఆయన్ని ఇంటర్వ్యూ చేశాను. ఆ సంభాషణలో ఆయన "ఇదే నా చివరి ఇంటర్వ్యూ అవుతుందేమో" అన్నారు. ఆ తర్వాత అనారోగ్యాలతో చేతనైనంత యుద్ధం చేస్తూ, మరణాన్ని వీలైనంత వాయిదా వేసి, పదేళ్ళ తర్వాత, ఇలా చివరి ఇంటర్వ్యూ మళ్ళీ నాకే ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ అసంపూర్ణమైన ఇంటర్వ్యూనే ఇక్కడ ఇస్తున్నాను. ఇది నేను అనుకున్నట్టు నవలల మీద సాగలేదు. ఐతే 1997లో నా పదిహేనేళ్ళ వయసులో ఆయన అక్షరంతో మొదటి పరిచయం అయినదగ్గర్నుంచీ ఇరవై ఎనిమిదేళ్ళ వయస్సులో 2010లో స్వయంగా ఆయనతో పరిచయం అయ్యేదాకా ఒక పాఠకుడిగా నాకు ఆయన నవలలతో, శైలితో దగ్గరి పరిచయం ఉంది. నవలా రచన మీద కాశీభట్ల అభిప్రాయాలేమిటో నాకు తెలుసు.

రచన అనేది బుద్ధిపూర్వకంగా, ఆద్యంతం అంతా తెలిసి చేసే పని అని ఆయన ఎప్పుడూ అనుకోలేదు. పెన్ పుచ్చుకొని ఖాళీ కాయితం ముందు కూర్చుని ఏదైనా రాయటానికి పూనుకోవటం అంటే– ఆయన దృష్టిలో– అది తెలీనిదేన్నో వెతుక్కుంటూ మొదలుపెట్టే ప్రయాణం ("a journey in seach of an unknown"). ఆ వెతుకులాట కూడా నింపాదిగా సాగేది కాదు. అందులో ఒక తొందర, తరుముడు ఉంటుంది, ముగింపు చేరాకే ఊపిరాడుతుందన్న వేగం ఉంటుంది. "నా పుస్తకాలేవీ వందపేజీలు దాటవు. నేను చెప్పదల్చుకున్నది అంతా కండెన్స్‌డ్‌గా ఉంటుంది. I hurry towards the end. చివరి వాక్యం కోసం పరిగెడుతుంటాను. అక్కడికి వచ్చాకా 'ఆహ్' అన్న రిలీఫ్" అంటారు. అప్పట్లో నేను పనిచేస్తున్న వెబ్‌మేగజైన్‌కి ఒక కథ పంపితే ఆయన చేతి రాతని మొదటి సారి చూశాను. స్కూలు పిల్లలు వాడే లాంటి సింగిల్ రూల్ నోట్ బుక్‌లో ఎరుపు బాల్ పాయింట్ పెన్‌తో మూడేసి చుక్కల పంక్చువేషన్ ఎడా పెడా వెదజల్లుతూ రాశారు. అది ఎన్నో డ్రాఫ్ట్ అని అడిగితే "మొదటి డ్రాఫ్ట్" అన్నారు.



"ఇన్ని గంటలు అని పెట్టుకుని రాయడం నాకు చేత కాదు. ఒక్కోసారి కొన్ని వారాల పాటు దాని జోలికి వెళ్లను. నా రచన ఇంటెన్స్‌గా కనపడుతుందేమో గానీ నేను చాలా లేజీ రైటర్‌ని."

ఆయనకు రచయితగా చాలా ఆలస్యంగా గుర్తింపు వచ్చింది. నలభై మూడేళ్ళ వయస్సులో ఆయన మొదటి నవల 'నేనూ – చీకటి' ఆంధ్ర ప్రభలో సీరియలైజ్ అయ్యింది. ఎప్పుడో ఇరవై ఏళ్ళ వయస్సులో ఉండగా రాసిన 'రంగనాయకి లేచిపోయింది' అన్న మొదటి కథ పబ్లిష్ ఐనప్పుడు అది చదివి ఆయన గురువు దావూద్ సాహెబ్ అన్న మాటలే కాశీభట్లను ఆ తర్వాత పాతికేళ్ళ పాటు ఏమీ పబ్లిష్ చేయకుండా చేశాయి: "ఒరే నువ్వు చాలా బాగా రాస్తున్నావు. కానీ నీ మెదడింకా ఎదగాల్సి వుంది. దానికి నీకు పుస్తకాలకంటే మనుషులెక్కువ పని చేస్తారు. ప్రపంచాన్ని విస్తృతంగా పర్యటించటానికి ప్రయత్నించు. అధ్యయనం చేయి. రాసిన వాక్యాన్ని సపోర్ట్ చేసుకోగలవూ అన్నప్పుడే ఒక వాక్యాన్ని రాయి. పదిమంది పది ప్రశ్నలేస్తే ఆ పదిమందినీ కన్విన్స్ చేసేట్టు ఆ వాక్యం ఉండాలి. లేదంటే ఆ వాక్యాన్ని నీకై నువ్వు సపోర్ట్ చేసుకునేట్టుగా ఐనా ఉండాలి. అంతవరకూ రాయద్దురా," అన్నాడట. గురువు మాటని అక్షరాలా పాటించాడాయన. సైకిలెక్కి దేశమంతా తిరిగాడు. ప్రతి వాక్యం వెనుకా బలంగా నిలబడగలనన్న నమ్మకం వచ్చేదాకా రాయలేదు. అలా పాతికేళ్ళ పాటు దేన్నీ పబ్లిష్ చేయకుండా నిశ్శబ్దంగా ఉండిపోయి, నలభై మూడో ఏట ఒకేసారి 'నేనూ–చీకటి' ప్రచురించేసరికి, తెలుగు సాహిత్య లోకం ఉలిక్కి పడింది. శేషేంద్ర శర్మ ఆ నవలని "బౌద్ధిక భూకంపం" అన్నారు.

ఆ నవలలోనూ, ఆ తర్వాత రాసిన ప్రతి నవలలోనూ– బైట సమాజానికి కనపడని మనిషిలోని చీకటి తావుల గురించి ఎక్కువ రాశారు. ఆ చీకట్లను దాచుకోవటానికి మనిషి తొడిగే ముసుగుల గురించి రాశారు. మననం చేసుకోవటానికి కూడా మనమే సిగ్గుపడే ఆలోచనలకి నిర్మొహమాటమైన అక్షరాల్ని ఇచ్చారు.

వీటి గురించే ఎందుకు రాయాలని అడిగితే ఆయన చెప్పిన జవాబు: "మామూలు విషయాలు చెప్పటానికి చాలామంది ఉన్నారు. జీవితాన్నీ ప్రపంచాన్నీ సౌందర్యవంతం చేయటానికీ, మనసును చల్లబరచటానికీ, ఉపశమనంగా రాయటానికీ కోట్లాది మంది రచయితలున్నారు. నాలాంటి వాడు మధ్యలో ఎక్కడో ఉంటే తప్పేం లేదు కదా. ఇప్పుడు కాదు, ఇంకెన్ని రాసినా నేను డార్కర్ సైడ్ ఆఫ్ లైఫ్ గురించే రాస్తాను. ఈ లాబరింత్ (labyrinth)ను నేను ఎక్స్‌ప్లోర్ చేస్తూనే వెళ్తున్నాను. బయటకు దారి దొరుకుతుందేమో తెలియదు. దొరకదేమో కూడా. By the time I'll be dead. నేను చచ్చిపోయింతర్వాత ఏమవుతా నన్నది అస్తిత్వవాదం ప్రకారం నాకు సంబంధం లేదు. నా రచనలన్నీ నేను బతికుండగానే తగలబెట్టి ఎవడన్నా దాని మీద ఒంటేలుకు పోయినా కూడా నాకేం ప్రోబ్లెం లేదు. I wanted to speak out my inner self."

నవలా శిల్పం

ఆయన మాటల్లో– 'నేనూ చీకటి'లో కవిత్వ శైలి గురించి:

నా సాహితీ ప్రస్థానం కవిత్వంతోనే మొదలైంది. అసలు మొదటి నవలగా పిలవబడుతున్న 'నేనూ చీకటి' మొదటి వాక్యాలు కవితా వాక్యాలే.. తరవాత అందులోకి కథ ప్రవేశించింది. మెల్లగా కథ దాన్ని ముందుకు లాక్కుపోయింది. అందుకే అందులో కొన్ని వ్యక్తిగత జీవితంలోని చాలా ఘటనలు నిర్మొహమాటంగా ప్రవేశించాయి.

కవిత్వమన్నది పూర్తి వ్యక్తిగతమైందని నేను నిష్కర్షగా నమ్ముతాను. ఏ సంఘటనన్నైనా కవితగా రాయొచ్చు అని నేననుకోను. కవిత్వానికి భాష ప్రత్యేకమైంది కావాలి, ఉపమలూ ఉత్ప్రేక్షలూ వుండాలి, భాషలో సాంద్రత అవసరం... కొద్దిగా క్లిష్టత కూడా వుండాలి. ఆ క్లిష్టతపాలు మరీ ఎక్కువై 'నేనూ–చీకటి' ఎక్కువమంది పాఠకులకు అందలేదు... 'నేనూ–చీకటి'లో కథ ఉంది. ఆ కథ పాఠకులకు అర్థం కావాలి అని నేననుకున్నాను. కానీ కాలేదని అర్థమైంది. ఆ విషయం గ్రహించాను. కాబట్టి పాఠకులకేమైనా అర్థం కావాలనుకుని నేను రాస్తే అది 'నేనూ – చీకటి'కి భిన్నంగా వుండాలని అనుకున్నాను. అందుకనే అదే కాలంలో మొదలుపెట్టి కంప్లీట్ చేసిన 'తపన'లో క్లిష్టతని చాలామటుకు తగ్గించేశాను.

రాసే భాషపై సంస్కృత ప్రభావం

బ్రాహ్మణ కుటుంబంలో పుట్టడం, రోజూ సంస్కృతంలో మంత్రాలు వినడం, తండ్రి పురోహితుడు కావడం, అమ్మ కూడా పురోహిత కుటుంబీకురాలు కావడం... ప్రతీ ఉదయం నామలింగానుశాసనం అనబడే అమరకోశం వల్లె వేయడం... ఇలాంటి కారణాల వల్ల సంస్కృతంలా బరువైన తెలుగు భాష వాడటం అలవాటు చేసుకున్నా ('నేనూ–చీకటి'కి మాత్రం). తర్వాత ఇమ్మీడియెట్‌గా సంస్కృతం వాడటాన్ని తగ్గించేసా.

నవలలన్నీ ఫస్ట్ పెర్సన్‌లోనే ఎందుకు

నేను రాసిన నవలలు చాలామటుకు నిజ జీవితాన్ని రిఫ్లెక్ట్ చేస్తూ వుంటాయి, సంభాషణలతో సహా... కాబట్టి ఆ ఆ జీవితాలు నాకు అత్యంత పరిచయమైనవిగా వుండాలి. నేను రాస్తున్నా కాబట్టి, నాకు తెలిసిన కథలు కాబట్టి 'నేను' చెబుతాను. అదొక్కటే కాదులెండి. అదొక సిగ్నేచర్ కూడా.

రాయటానికి ఇబ్బంది పెట్టిన నవల

'తెరవని తలుపులు'. ఎందుకంటే అది నాకస్సలు పరిచయం లేని వ్యక్తుల గురించి రాసింది కాబట్టి. నా చేత ఆ నవల అడిగి రాయించుకున్న వ్యక్తి అందులోని మిగతా వ్యక్తుల గురించి చిన్న చిన్న డీటైల్స్ కూడా నాకు చెప్పడంలో కష్టపడ్డాడు. చాలా చిన్న నవల (నావన్నీ చిన్నవే). కానీ రాయడానికి నాకు పట్టిన సమయం మూడున్నరేళ్లు! అంతగా ఇంకే నవల రాయడానికి కష్టపడలేదు.

ఏది కథ, ఏది నవల

కథ అన్నది ఒక ఇన్సిడెంట్. నవల కొన్ని ఇన్సిడెంట్స్ కలిపి రాసేది. ఇది నేను ఇచ్చుకున్న అర్థం.

రీరైటింగ్? రివిజన్?

నేను ఇంతవరకు ఏదీ రీరైట్ చేయలేదు. ప్రూఫ్ రీడ్ చేసేటప్పుడు అచ్చుతప్పులు సరి చేస్తాను, ఎక్కడైనా పదాలు మార్చాలంటే మారుస్తాను. ఇన్ని గంటలు అని పెట్టుకుని రాయడం నాకు చేత కాదు. ఒక్కోసారి కొన్ని వారాల పాటు దాని జోలికి వెళ్లను. నా రచన ఇంటెన్స్ గా కనపడుతుందేమో గానీ నేను చాలా లేజీ రైటర్‌ని.

ఎక్కువ చదవటం తప్పనిసరి

రచయితన్నవాడు మంచి పాఠకుడు కావాలి. ఒకరిద్దరిని కాదు. ఎంతమందిని వీలైతే అంతమంది రచయితల్ని చదవాలి. మంచి స్టాండర్డ్ ఉన్న రచయితల్ని ఎన్నుకుని చదవాలి. ప్రపంచ సాహిత్యం చాలామటుకు ఇంగ్లీష్‌లోకి అనువాదమై ఉంది కాబట్టి ఎక్కువ చదవడం కోసం మనకు ఇంగ్లీష్ వచ్చుండాలి.

ఇంటర్వ్యూ ■ మెహెర్

సోమవారం 26 ఆగస్టు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



బాహ్యాంతరంగం

సరస్సు మాట్లాడినప్పుడు
నేను వినను
అలలు సరస్సు గురించి మాట్లాడినప్పుడు వింటాను
చేపలు కూడా చలనం గురించి
మాట్లాడినప్పుడు వింటాను

సముద్రం మాట్లాడినప్పుడు వినను
కెరటాలు సాగరం గురించి మాట్లాడినప్పుడు వింటాను
తిమింగలం
జీవితం లోతు గురించి మాట్లాడినప్పుడు వింటాను

చెట్టు మాట్లాడినప్పుడు వినను
కొమ్మ మీద కూర్చున్న పిట్ట
చెట్టు గురించి మాట్లాడినప్పుడు వింటాను
నీడనిచ్చే స్వభావం గురించి వింటాను

స్మశానం మాట్లాడినప్పుడు వినను
సమాధి మాట్లాడినప్పుడు వింటాను
అబద్ధానికీ నిజానికీ మధ్య వున్న తెర గురించి
మాట్లాడినప్పుడు వింటాను

మనిషితో మాట్లాడలేను
అతనిలోని ఆత్మ మాట్లాడితే వింటాను


■ నగ్నముని

నా మొదటి పుస్తకం

భరోసా ఉంది, భ్రమా ఉంది!

– వరవరరావు





నా కవితా సంపుటి 'చలినెగళ్లు' పేరుతో 1968 మే నెలలో వెలువడింది. నిజానికి 1965లో వెలువడవలసింది. ఎందుకంటే అందులో నేను 1958 నుంచి 64 వరకు రాసిన తొలి కవితలు ఉన్నాయి. దాని గురించి మాట్లాడాలంటే జ్ఞాపకాల వీధి (డౌన్ మెమొరీ లేన్)లో అరవై ఏళ్ళు వెనక్కి వెళ్ళాలి. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, మిత్ర మండలి సాహిత్య సంస్థ నుంచి, ఉస్మానియా విశ్వవిద్యాలయ క్యాంపస్, ఆర్ట్స్ కాలేజి, ముఖ్యంగా ఎ హాస్టల్ రూమ్ నెం.67 దాకా నా 57–64 విద్యార్థి, యవ్వన అనుభవాల్లోకి, అనుభూతుల్లోకి వెళ్లాలి– అన్ని విధాల నా నేల నుంచి, నా భాష నుంచి చాలా దూరం నడిచి వచ్చిన ప్రవాసం నుంచి.

'చలినెగళ్లు' హైదరాబాద్ నారాయణగూడలోని నాగార్జున ప్రింటర్స్‌లో అచ్చయ్యింది. 1964 డిసెంబర్ మూడో వారానికి నేను క్యాంపస్ వదలడంతో నా కవితా సంకలనం ప్రయత్నాలు కూడా మూలపడినవి. 1966లో ప్రారంభమైన సృజన ద్వారానే పరిచయమైన శ్రీపతి హైదరాబాద్‌లో సృజన చిరునామా అయ్యాడు. ఆయన స్నేహం నాకు శ్రీకాకుళం సుబ్బారావు పాణిగ్రాహినే కాదు, ఆయన సహాధ్యాయులు సత్యం కైలాసం, రమణమూర్తి, భూషణం వంటి అందరినీ, శ్రీకాకుళ ఉద్యమాన్నీ పరిచయం చేసింది.

నాకు ఆధునిక/ అభ్యుదయ కవిగా గుర్తింపు తెచ్చిన 'సోషలిస్టు చంద్రుడు' 1957 'చలినెగళ్లు'లో చేర్చలేదు. 1958లో రాసిన 'కుక్కపిల్ల ఎక్కడికని వెళిపోతుంది' – స్వర్గంలోని వర్గ కలహాలు దాని కళ్లల్లో చదువుకుంటాను – అనే కవితలో సారళ్యం, స్పష్టత నండూరి రామ మోహనరావు వంటి కవి, విమర్శకులు, పత్రికా సంపాదకుల దృష్టిని ఆకర్షించింది. 'కప్పుకోడానికి ఏమున్నయి, అయినా కప్పుకోడానికి ఏమున్నయి' (ఆకలి) కవితా వాక్యం చేకూరి రామారావుకు పాఠ్యాంశమైంది. 1962లో మర్లిన్ మన్రో చనిపోయినపుడు రాసిన కవిత 'అకవితా వస్తువు' నా కవిత్వాన్ని సంకలనంగా వేసుకోవాలన్న ఆత్మవిశ్వాసానికి దారి తీసింది. అది కొత్తగా విజయవాడ నుంచి వెలువడిన 'జ్యోతి'లో బాపు ఇష్టంగా వేసిన బొమ్మతో అచ్చయి ఆయనతో, రమణతో స్నేహం ఏర్పడింది. ఆ స్నేహాన్ని పురస్కరించుకునే బాపు 'చలినెగళ్లు'కు ముఖచిత్రం వేసి అక్షరాలు రాసాడు. కవర్ వెనుక ఉన్న నా ఫొటో ఆర్టిస్టు, రచయిత చలసాని ప్రసాదరావు 1961లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆవరణలో తీసింది. కింద నా పరిచయ వాక్యాలు రాసింది శ్రీపతి.

మా ఉత్తర ప్రత్యుత్తర స్నేహంతో కెవిఆర్ గారికి నేను 62లో 'చలినెగళ్లు' రాతప్రతి పంపించాను. ఆయన అక్షర, శబ్ద దోషాలు మొదలు అన్వయం దాకా సవరించి ఓపికగా సూచనలు చేసారు. ఆ సందర్భంలోనే ఎండాకాలం సెలవులు మే చలం సంచిక 'సృజన'తో పాటు 'చలినెగళ్లు' రూపొందింది. ఇటు శ్రీపతి ప్రోత్సాహానికి అటు 'మిత్రమండలి' సీనియర్ రచయిత దేవులపల్లి సుదర్శనరావు నెల్లుట్ల సంజీవరావుతో కలిసి ప్రచురణ సంస్థ ప్రారంభించాలనే ఆకాంక్ష దోహదం చేసింది. ఆయన అప్పటికే తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో కవి. "వసుధైక కుటుంబం కోసం, వర్గరహిత సమాజం కోసం ఎలుగెత్తి పిలిచి, మేల్కొల్పి స్వాతంత్ర్య పరమావధి వైపు పురోగమించే ప్రబోధం చేసిన వాని కోసం సాగిన" తన అన్వేషణలో నేను దొరికానని రాసారు.

> కాగితం మీద రాసిన అక్షరానికి నిలవాలనే నిబద్ధత నా కవితా ప్రయాణానికి దిశానిర్దేశం చేసింది. ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటే స్పష్టాస్పష్టమైన నెహ్రూవియన్ సామ్యవాద ఎండమావి నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవ సాంస్కృతిక, సాహిత్య మార్గాన్ని ఎంచుకున్నాను.

ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుకూలమైన సమీక్ష చేసాడు. కాని తెలంగాణలో వాడే 'బొక్కలు' అనే మాటను ఆంధ్రలో పొక్కలుగా అర్థం చేసుకొని అన్వయం కొన్ని చోట్ల కుదరలేదన్నాడు. 'సంవేదన'లో రాచమల్లు రామ చంద్రారెడ్డి నన్ను ప్రోత్సహించే సమీక్ష రాసాడు. కుందుర్తి 1968లో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులు ప్రారంభించాక శీలా వీర్రాజు 'కొడిగట్టిన సూర్యుడు' (68) తర్వాత 69లో 'చలినెగళ్లు'కు వచ్చింది. 'చలినెగళ్లు' గుడిపాటి వెంకట చలానికి అంకితమిచ్చాను.

కాగితం మీద రాసిన అక్షరానికి నిలవాలనే నిబద్ధత నా కవితా ప్రయాణానికి దిశానిర్దేశం చేసింది. ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటే స్పష్టాస్పష్టమైన నెహ్రూవియన్ సామ్యవాద ఎండమావి నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవ సాంస్కృతిక, సాహిత్య మార్గాన్ని ఎంచుకున్నాను. అది 'మిత్రమండలి' నుంచి, ఫ్రీవర్స్ ఫ్రంట్ నుంచి, సృజన, విరసంలోకి ప్రయాణం వల్ల సాధ్యమైంది. 'చలినెగళ్లు', ఇతివృత్త కవితల్లోని ప్రబంధ భాషా ప్రభావం నుంచి 'అన్‌లర్నింగ్ ప్రాసెస్'లో ప్రజలకు చేరువయ్యే పలకరించే భాషలోకి చేరుకున్నాను. ■


ప్రియ పద్యం

శ్రీసుధ మోదుగు స్వాప్నిక కవిత్వం

ఒక పాఠకుడిగా నాకు ఏ predetermined అభిప్రాయాలు కవిత్వానికి సంబంధించి ఉండవనే అనుకుంటాను. ఇప్పుడు కవిత్వ పాఠకునికి కావాల్సిందల్లా, శాశ్వతంగా పీఠాలు వేసి కూర్చున్న అనుభవాలనూ అర్థాలనూ decentralize చేస్తూ, ముక్కలు చేస్తూ పోవటమే. తిరిగి కొత్త అర్థాలను అనుభవాలతో కలుపుతూ పోవడమే అత్యంత ఆధునిక కవిత్వంలోని పాఠక చర్య. ఇప్పటి మైక్రో విశ్వమే కిటికీ, పగిలే ముక్కలే ప్రవాహానుభవాలు. చూస్తూనే వున్నాం ఇటువంటి చిత్రధ్వనుల్ని. అందుకే, each and every tiny spectacle will morph into a spectacular world. ఇటువంటి అనుభవాన్ని తల లోపల, గుండె మీద ఎండాకాలం వానజల్లు లాగా శ్రీసుధ మోదుగు తీసుకు వచ్చింది. పద ధ్వని మాత్రల వివశత్వాన్నిస్తూ, విశ్రాంతిని విభ్రాంతిని పోగు చేస్తూ, కొన్ని ప్యారాగ్రాఫ్ కవితలతో. ఇందులోని పంక్తులలో multiplicity వుంది. గాఢత పెనవేసుకుంటూ పోయే నిరలంకారత కూడా వుంటుంది. సామాన్యత లోని అసమాన చలనాన్ని పసిగట్టడం చాలా అరుదైన విషయమే అనుకుంటాను. ఇస్మాయిల్ గారి నుంచీ వజీర్ రహ్మాన్, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, మందరపు హైమవతీ, రంధి సోమరాజు, మునాస వెంకట్, సూఫీ వచనకారుల అడుగుల ముద్రలు ఉండనే ఉన్నాయి. స్పష్టతలో అస్పష్టతను వికసింపచేయడం గొప్ప రసచర్య అని అనిపిస్తూ ఉంటుంది.

ఈ కవితల్లో వొక సహజతనంలో, నిలకడగా భ్రమింపజేసే వేగముంటుంది. Slowness కనపడుతుంది. నిశ్శబ్ద విస్తృతి వుంటుంది. వొక సన్నటి అలికిడిగా అనిపించే శబ్దమూ, నిర్దయా కళ్ళకు వినిపిస్తుంది. శిల్పి తన ఏకాగ్రతలో నిర్వాణ స్థితికి చేరుకుంటాడు అనే గొంగళి పురుగులోని Metamorphic గుర్తింపు కూడా వుంటుంది. పువ్వు రాలిపోతూ మళ్ళీ మొగ్గనై పుడతాననే మాటను అందించి వెళ్ళిపోతున్నట్టు. ఇటువంటి కవిత్వానికి కంటెంట్ మొత్తం జీవితమే. ప్రతి శకలమూ ఆరంభ అంతమే. చీకట్లో కొన్నిసార్లు ఒక్కో దీపాన్ని వెలిగిస్తూ పోవడమే కాదు వొక్కో దీపాన్ని మలుపుతూ పోవడం కూడా పాఠక గుణం అయ్యి వుండాలి, రాత్రిని అర్థం చేసుకోవడం కోసం అనుకుంటాను. ఈ కవిత్వంలోని క్లుప్తత ఇదే చెబుతుంది. గొంగళి పురుగును తెలంగాణ తెలుగు భాషలో బొంత పురుగు అని కూడా అంటారు. అందుకే బొంత పండు వంటి భయ స్నిగ్ధత కూడా వుంటుంది రూపంలో. అది క్రమంగా వొక సీతాకోక చిలుకయ్యి తోట వైపు ఎగిరిపోవడం వొక గొప్ప transmigration వంటి అనుభవం పాఠకునికి కవిత్వం లోనికి సాహస యాత్ర చెయ్యడానికి ఉన్మత్తంగా.





■ సిద్ధార్థ
✆ 73306 21563

గొంగళిపురుగుల సామ్రాజ్యం

కనీ వినీ ఎరుగని గాలిదుమారం
పెద్ద పెద్ద కొమ్మలు విరిగిపడ్డాయి
చిన్న గాలికే తెగి పడిపోతుందనుకున్న
చిగురుటాకు చెట్టుతోనే ఉండిపోయింది
***
శిల్పి ఏకాగ్రతతో చెక్కుతూ శిల్పమైపోయాడు
అతడు మరణించాడనుకొని
శిలను పూజించడం మొదలుపెట్టారు
***
నీపై దయలేని కోరికలు
గుండెకు వేలాడుతున్న గబ్బిలాలు
తరుముకొస్తున్న భేతాళ ప్రశ్నలు
కారుచిచ్చులా వెంటాడుతున్న జీవితం
నిర్దేశం, నిర్భావం నైరాశ్యం నిర్మాణం

■ శ్రీసుధ మోదుగు

గిడుగు జయంతి వేడుకలు

నవ్యాంధ్ర రచయితల సంఘం సారథ్యంలో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ – శంకరం వేదిక ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు ఆగస్టు 29 ఉ. 10 గంటలకు విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథా లయంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో గిడుగు జాతీయ భాషా సాహిత్య కళా సేవా రంగాల పురస్కారాల ప్రదానం, తెలుగు భాషా పరిరక్షణపై కవి సమ్మేళనం ఉంటాయి. బిక్కి కృష్ణ సభాధ్యక్షత వహించే ఈ వేడుకలకు టి.డి.జనార్థన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. వివరాలకు: 9246415150.

కలిమిశ్రీ

అద్దేపల్లి పురస్కారం

అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి గాను సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు ప్రదానం చేస్తున్నాము. సన్నిధానం కవిగా, విమర్శకునిగా వక్తగా ఎంతో ప్రసిద్ధి చెందినవారు. గౌతమీ గ్రంథాలయ ఉద్యోగిగా ఎంతోమంది కవులకూ పరిశోధకులకూ సహకరించడమే కాక వారితో సాహిత్య బంధాన్ని పెనవేసుకున్నవారు. అద్దేపల్లి రామమోహనరావు జన్మదిన సెప్టెంబర్ 8న కాకినాడలో జరిగే సభలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది.

ఉదయభాస్కరరావు

మధురాంతకం రాజారాం సమగ్ర రచనల సంకలనం

మధురాంతకం రాజారాం సమగ్ర రచనల సంకలనం కోసం రాజారాం గారు రాసిన ముందు మాటలు, పీఠికలు, గ్రంథ సమీక్షల సేకరణ జరుగుతోంది. తమ దగ్గర వున్న ముందు మాటలు, పీఠికలు, గ్రంథ సమీక్షలను ఈ చిరునామాకు పంపవలసినదిగా రచయితలను, పాఠకులను అభ్యర్థిస్తున్నాను. చిరునామా: మధురాంతకం నరేంద్ర, 1554/1 పద్మావతీ నగర్, తిరుపతి (పడమర) – 517502 ఫోన్: 9866243659, ఈమెయిల్: manarendra@gmail.com

మధురాంతకం నరేంద్ర

'పొలమారిన ఊరు'

వెలుగు రామినాయుడు (శాసపు) రచించిన 'పొలమారిన ఊరు' కవితా సంపుటిని ఈ ఆగస్ట్ 29సాయంత్రం 6 గంటలకు మక్క అప్పలనాయుడు ఆవిష్కరిస్తారు. విజయనగరం జిల్లా రాజాంలో గల శ్రీవేంకట సూర్యదుర్గా కళ్యాణ మండపంలో మజ్జిమదన్ మోహన్ అధ్యక్షతన జరుగనున్న సభలో అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, బాలసుధాకర్ మౌళి, గార రంగనాథం, జి.ఎస్. చలం, రౌతు వాసుదేవరావు తదితరులు పాల్గొంటారు.

వెలుగు మిత్రులు

కథలకు ఆహ్వానం

'నాకు నచ్చిన నా కథ' పేరిట ప్రచురించనున్న ఎనిమిదవ కథా సంకలనానికి శ్రీకారం చుట్టాం, సీనియర్ కథకుల నుండి, ఇప్పుడిప్పుడే కథలు రాస్తున్న వర్ధమాన కథ రచయితల వరకు ఎవరైనా తమ తమ కథలను పంపవచ్చు. కథ డిటిపిలో గాని చేతి వ్రాతతో గాని నాలుగు పేజీలకు మించరాదు, ఇదివరకు ప్రచురణ అయిన కథలు కూడా పంపవచ్చు. కథలను సెప్టెంబర్ 30లోగా ఈమెయిల్: nkbabu.publisher@gmail.com కు మెయిల్ చేయవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్: 89777 32619.

ఎస్.కె. బాబు

దానపత్ర రహస్యం రట్టు అయింది. డివిజనల్ పంచాయతీ అధికారి విచారణలో దానపత్ర బాగోతం బయటపడింది. మైలవరం పూర్వ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు అవినీతి బండారం కూడా వెలుగుచూసింది. అడ్డగోలుగా చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకున్న సీఆర్‌డీఏ అధికారి అడ్డంగా బుక్ అయ్యారు. డివిజనల్ పంచాయితీ అధికారి (డీఎల్‌పీఓ) పరిశీలన అనంతరం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవటమే మిగిలి ఉంది.

విచారణలో దొరికిన దొంగలు

దానపత్రం గుట్టు రట్టు!



డీఎల్‌పీఓ విచారణలో తేలిన అక్రమం ■ తప్పు చేసి పంచాయతీ అధికారి బుకాయింపులు

■ అతనిపై చర్యలకు సిఫార్సు ■ డీపీఓకు రిపోర్టు పంపిన డీఎల్‌పీఓ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో సీఆర్‌డీఏ అధికారి ఒకరు తన భూవిలో ప్లాట్లు వేశారు. లే అవుట్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవటానికి రోడ్డు సమస్య ఉండటంతో.. రోడ్డును సృష్టించటంతో కోసం తన స్థలంలో కొంత భాగాన్ని గత ప్రభుత్వంలో మైలవరం పంచాయతీకి దానపత్రంగా ఇచ్చారు. ప్రభుత్వం మారాక అక్రమం బయటపడుతుందని ఇటీవల దానపత్రాన్ని రద్దు చేసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 21న 'దానపత్ర రహస్యం' శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై పాలకవర్గ సభ్యుడు ముద్దర నాగవెంకట చిట్టిబాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీఎల్‌పీఓ ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి తన నివేదికను తాజాగా జిల్లా పంచాయితీ అధికారికి అందించారు.

● గుట్టు రట్టు చేసిన డీఎల్‌పీఓ నివేదిక

మైలవరంలోని సర్వే నెంబర్ 126/1 లో రోడ్డు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబరు 2333/2023 నమోదైంది. ఏప్రిల్ 13, 2023లో కామిశెట్టి గోపీనాథ్ మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గ్రామ పంచాయతీకి రోడ్డు దాఖలు పరిచి రిజిస్ట్రేషన్ చేశారు. కానీ ఆ రోడ్డు స్థల రిజిస్ట్రేషన్ చేసినట్టు గ్రామ పంచాయతీలో ఎలాంటి తీర్మానం చేసినట్టు రికార్డులు లేవు. ఇదే మైలవరం గ్రామ పంచాయతీలోని సర్వే నెంబర్ 126, 126/1 లే అవుట్లు అనధికార లే అవుట్లుగా తేల్చారు. లే అవుట్ యజమాని కామిశెట్టి గోపీనాథ్ గ్రామ పంచాయతీకి తెలియకుండా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవటం నిబంధనలకు విరుద్ధమని డీఎల్‌పీఓ తన రిపోర్టులో పేర్కొన్నారు. మైలవరం పూర్వ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు ఈ అక్రమానికి సహకరించినట్టు స్పష్టమైంది. విచారణలో మాత్రం తానెలాంటి దానపత్రాన్ని స్వీకరించలేదని, తాను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికే వెళ్లలేదని, సంతకాలు చేయలేదని వాదించారు. డీఎల్‌పీఓ మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి విచారించినపుడు పంచాయతీ కార్యదర్శి సంతకాలు చేశారని తేలింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అంశాన్ని గ్రామ పంచాయితీ దృష్టికి తీసుకురాలేదని ప్రస్తావిస్తూ, సాంబశివరావుపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ పంచాయతీ అధికారి (డీపీఓ)కు తన రిపోర్టులో డీఎల్‌పీఓ రాశారు.

నా ఇంటి స్థలం కబ్జా చేశారు!

• బాధితుడి ఫిర్యాదుతో కూల్చివేసిన అధికారులు

6లో..



దేవదాయ శాఖలో బదిలీల వేడి రాజుకుంటోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాతోపాటు ఉభయగోదావరి జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే కాకినాడ డిప్యూటీ కమిషనర్ (డీసీ) పోస్టుకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అదే సమయంలో జిల్లా దేవదాయశాఖ అధికారి పోస్టుల కోసమూ పైరవీలు మొదలయ్యాయి. ఐదేళ్లలో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన వారే నేడు టీడీపీ నాయకుల పంచన చేరి సిఫార్సు లేఖలు తీసుకుంటున్నారు. గతంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు దేవదాయ శాఖ అధికారిగా పనిచేసిన శాంతిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆమెపై అధికారులు సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే. అప్పటి నుంచి ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా సుబద్నాదేవి, కృష్ణాజిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా సంధ్య అదనపు బాధ్యతలపై కొనసాగుతున్నారు. ప్రస్తుతం డీసీతోపాటు రెండు జిల్లాలకు దేవదాయ శాఖ అధికారులను కూడా నియమించాల్సి ఉంది.

బదిలీల వేడి

దేవదాయశాఖలో జోన్-2 డీసీ పోస్టుకు భారీ డిమాండ్

• అర కోటి ఖర్చు పెట్టడానికి సై • రేసులో నాడు వైసీపీతో అంటకాగిన అధికారులు

• ఉదారంగా సిఫారసు లేఖలు ఇస్తున్న టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు • జిల్లా దేవదాయశాఖ అధికారుల పోస్టులకూ జోరుగా పైరవీలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కాకినాడ డీసీగా ఉన్న ఎం.వి జయరాజు గత ఐదేళ్లలో వైసీపీ నేతలతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై అవినీతి ఆరోపణలు.. ఏసీబీ కేసు ఉండటంతో ఆయన్ను ఆ స్థానం నుంచి కదిలించడం ఖాయమని దేవదాయశాఖ వర్గాలు చెబుతున్నా అదే స్థానంలో కొనసాగేందుకు ఆయన శాయశక్తులా ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

కాకినాడ డీసీ కోసం డీఎల్‌వీ రమేశ్ బాబు విశ్వప్రయత్నం

● కాకినాడ డీసీ పోస్టును చేజిక్కించుకునేందుకు డీఎల్‌వీ రమేశ్ బాబు కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈయన ప్రస్తుతం అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు.

● వైసీపీ హయాంలో మంత్రిగా చేసిన దాడిశెట్టి రాజాకు అత్యంత సన్నిహితుడిగా రమేశ్ బాబుకు పేరుంది. వైసీపీ నాయకులు ఏ పని చెప్పినా ఆగమేఘాలపై చేస్తారని పేరుపొందారు. ఈ కారణంగానే ఆయన్ను ఏళ్ల తరబడి అన్నవరం దేవస్థానం నుంచి కదపకుండా కొనసాగిస్తున్నారన్న పేరుంది. కాకినాడ డీసీ కార్యాలయంలో సూపరింటెంట్‌గా చేసే సమయంలో ఈయనపై మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రస్తుతం రమేశ్‌బాబును డీసీ పోస్టుకు సిఫార్సు చేస్తూ పలువురు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చినట్టు సమాచారం.

మాన్సాస్ ట్రస్టు ఈవో కూడా గట్టి ప్రయత్నం

● ప్రస్తుతం మాన్సాస్ ట్రస్టు ఈవోగా ఉన్న కేఎస్‌వీడీ ప్రసాద్ కూడా కాకినాడ డీసీగా వచ్చేందుకు తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే ద్రాక్షరామం ఈవోగా పనిచేసే సమయంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో ప్రసాద్ సన్నిహితంగా ఉండేవారన్న ఆరోపణలు ఉన్నాయి. డీసీ పోస్టుకు ప్రయత్నాలు చేసుకుంటున్న రమేశ్‌బాబు, ప్రసాద్.. కూటమి ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వైసీపీ హయాంలో ఉన్న ఒత్తిళ్ల కారణంగా తాము అప్పటి ప్రజాప్రతినిధులు చెప్పినట్టు చేయాల్సి వచ్చిందని, అంతే కానీ తాము వైసీపీకి అనుకూలం కాదని, టీడీపీ, జనసేనకు విధేయులుగా ఉంటామని చెప్పుకొంటూ సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నట్టు సమాచారం. అదే సమయంలో భారీగా ఖర్చు పెట్టుకునేందుకూ వీరు సిద్ధమవుతున్నారు. కాకినాడ డీసీ పోస్టు కోసం సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చు చేసుకునేందుకు వీరు సిద్ధమవుతుండటం గమనార్హం. డీసీ పోస్టు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నవారు అటు కమిషనర్ కార్యాలయంతోపాటు దేవదాయ శాఖ మంత్రి పేషీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

జిల్లా దేవదాయశాఖ అధికారి పోస్టులకూ గిరాకీ


ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ అధికారి పోస్టులకూ భారీ డిమాండ్ నెలకొంది. ఈ పోస్టుల కోసం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చుపెట్టుకునేందుకూ సిద్ధమవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా అధికారి పోస్టు సూపరింటెంట్ క్యాడర్ స్థాయిది. కృష్ణాజిల్లా అధికారి పోస్టు ఏసీ క్యాడర్ స్థాయిది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా అధికారి పోస్టు కోసం గతంలో అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన ఓ గ్రేడ్-1 ఈవో తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను సదరు ఈవో సంపాదించినట్టు సమాచారం. ఆ అధికారితోపాటు మరో నలుగురు రేసులో ఉన్నారు. కృష్ణాజిల్లా అధికారి పోస్టుకు భారీగానే డిమాండ్ నెలకొంది. ఐదుగురు ఈ పోస్టు కోసం ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేసుకుంటున్నట్టు సమాచారం.

జీజీహెచ్‌లో మంకీ వార్డు

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని ఆదేశాలు

• ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలు

• కొంతమందికి శరీరంపై దద్దుర్లు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) ఒంటి నిండా జ్వరం. శరీరంపై దద్దుర్లు, తలనొప్పి, వాంతులు.. ప్రస్తుతం విషజ్వరాలతో బాధపడుతున్న వారిలో కనిపిస్తున్న లక్షణాలు ఇవి. దాదాపుగా ఆరేడు రకాల వైరస్‌ల కారణంగా ఈ జ్వరాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. తాజాగా మంకీపాక్స్ కలకలం రేగింది. ఈ వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వార్త వైరల్ అవుతోంది. దీన్ని ప్రభుత్వాసుపత్రి వైద్యులు కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి కేసులు ఆసుపత్రికి రాకపోయినప్పటికీ ముందు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మంకీపాక్స్ రోగులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తపై వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. ఆయన ఆదివారం విజయవాడ ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఆసుపత్రిలో మంకీపాక్స్ రోగులు ఎవరూ లేరని అధికారులు వివరించారు.

● ఆరు పడకలతో ఐసీయూ

విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ఆరు పడకలతో మంకీపాక్స్ వార్డును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ప్రత్యేక వార్డు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఇందులో ఆరు పడకలను ఏర్పాటు చేశారు. ఈ వార్డులోకి అవసరమైన మందులు, వైద్యులను సమకూర్చారు. 24/7 వైద్యులు అందుబాటులో ఉండేలా డ్యూటీలు వేస్తున్నారు. సోమవారం నాటికి వార్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. ఆఫ్రికాలోని కోతుల ద్వారా వచ్చిన వైరస్‌తో మంకీపాక్స్ ప్రబలింది. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారికి మంకీపాక్స్ పాజిటివ్ వస్తే అది మిగిలిన వారికి వ్యాపించే అవకాశాలు ఉన్నాయని వైద్యులు భావిస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి సంబంధించి ఆఫ్రికా దేశాల నుంచి యువతీ యువకులు విజయవాడకు వస్తుంటారు. విజయవాడకు సమీపంలో కేఎల్ వర్సిటీ, ఆచార్య నాగార్జున వర్సిటీ ఉన్నాయి. ఈ రెండింటిలోనూ ప్రొఫెషనల్ కోర్సులు చేయడానికి ఆఫ్రికా దేశాలకు చెందిన విద్యార్థులు వస్తుంటారు. వారిలో ఎవరికైనా మంకీపాక్స్ పాజిటివ్ వస్తే అది ప్రబలే అవకాశాలు ఉన్నాయని ముందస్తుగా గుర్తించిన అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసే ప్రత్యేక వార్డు ఒక నోడల్ అధికారిని నియవించాలని అధికారులు నిర్ణయించారు. మరోపక్క జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఆరు నుంచి 12 గంటల వ్యవధిలో వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించడంతో ఈ జ్వరాలు పెరుగుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో..



నగరంలోని దుర్గ అగ్రహారం, లిక్కిపుల్లయ్య వీధిలో కనకదుర్గ అమ్మవారి ప్రభ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, లయబద్ధంగా భేతాళ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రిజిస్ట్రేషన్ శాఖలో కొందరు కమ్మ సామాజిక వర్గ సబ్ రిజిస్ట్రార్లను టార్గెట్‌గా చేసుకుని ఆకాశరామన్న ఉత్తరాలు రాయటం కలకలాన్ని సృష్టిస్తోంది. నగరంలో సబ్‌రిజిస్ట్రార్లుగా పనిచేసే వారికి మొత్తంగా రూ.11 కోట్ల బేరం పెట్టిన నేపథ్యంలో ఈ ఉత్తర ఉదంతం సంచలనం సృష్టిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా చెడ్డపేరు తీసుకువచ్చేలా బలవంతపు బదిలీలకు శ్రీకారం చుడుతున్న కొందరు అవినీతి అధికారులే.. ఈ ఆకాశరామన్న ఉత్తరాలు వెలువరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ నగర పరిధిలోని గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్లు అయిన కృష్ణప్రసాద్, చైతన్యలపై ఈ ఆకాశరామన్న ఉత్తరాలు వెలువరించటం గమనార్హం.

రిజిస్ట్రేషన్ శాఖలో..

ఆకాశ రామన్న కలకలం



కమ్మ సామాజికవర్గ సబ్ రిజిస్ట్రార్లే టార్గెట్‌గా లేఖలు

గత ప్రభుత్వంతో అంటకాగారని నిరాధార ఆరోపణలు

* బలవంతపు బదిలీల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా ఆకాశరామన్న లేఖ

* నేరుగా సబ్‌రిజిస్ట్రార్లకే రిజిస్టర్డ్ పోస్టు

* విజయవాడలో సబ్‌రిజిస్ట్రార్ల పోస్టులకు రూ. 11 కోట్ల బేరం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుణదల, గాంధీ నగర్‌లలో సబ్ రిజిస్ట్రార్లుగా పనిచేస్తున్న కృష్ణ ప్రసాద్, చైతన్యలను టార్గెట్ చేసి ఆ స్థానాల నుంచి పంపించేందుకు కుట్ర జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. వీరిద్దరూ కూడా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. కిందటి వైసీపీ ప్రభుత్వానికి వీరు అంటకాగి పనిచేసినట్టుగా వీరిద్దరిపై ఆకాశరామన్న లేఖలో ప్రచారం జరుగుతోంది. ఈ ఆకాశరామన్న ఉత్తరాన్ని గుణదల సబ్ రిజిస్ట్రార్ కృష్ణ ప్రసాద్‌కు రిజిస్టర్డ్ పోస్టులో పంపించారు. ఆకాశ రామన్న ఉత్తరం కవర్‌పై మాత్రం పీ సురేష్, గూడవల్లి వారి వీధి, డోర్ నెంబర్ 27-33-43, 2 టౌన్, గవర్నర్‌పేట అని ఉంది. వాస్తవానికి ఇది ఫేక్ అడ్రస్ అని తెలుస్తోంది. కార్పొరేషన్ పరిధిలో డోర్ నెంబర్లు ఈ సిరీస్‌లో ప్రస్తుతం లేవు. ఈ ఆకాశరామన్న ఉత్తరం వెనుక పెద్ద కుట్రే ఉందని తెలుస్తోంది. ఉత్తరంలో ప్రభుత్వానికి, ఏసీబీకి నివేదించామని బెదిరింపులు ఉన్నాయి. బలవంతపు బదిలీలకు మానసికంగా సిద్ధం చేయటం కోసమే ఈ బెదిరింపులకు దిగినట్టుగా తెలుస్తోంది. ఈ ఆకాశరామన్న ఉత్తరంలో వీరిద్దరినీ టార్గెట్‌గా చేసుకున్నారన్నదానికి అందులో పొందుపరిచిన అంశాలే దోహదపడుతున్నాయి. ప్రధానంగా వీరిద్దరినీ గత ప్రభుత్వానికి తొత్తులుగా అభివర్ణించటం గమనార్హం. రాష్ట్రంలో అధిక ఆదాయం వచ్చే కార్యాలయాలుగా గుణదల, గాంధీనగర్‌లను పదేపదే ప్రస్తావించటం వెనుక.. కుట్ర కోణం బయటపడుతోంది. వీరంతా కిందటి ఐజీగా పనిచేసిన రామకృష్ణకు శిష్యులుగా అపవాదు మోపారు. వైసీపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ముఖ్య అనుచరులుగా పేర్కొన్నారు. మరోవైపు వీరు కమ్మ కులం పేరు చెప్పుకుని లోకేష్ పేరుని చెడగొడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఇద్దరికీ కిందటి వైసీపీ ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉందని, ఏసీబీని కూడా మేనేజ్ చేసేవాళ్లమని చెప్పుకునేవారని ఇలా ఒకదానికొకటి పొంతన లేకుండా లేఖలో పొందుపరిచారు. ఈ ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి పేరు పర్వతనేని నాగరాజు, పటమట పేరుతో ముగించారు. పటమటలో పర్వతనేని నాగరాజు లేరు. రిజిస్ట్రేషన్ శాఖతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు కూడా లేవు. లేనివ్యక్తి ఎలా ఫిర్యాదు చేశాడో తెలియాల్సిన విషయం. కాపీ టు ఏసీబీ అని ఉన్న ఈ ఉత్తరం నిజంగా ఏసీబీకి పంపారో లేదో కానీ గుణదల సబ్ రిజిస్ట్రార్ కృష్ణ ప్రసాద్‌కు పోస్టులో పంపారు. ఇలా పంపటం కూడా అవినీతి అధికారుల మైండ్‌గేమ్‌గా తెలుస్తోంది. కృష్ణ ప్రసాద్‌కే ఈ ఆకాశరామన్న ఉత్తరం పంపటం వెనుక.. ఆయన్ను గట్టిగా టార్గెట్ చేసినట్టుగా తెలుస్తోంది. నగరంలో పటమట, గాంధీనగర్, గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెడతాయని తెలుసు. ఇక్కడ పనిచేయటానికి ఎంత డిమాండ్ ఉంటుందో తెలియంది కాదు. ఎంత ఖర్చు అయినా సరే లంచాలు ఇచ్చి ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు పోటీలు పడుతుంటారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం.. ఉద్యోగులకు ఐచ్ఛిక బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో... ప్రభుత్వ ఉద్దేశానికి విరుద్ధంగా మూకుమ్మడి బదిలీలు నిర్వహించటం వెనుక.. నగరంలోని సబ్ రిజిస్ట్రార్లుగా తమకు మామూళ్లు తెచ్చిపెట్టేవారిని నియమించుకోవాలన్నది అవినీతి అధికారుల ప్లాన్‌గా కనిపిస్తోంది. అందుకే గందరగోళం సృష్టించటానికి ఆకాశరామన్న ఉత్తరాలు రాసినట్టుగా తెలుస్తోంది. దీనిపై బాధితులు ఏం చేస్తారు? రిజిస్ట్రేషన్ శాఖలో ఏం జరుగుతుందో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతారా వేచి చూడాల్సిందే!

కిడ్నీ పీడిత గ్రామాలకు సురక్షిత జలం



శరవేగంగా కృష్ణా జలాల ప్రాజెక్టు పనులు

» 38 గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి

» వచ్చే ఏడాది జూన్ 30కి ముందే పనుల పూర్తికి చర్యలు

» ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా

» కలెక్టర్ సృజన

6లో..



అనధికారిక కట్టడాన్ని కూల్చివేసిన అధికారులు

నా ఇంటి స్థలం కబ్జా చేశారు!

- ఆక్రమిత స్థలంలో అనధికారిక నిర్మాణం
- బాధితుడి ఫిర్యాదుతో కూల్చివేసిన అధికారులు



బాధితుడు కోటయ్య

విద్యాధరపురం, ఆగస్టు 25 : భవానీపురం ప్రియదర్శిని కాలనీలో తాము కొనుగోలు చేసిన 63 గజాల ఇంటి స్థలాన్ని భోగ సముద్రం శ్రీనివాసరెడ్డి కుటుంబం దొంగ పత్రాలు సృష్టించి ఆక్ర మించుకుందని బాధితుడు పురుషోత్తపట్నం కోటయ్య (అలి యాస్ కోటేశ్వరరావు) ఆరోపించారు. భవానీపురం ఆర్ఎస్ నెం.45లో 63 చదరపు గజాల స్థలాన్ని 1993 డిసెంబరు 4వ తేదీన చింతలపూడి గురు మూర్తి వద్ద తాము కొనుగోలు చేసినట్టు కోటయ్య తెలిపారు. ఈ స్థలంపై భోగసముద్రం శ్రీనివాసరెడ్డి, అతడి భార్య సుబ్బులకు ఎలాంటి హక్కు లేదని, వారే కావాలని నకిలీ పత్రాలు సృష్టించి అన్యాయంగా తన స్థలాన్ని ఆక్రమించుకున్నారని బాధితుడు వాపో యారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అధికారులు విచారించి స్థలానికి హక్కుదారుడిగా తననే నిర్ధారించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉందని, అయితే శ్రీనివాసరెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాడని తెలిపారు. దీనిపై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా శనివారం కూల్చివేశారని తెలిపారు.



ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దొరస్వామికి పాతూరి నాగభూషణం పురస్కారాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు

- ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దొరస్వామి

గవర్నర్‌పేట, ఆగస్టు 25 : కృషి, పట్టుదల ఉంటే యువత ఏ రంగంలోనైనా రాణించి ఉన్నత స్థితికి చేరవచ్చని, నిబద్ధత, సమయపాలన అలవర్చుకోవాలని ద్రవిడ వి శ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఎం.దొరస్వామి అన్నారు. విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఆదివారం పాతూరి ఫౌండేషన్ దొరస్వామికి పాతూరి నాగభూషణం పుర స్కారాన్ని అందజేసింది. శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. సభకు ఫౌండేషన్ అధ్య క్షుడు కేసీ కాల్కూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ, గ్రంథ పాలకులు అన్ని అంశాల్లోనూ నిష్ణాతులుగా ఉంటారని, వారి సేవలను కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉపయోగించుకోవాలని కోరారు. తనకు పురస్కారాన్ని అందించడం పట్ల సంస్థ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లైబ్రే రియన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యమ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. 50 సంవత్సరాలుగా గ్రంథాలయ ప్రగతికి కృషిచేసిన దొరస్వామికి పాతూరి పురస్కారం రావడం గ్రంథపాలకు లకు స్ఫూర్తి అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ, దొరస్వామి తమ కళాశాల గ్రంథాలయంలో అంకిత భావంతో పనిచేసి ఎంతో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు మాట్లాడుతూ, వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఉండటమే దొరస్వామికి పురస్కారం లభించేలా చేసిందన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ, ఫౌండేషన్ గత చరిత్రను, పూర్వం ఈ పురస్కారానికి ఎంపికైన వారి వివరాలను, దొరస్వామిని ఎంపిక చేయడానికి కారణాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు గ్రంథ పాలకులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.



రన్నరప్ ట్రోఫీ, మెడల్స్‌తో కృష్ణా జట్టు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత అనంత

- కృష్ణా జిల్లా జట్టుకు రన్నరప్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 25 : ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో కానూరు 100 అడుగుల రోడ్డు అనుమోలు ప్రభాకర్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేతగా అనంతపురం నిలిచింది. కృష్ణాతో జరిగిన ఫైనల్స్‌లో అనంత పురం జట్టు ఆదివారం 5-0 గోల్స్ తేడాతో జయభేరి మోగించి ట్రోఫీని దక్కించుకుంది. అంతకుముందు తొలి సెమీస్‌లో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరగ్గా అనంతపురం 5-0తో గెలిచి ఫైనల్స్ చేరగా, రెండో సెమీస్ కృష్ణా-అన్నమయ్య జిల్లాల మధ్య జరగ్గా టై బ్రేకర్‌లో కృష్ణా జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ క్రాంతికుమార్, ట్రెజరర్ విజయ్‌కుమార్‌లు విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంవత్సరన్నరకాలంలో ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు చాంపియన్‌షిప్‌లను దిగ్విజయంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. 22 జిల్లాల నుంచి 460 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి, వివిధ జిల్లాల ప్రతినిధులు పి. ఆలీబాబా, పవన్, బుజ్జి, నీలాద్రి(కోనసీమ అధ్యక్షుడు), రిటైర్డు డీఎస్‌డీవో సుధాకర్, డీఎ్ ఎఎ కోచ్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఎమ్మెల్సీ ఏసురత్నం

ధర్నాచౌక్, ఆగస్టు 25 : వెనుకబాటుతనంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. దీనిపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపి పార్లమెంట్‌లో తీర్మానించేలా కేంద్రప్రభు త్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రస్థాయి వడ్డెరల ప్రతినిధుల సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏసురత్నం, జాతీయ వడ్డెర సంఘం (వోడ్) అధ్యక్షుడు వెంకట్ మౌర్య మాట్లాడుతూ, జనాభా దమాషా ప్రకారం వడ్డెర కార్పొరేషన్‌కు రూ. 200 కోట్లు మంజూరు చేయాలన్నారు. స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు. క్వారీల్లో వడ్డెరలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో డిపాజిట్ లేకుండా ఇవ్వాలన్నారు. నామినేషన్ పద్ధతిన 15 శాతం ప్రభుత్వ పనులు రిజర్వ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ స్వాతంత్ర సమ రయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. వడ్డెరలకు రాజ కీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. సంఘం అడ్వైజర్ గుంజా నరసింహులు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, విజయవాడ వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తుల నాగే శ్వరరావు, బత్తుల సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కీలాద్రి కిటకిట..

- దుర్గమ్మ సేవలో భక్తజనం





వన్‌టౌన్, ఆగస్టు 25 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేశారు. కొండపైన క్యూలలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి మహానైవేద్యం సందర్భంగా ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు ప్రోటోకాల్ దర్శనాలను నిలిపివేశారు. క్యూలై న్లలో భక్తుల రాకపోకలను ఈవో రామారావు, ఇతర అధికారులు క్రమబద్ధీకరించారు. అనధికార దర్శనాలను కట్టడి చేసేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

సూర్యోపాసన సేవ..

ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవ లను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్ర పటానికి పూజలు నిర్వహించారు.

అన్న వితరణకు విరాళం..

విజయవాడ భవానీపురానికి చెందిన ఎస్.మల్లిఖా ర్జునరావు, మాధవిలు కుటుంబ సభ్యులతో అమ్మవా రిని దర్శించుకుని అన్నవితరణకు రూ.1,01,116లను చెక్కు అందజేశారు. వీరికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీ స్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



కరెన్సీ నోట్లతో అలంకరించిన ముత్యాలమ్మ

ధనలక్ష్మిగా ముత్యాలమ్మ..

పట్టణంలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారిని శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా రూ.10లక్షల కరెన్సీ నోట్లతో శ్రీ ధనలక్ష్మిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

– జగ్గయ్యపేట

కిడ్నీ పీడిత గ్రామాలకు సురక్షిత జలం



- శరవేగంగా కృష్ణా జలాల ప్రాజెక్టు పనులు
- 38 గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి
- వచ్చే ఏడాది జూన్ 30కి ముందే పనుల పూర్తికి చర్యలు
- ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 25 : రాష్ట్ర ప్రభుత్వ ఆదే శాల మేరకు ఎ.కొండూరు మండలంలోని అన్ని గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించేం దుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తలపెట్టిన ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నట్టు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన కృష్ణా సురక్షిత మంచినీటిని అందించేందుకు రూ.49.94 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను వచ్చే ఏడాది జూన్ 30 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అంతకుముందే పనుల పూర్తికి అధికార యంత్రాంగం కృషిచేస్తున్నట్టు వెల్లడించారు. దీని కోసం గ్రామీణ నీటిసరఫరా పరిధిలో పటిష్ట కార్యా చరణ ప్రణాళిక రూపొందించి, అమలుచేస్తున్నట్టు వివరించారు. కృష్ణాజలాలు ప్రస్తుతం, మైలవరం సీపీడబ్ల్యూసీ స్కీమ్ వరకు వస్తున్నాయని, ఇక్కడి నుంచి కుదపలోని సంప్ దగ్గరకు జలాలను తీసుకె ళ్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యేవ రకు కృష్ణా నీటిని ట్యాంకర్ల ద్వారా మండలంలోని గ్రామాలకు అందిస్తున్నట్టు వివరించారు. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నా మని, ఇటీవల రూ.1.60 కోట్ల డీఎంఎఫ్ గ్రాంట్స్ కూడా విడుదల చేసినట్టు వివరించారు.

శాశ్వత ప్రాజెక్టు ఇలా..

శాశ్వత ప్రాజెక్టు కింద కుదప సంప్ దగ్గర కొండపై ఓవర్ హెడ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నామ న్నారు. సంప్ నుంచి కృష్ణా జలాలను శుద్ధి చేసి ఓవర్ హెడ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి ఎ.కొండూరు మండలంలోకి 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలకు పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ద్వారా నీరు సరఫరా జరుగుతుంది. ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు 200 కి.మీ పూర్తికాగా, మరో 70 కి.మీ పనులు చివరి దశలో వున్నాయి. 38 గ్రామాల్లో అందుబాటులో వున్న ఓవర్ హెడ్ రిజర్వా యర్లకు అదనంగా మరో 14 ఓవర్ హెడ్ రిజర్వాయ ర్లను ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్నామని, ఈ పను లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అతిత్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలె క్టర్ సృజన తెలిపారు.

ఆరోపణల గుట్టు తేల్చండి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే కొలికపూడి లేఖ
- సోషల్ మీడియాలో వైరల్



ఎ.కొండూరు, ఆగస్టు 25 : ఎ.కొండూరు తహసీల్దార్ బి.ఆశయ్య తనపై చేసిన ఆరోపణ లపై కలెక్టర్ విచారణ చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సృజనకు ఎమ్మెల్యే లేఖ రాశారు. కొద్దిరోజుల క్రితం ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాల యంలో సీపీఐ నాయకులతో దాదాపు గంటసేపు పిచ్చాపాటి కబుర్లు చెప్పిన తహసీల్దార్ తిరువూరు ఎమ్మెల్యే ఒక వ్యక్తి నుంచి రూ.50 లక్షలు తీసుకున్నాడని మాటల మధ్యలో చెప్పారని, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వయంగా తహసీల్దార్‌కు ఫోన్ చేసి అడగ్గా సీపీఐ నాయకులే తనకు చెప్పారని తహసీల్దార్ వివరణ ఇచ్చారు. తనపై తహసీల్దార్ బి.ఆశయ్య చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేసి వాస్త వాలు బయటపెట్టాలని కలెక్టర్‌ను కోరినట్టు ఎమ్మెల్యే కొలిక పూడి రాసిన లేఖ ప్రతిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది.

మహిళల ఆర్థిక పురోభివృద్ధికి కృషి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్వయం సహా యక సంఘాల్లో సభ్యులను కేంద్ర ప్రభుత్వం చేయూతతో లక్షాధికారులుగా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. 'లఖ్‌పతి దీదీ సమ్మేళన్' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మోదీ మహారా ష్ట్రలోని జలావ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. కలెక్టరే ట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి వర్చువల్ పద్ధతిలో కలెక్టర్, జిల్లా అధి కారులు, డ్వాక్రాసంఘాల సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 77,121 మంది డ్వాక్రా మహిళలను లక్షాధికారులుగా చేసే లక్ష్యంతో పనిచేస్తు న్నట్టు తెలిపారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్ర



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

బాబు 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని సెర్ప్‌కు అనుసంధానం చేస్తామని చెప్పార న్నారు. దీంతో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామన్నారు. డ్వాక్రా సభ్యులకు రుణసదుపాయం కల్పించి వారి జీవ నోపాధిని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నెలవారీ ఆదాయం రూ.10వేలకన్నా తక్కువగా ఉన్నవారిని గుర్తించి, వారికి ప్రభుత్వ పథ కాలను చేరువచేసి, వివిధ వృత్తుల్లో నైపుణ్యం పెంచుకునేలా తగిన శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 294 డ్వాక్రాసంఘాలకు రూ.45.40కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు, 460గ్రూపులకు రూ. 6.18కోట్ల సామా జిక పెట్టుబడి నిధి రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్, జిల్లాసమాఖ్య అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ, కోశాధికారి ఎస్.రాజకుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



భవానీ ద్వీపానికి మరిన్ని సొబగులు!

- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి : పశ్చిమ ఎమ్మెల్యే సుజనా

విద్యాధరపురం, ఆగస్టు 25 : పర్యాటక ప్రాంతమైన భవానీద్వీ పాన్ని మరింత అభివృద్ధి చేయటమే లక్ష్యంగా కృషి చేస్తానని విజయ వాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనాచౌదరి) అన్నారు. ఆదివారం సాయంత్రం కూటమి నేతలతో కలిసి భవానీపురంలోని భవానీద్వీ పాన్ని ఆయన సందర్శించారు. ద్వీపాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏపీ టూరిజం అధికారులు, సిబ్బం దితో అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకు లతో మాట్లాడి సమస్యలు, సలహా లను తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భవా నీద్వీపం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని పర్యాటక అధికారి పి.ఎస్.కె. కృష్ణ చైతన్యను కోరారు. ద్వీపంలో అనేక అవకాశాలు, వన రులు ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం భవానీద్వీప అభివృద్ధిని విస్మ రించిందన్నారు. ఇంద్రకీలాద్రిని ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చటంతో పాటు భవానీద్వీపాన్ని కూడా అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తా మన్నారు. కార్యక్రమంలో బరంపార్క్ యూనిట్ మేనేజర్ శ్రీనివాసరావు, భవానీద్వీపం మేనేజర్ సుధీర్, కూటమి నాయకులు బొమ్మసాని సుబ్బారావు, ఎంఎస్ బేగ్, అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, తది తరులు పాల్గొన్నారు.



భవానీద్వీపంలో పర్యాటకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

గొల్లపూడి : క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుదామని అందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త వారి పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. గొల్లపూడిలోని ఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా అధ్వ ర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్ర మంపై అవగాహన నిర్వహించారు. సెప్టెంబరు 1న ప్రధాని నరేంద్ర మోదీ తన బీజేపీ సభ్యత్వంను పునరుద్ధరించు కొని సభ్యత్వ నమోదును లాంఛనంగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. వికసిత్ భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం సాధించాలనేది ప్రధాని సంకల్పం అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సహకారంతో తనకు 47 వేలకు పైగా మెజార్టీ వచ్చిందని, ఓటు వేయని వారిని కూడా అక్కున చేర్చు కుంటానన్నారు. తనకంటూ ప్రత్యర్థులు ఎవ్వరూ లేరని అందరూ మిత్రులే అన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదును ప్రతి నాయకుడు బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ, రాజమండ్రి ఇన్‌చార్జి భగవాన్, నూతులపాటి బాలకోటే శ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కీచక టీచర్‌పై కేసు

ఈడుపుగల్లు(కంకిపాడు), ఆగస్టు 25 : ఈడుపు గల్లు ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న బాలిక పట్ల అస భ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కంకిపాడు స్టేష న్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వి వరాల ప్రకారం.. ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాలలో ఉపా ధ్యాయుడిగా పనిచేస్తున్న మండవ వెంకటశ్రీనివాస్ పాఠ శాలలో బాలిక పట్ల కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తించ డంతో బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. బాలిక తల్లి ఫిర్యా దుమేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి

గంపలగూడెం : గాదేవారిగూడేనికి చెందిన నంద్యాల నాగరాజు కుమారుడు 11 నెలల బాలుడు ఆదివారం విష జ్వరంతో మృతి చెందాడు. తిరువూరులో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో బాలుడికి వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

సమాజంలో మీడియా పాత్రకు ప్రాధాన్యం

- పాత్రికేయుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 : సమాజంలో మీడియా పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని, పాత్రికేయుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో మచిలీపట్నం ఆర్‌కె ప్యారడై జ్‌లో కృష్ణాజిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మన్నే సోమేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డిడి వెంకటేశ్వరప్రసాద్ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంత్రులు కె.పి. సారథి, కొల్లు రవీంద్రల సందేశాన్ని వి నిపించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఇళ్లు, అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని మంత్రులు చేసిన వాగ్దానాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా మత్తి శ్రీకాం త్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జు నరావు, వై.వెంకటరమణ, చైతన్య, విజయకుమార్ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న పబ్లిక్ రిలేషన్స్ డిడి వెంకటేశ్వర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

గంజాయి గుట్టురట్టు

- ఐదుగురి అరెస్టు
- రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు వెల్లడి

గుడివాడ, ఆగస్టు 25 : గంజాయి రవాణా, వి క్రయం, వినియోగాన్ని ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన శిక్షలు తప్పవని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఇటీవల పట్టుకున్న ప్రధాన సప్లయిదారుడు, నలుగురు గంజాయి విక్రేతలను మీడియా ఎదుట హాజరుపరి చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ నెల 19న గుడివాడ శివారు శ్రీకాళహస్తి కాలనీ వద్ద అను మానాస్పదంగా సంచరిస్తున్న కొందరు యువకులను పట్టుకోగా, 6.300కిలోల గంజాయి దొరికిందని, ఇద్దరు పారిపోయారని, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నా మన్నారు. ఆదివారం రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద పొదల్లో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో సీలేరుకు చెందిన గంజాయి సప్లయిదారుడు కోడా నీలందారావు, పెదపారుపూడికి చెందిన జగన్నాథం లోకేష్, గుడివాడకు చెందిన చల్లా యేసు, బండారు తిరుపతి, మరో మైనరును ఉన్నారన్నారు. వీరి నుంచి రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. గంజాయిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా, డివిజన్ స్థాయిలో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసామన్నారు. గంజాయి నిందితులను పట్టు కోవడంలో చొరవ చూపిన వారికి నగదు పురస్కారా లను అందజేశారు. సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ ఎ.సుభాష్, సీఐలు ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు, రమ ణమ్మ, మోజెస్, ఎస్ఐలు ఎన్.చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దృశ్య వేదిక ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 25 : దృశ్య వేదిక సంస్థ అధ్వ ర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరిం చాయి. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాల యంలో ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ నృత్య కదంబం, అమృతహస్త నాటిక ప్రదర్శనలు ఆహుతులను మైమరిపించాయి. శ్రీ నిత్య కళాని లయం నాట్య విద్యార్థులు సత్యానందిని, కావ్య, హేమస్వీ, లావణ్య, ఆసిక, శైలజ, కాత్యాయని, రాస్య, హాషిత ఖ్యాతిలు శ్రీ కృష్ణాష్టమి పుర స్కరించుకొని కృష్ణతత్వంను తెలియజేసే కూచిపూడి నాట్య ప్రదర్శనలు ప్రద ర్శించి నయనానందకరం చేశారు. నాట్యాచారిని గోను గుంట శైలజశ్రీ పర్యవేక్షిం చారు. తదుపరి ప్రదర్శిం చిన అమృత హస్తం నాటిక ప్రేక్షకులను ఆలోచింపచే సింది. ఒక తల్లి కడుపున పుట్టిన అన్నా చెల్లెలు ప్రేమ అనుబంధాలు చాలా గొప్ప వని, సమాజంలో మృగ్యం అయిపోతున్న ఇలాంటి బంధాలు ఎంత అవసరమో సమాజానికి గుర్తు చేయడం అనే ప్రధాన అంశంగా సందేశాత్మకంగా ఈ నాటిక సాగింది. కావూరి సత్యనారాయణ, ఏహూరి హరిబాబు, సరిత, మాధవి, గోపాలరెడ్డిలు ప్రధాన పాత్రలు పోషించి మెప్పించారు. సాయితేజ సంగీతం అందించగా శ్రీధర్ ఆహార్యంతో సహకారం అందించారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ పర్యవేక్షించారు.



శ్రీకృష్ణ లీలలు నాట్యాన్ని ప్రదర్శిస్తున్న గోనుగుంట శైలజ శిష్య బృందం



'అమృత హస్తం' నాటకంలో ఓ సన్నివేశం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

బీసీలకు రిజర్వేషన్ల ఘనత బీపీ మండల్‌దే: దశరథరామిరెడ్డి

ధర్నాచౌక్: బీసీలకు రిజర్వేషన్లు కల్పించి సమాజంలో వారికి గౌరవాన్ని తెచ్చిన ఘనత బీపీ మండల్‌కే దక్కుతుందని ఆలిండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపకుడు నాగిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు. బీపీ మండల్ జయంతిని గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 1970-80 బీపీ మండల్ చైర్మన్‌గా బీసీల అభివృద్ధికి అప్పటి కేంద్రప్రభుత్వానికి 40 సిఫార్సులు చేయగా వాటిలో ఒకటి మాత్రమే అమలు చేశారన్నారు. నేడు బీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలు ఆయన చొరవేనన్నారు. ప్రత్యేక హోదా జేఏసీ స్టేట్ కన్వీనర్ మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దుక్క లక్ష్మణరావుకు సీఎంఆర్‌ఎఫ్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సీఎం సహాయనిధితో పేదల జీవితాల్లో వెలుగులు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఆగస్టు 25: అత్యవసర సమయాల్లో అప్పులు చేసి వైద్యం చేయించుకునేవారికి, ఆరోగ్య శ్రీతో వర్తించని వైద్యానికి సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం రెండో డివిజన్ బ్రహ్మానందరెడ్డి నగర్‌కు చెందిన దుక్క లక్ష్మణరావుకు మోకాలు ఆపరేషన్ నిమిత్తం రూ.లక్షా 10వేలు సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే గద్దె అందజేసి మాట్లాడారు.

ఉచిత మెడికల్ క్యాంపు

మానవసేవ మాధవ సేవని, తోటివారికి సహాయం చేయాలనే ఆలోచన రావడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన పోతుల రాజేంద్ర ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. 13వ డివిజన్ పటమట కిసాన్‌రోడ్డు తోటవారి వీధి సచివాలయంలో ఆదివారం పోతుల రాజేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో హార్ట్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం గుండెకు సంబంధించిన వ్యాధులు తీవ్రంగా ఉన్నాయని, వైద్యులు ఇక్కడికి వచ్చి ఉచిత గుండె పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఠాగూర్ లైబ్రరీలో చేతిరాత తరగతులు

గవర్నర్‌పేట, ఆగస్టు 25: నగరంలోని ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం చేతిరాతలో మెళకువలను నేర్పించారు. ఉపాధ్యాయురాలు ఎం. దుర్గా భవానీ విద్యార్థులకు అందమైన చేతిరాత రాయడం నేర్పించడంతో పాటు, పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందటంలో చేతిరాతకున్న ప్రాధాన్యతను వివరించారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి మాట్లాడుతూ అందమైన చేతిరాత విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటను వేస్తుందన్నారు.

మురుగునీరు తాగేదెలా..?



భారతీనగర్ కాలనీ 13వ రోడ్డులోని సాయితేజ అపార్ట్‌మెంట్‌లో వస్తున్న మురుగునీరు

భారతీనగర్, ఆగస్టు 25: కాలనీలోని 13వ రోడ్డులోని సాయితేజ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో వాటర్ పైపుల నుంచి తాగునీటికి బదులుగా మురుగునీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీ ఎక్కువ కావడంతో మంచినీరు మురికిగా వస్తుందని స్థానికులు వాపోతున్నారు. నెలరోజుల నుంచి ఉదయం, సాయంత్రం మున్సిపల్ వాటర్ వదిలిన ప్రతిసారి మురుగు నీరే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అసలే నగరంలో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ మురుగునీరు తాగితే ఎక్కడ అనారోగ్యానికి గురవుతామోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తక్షణం చర్యలు తీసుకుంటాం: ఏఈ

సిబ్బందిని వెంటనే పంపించి 13వ రోడ్‌లోని వాటర్ పైపులను మరమ్మతులు చేసి మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ నాగేశ్వరరావు అన్నారు.



బ్యాంక్ కాలనీ వాటర్‌ట్యాంక్ రోడ్డులో లీకవుతున్న మున్సిపాల్ వాటర్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

చంద్రబాబుకు ధన్యవాదాలు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 25: రాష్ట్ర గ్రామ సచివాలయ సంక్షేమ, విద్యా ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగింది. గ్రామ సచివాలయ వ్యవస్థను సమర్థవంతంగా చేసేలా సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సచివాలయ శాఖకు మంత్రిని కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ వ్యవస్థలో కీలకమైన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి కె సుధాకర్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న బొండా సుజాత

వినాయకచవితి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మొగల్రాజపురం, ఆగస్టు 25: మధురానగర్, వీవీ నరసరాజు రోడ్డులో రంకిరెడ్డి సూర్య నారాయణ, గణపతి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు భార్య బొండా సుజాత ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకుల్లో ఒకరైన రంకిరెడ్డి లాలాజీ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 7 నుంచి జరిగే వేడుకలకు ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 15న అన్నదానం ఉంటుందని, 19న స్వామి ఊరేగింపు ఉంటుందన్నారు. గణపతి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హైడ్రా వంటి సంస్థ అవసరం: శివాజీ

విజయవాడ: హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా వంటి వ్యవస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఏపీసీసీ సభ్యుడు కొలనుకొండ శివాజీ ఆదివారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతున్నాయని, డ్రెయినేజీలు అస్తవ్యస్థంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బుడమేరును భూమాఫియా ఆక్రమించుకుని అనధికార కట్టడాలు నిర్మించిందని ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ నగరాల్లో చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వెలసిన భవనాలను కూల్చడానికి హైడ్రా వంటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



దొరస్వామిని సత్కరిస్తున్న వివధ రంగాల ప్రముఖులు

గ్రంథాలయాల పునర్వైభవానికి కృషిచేయాలి

● ఆచార్య కొంగర సురేంద్రబాబు

పటమట, ఆగస్టు 25: భారత గ్రంథాలయ చరిత్రలో రాష్ట్ర గ్రంథాలయోద్యమం కీలకపాత్ర వహించిందని, దీని పునర్వైభవానికి గ్రంథాలయరంగ నిపుణులు, ప్రభుత్వాలు కృషి చేయాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథ పాలకుడు ఆచార్య కొంగర సురేంద్రబాబు అన్నారు. పాతూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూరా అధ్యక్షతన జరిగిన పాతూరి నాగభూషణం పురస్కార ప్రధాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 ఏళ్ల పైబడి ఈ రంగ ప్రగతికి అహర్నిశలు కృషి చేసిన పాతూరి వారి పురస్కారం ద్రవిడ విశ్వవిద్యాలయం లైబ్రేరియన్, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం దొరస్వామికి ఇవ్వడంపై గ్రంథపాలకులకు స్ఫూర్తి కలుగుతుందన్నారు. గౌతమీ గ్రంథాలయం రిటైర్డు గ్రంథపాలకుడు సన్నిదానం నరసింహశర్మ, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్‌బాబు, ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



గాత్ర కచేరీ చేస్తున్న విష్ణుభొట్ల సోదరీమణులు

అలరించిన గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, ఆగస్టు 25: స్వరతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కచేరీ ప్రేక్షకులను అలరించింది. సత్యనారాయణపురం శివరామకృష్ణక్షేత్రంలో ఆదివారం సాయంత్రం సంస్థ నెలవారీ సంగీత కచేరీ, విష్ణుభొట్ల సోదరీమణులు వి.సరస్వతి, వి.కృష్ణవేణిల గాత్ర కచేరీ జరిగింది. ఈ గాత్రయుగళంలో తొలుత శహన రాగం-గిరిజన రమణ నతజనశరణ (గంభీర నటరాగం)లో జరిగింది. కమలాంబ సంరక్షతు (ఆనందభైరవి రాగం)లో రామనామము (అఠాణ రాగం), పరమాత్ముడు వెలిగే (వాగదీశ్వరి రాగం)లో శ్రావ్యంగా గానం చేశారు. భోగీంద్రశాయినం (కుంతళ వరాళి రాగం) అత్యంత రమణీయంగా కీర్తనలను ఆలపించారు. వీరికి వాయిద్య సహకారం వయొలిన్‌పై విష్ణుభొట్ల శ్రీ పూర్ణగాయత్రి శివానీ-మృదంగంపై బీవీఎస్ ప్రసాద్, ఘటంపై ఎం.హరిబాబు సహకరించారు.

అమ్మకానికి సిద్ధమైన వినాయక విగ్రహాలు

సత్యనారాయణపురం, ఆగస్టు 25: అయోధ్యనగర్ నూజివీడు రహదారిపై విఘ్నేశ్వరనుడి విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. సెప్టెంబరు 7న వినాయకచవితి సందర్భంగా పందిళ్ల ఏర్పాటుకు అడుగు నుంచి 13 అడుగుల్లో ఉన్న వినాయక విగ్రహాలను అయోధ్యనగర్ లోటస్‌ల్యాండ్ మార్క్ నూజివీడు రహదారిపై అమ్మకానికి ఉంచారు. అడుగు విగ్రహం రూ.1500 ఉండగా ఐదడుగులు విగ్రహం రూ.8 వేలు, 12 అడుగులు విగ్రహం రూ.20వేలకు పైగా చెబుతున్నారు. చవితి దగ్గరకు రావడంతో వీటిని కొనేందుకు వివిధ ప్రాంతాల వారు కావాల్సిన విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి కొనుక్కొని వెళుతున్నారు. గతేడాదితో పోలిస్తే రేట్లు ఆరీగా పెరిగాయని కొనుగోలుదారులు చెబుతున్నారు.

అమ్మకానికి సిద్ధమైన విగ్రహాలు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభం

రామలింగేశ్వరనగర్, ఆగస్టు 25: శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఇస్కాన్ మందిర ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మందిరంలో జగన్నాథ స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాభిషేకం, స్పెషల్ కీర్తన, 2వేల కేజీలతో మహా పుష్పాభిషేకంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి మహోత్సవంలో విద్యార్థులు, భక్తులు ఉత్సహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. అనంతరం స్వామికి 108 రకాల ప్రసాదాలతో మహా భోగా సమర్పించారు. ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారి దాస్, భారీగా భక్తులు, సభ్యులు పాల్గొన్నారు.



ఉట్టి కొడుతున్న యువకులు





రాధాకృష్ణుల విగ్రహం, అలరించిన నృత్యప్రదర్శన

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

గవర్నర్‌పేట, ఆగస్టు 25: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆదివారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ నగర బ్రాంచ్ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించినట్టు బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, అకడమిక్ ప్రిన్సిపాల్ షేక్ షరీఫ్ తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో డి.విజయ్ ప్రీతమ్ 32వ ర్యాంకు, కె.చైతన్య సాయిశరత్ 49వ ర్యాంకు సాధించారన్నారు. సీఎంఏ ఫైనల్‌లో ఎం.సాయికృష్ణ 49వ ర్యాంకు సాధించారన్నారు. మాస్టర్‌మైండ్స్ అకడమిక్ ప్రణాళిక, క్రమశిక్షణ కారణంగా విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు.



49వ ర్యాంకు సాధించిన సాయికృష్ణ



రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న బొండా ఉమ

స్పందన సేవా సమితిలో ఉచిత వైద్య శిబిరం


పాయకాపురం, ఆగస్టు 25: నగరంలోని ప్రశాంతినగర్‌లోని స్పందన సేవా సమితి కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొండా ఉమా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, ఠాగూర్ హాస్పిటల్ వైద్యులు 222 మందికి సాధారణ జ్వరాలతో పాటు, గుండె పరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం బొండా ఉమా రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణ ప్రసాద్, మురళి పాల్గొన్నారు.



నాగార్జున జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సర్వేశ్వరరావు

ఘనంగా అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు

ధర్నాచౌక్, ఆగస్టు 25: అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన సర్దార్ ఎస్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక అలంకార్ సెంటర్‌లో నాగార్జున కటౌట్‌కు పూలదండలు వేసి, టపాసులు కాల్చి సందడి చేశారు. కటౌట్‌కు పాలభిషేకం చేశారు. సర్వేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్.కన్వెన్షన్‌కు ఎలాంటి నోటీసులివ్వకుండా తెల్లవారుజామున కూల్చి వేయడాన్ని ఖండించారు. టీ శేఖర్, బీకృష్ణ, ఎస్ సత్యం, కే ప్రభాకర్, ప్రదీప్, శివమణి, భాస్కర్, కామేశ్వరరావు, రామిరెడ్డి, హనుమంతరావు, రియాజ్, రాంబాబు, శరవణ, మధుసేన, కిరణ్ పాల్గొన్నారు.



దిక్సూచి
DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ.... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంభించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్
రీజనింగ్

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణాకాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.
   - ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
   - బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
   - సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
   - డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
   - ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.
   - ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
   - బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
   - సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
   - డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
   - ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.
   - ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
   - బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
   - సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
   - డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
   - ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.
   - ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
   - బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
   - సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
   - డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
   - ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.
   - ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
   - బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
   - సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
   - డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
   - ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవగిల్ తదితరులు

నగరంలో అహో విక్రమార్క చిత్ర యూనిట్ సందడి

లబ్బీపేట, ఆగస్టు 25: నగరంలో అహో విక్రమార్క చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం బందర్‌రోడ్డులోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరో దేవగిల్ మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమకు మగధీర చిత్రంతో విలన్‌గా పరిచయం అయిన తాను తొలిసారి హీరోగా నటించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుందని చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. 14ఏళ్ల క్రితం ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తనను మగధీర చిత్రంతో తెలుగుతెరకు పరిచయం చేశారని నాటి నుంచి తెలుగు, హిందీ, కన్నడ, మరాఠా చిత్రాల్లో విలన్‌గా నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందానన్నారు ఎస్ఎస్ రాజమౌళి శిష్యుడు పేట త్రికోటి దర్శకుడుగా మారి తొలిసారి నిర్మించిన అహో విక్రమార్క చిత్రంలో హీరోగా నటిస్తున్నన్నానని. ప్రముఖ సంగీత దర్శకుడు రవి బస్రూర్ అందించిన సంగీతం చిత్రానికి హైలైట్‌గా ఉంటుందని, ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయన్నారు. సినిమా ట్రైలర్‌ను ఎస్ఎస్ రాజమౌళి విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చిత్ర దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ సినిమాను 5 భాషల్లో విడుదల చేస్తున్నామన్నారు. నిర్మాత ఆర్తి దేవేంద్ర గిల్, నటుడు వంశీ చాగంటి పాల్గొన్నారు.



పికిల్ బాల్ చాంపియన్‌షిప్ బ్రోచర్లను ఆవిష్కరించిన శ్రీధర్, వంశీ, శివ

స్టేట్ పికిల్‌బాల్ చాంప్‌ను విజయవంతం చేయండి
● బ్రోచర్ల ఆవిష్కరణలో శ్రీధర్

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 25: నూతనంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన పికిల్‌బాల్ పోటీలపై విస్తృతమైన ప్రచారం, ఆసక్తి కల్పించేందుకు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు గుంటూరులోని హనుమాన్ నగర్ ఒకటో లైన్లో ప్రథమ ఏపీ స్టేట్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్ శ్రీధర్, అధ్యక్షుడు పి వంశీ ప్రకటించారు. నగరంలోని ఏపీ పికిల్‌బాల్ సంఘం క్రీడా ప్రాంగణంలో ఆదివారం పోటీలకు సంబంధించిన బ్రోచర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పోటీలు అండర్-14,19 బాలుర విభాగంలో సింగిల్స్, ఓపెన్, 35 ప్లస్, 50 ప్లస్ విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ ఈవెంట్లు జరుగుతాయని, అందరూ ఆదరించాలన్నారు. సీనియర్ క్రీడాకారులు సీహెచ్ శివ, ఏపీ పికిల్‌బాల్ సంఘం చీఫ్ కోచ్ శివప్రసాద్ పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో నేడు పీజీఆర్ఎస్ రద్దు

విజయవాడ: పోలీసు కమిషనరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) రద్దు చేసినట్టు సీపీ రాజశేఖరబాబు తెలిపారు. కృష్ణాష్టమికి ప్రభుత్వ సెలవుదినం కావడంతో రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

తైక్వాండోలో శృతికి స్వర్ణం, జశ్వితకు రజతం

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిసిన ఏషియన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన ఎర్రంశెట్టి శృతి స్వర్ణం, ఎర్రంశెట్టి జశ్విత రజతంను వశం చేసుకున్నారు. ఇండియా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఈ అక్కాచెల్లెళ్లు 13 ఏళ్ల బీ కేటగిరిలో బాలికల 45 కేజీల విభాగంలో స్వర్ణ,రజతాలతో సత్తా చాటారు. ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ డాన్ డెల్టాన్ చేతుల మీదుగా మెడల్స్‌ను స్వీకరించారు. వీరిని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ డీవీడీ ప్రసాద్, అభినందించారు. ఎర్రంశెట్టి సిస్టర్స్ తండ్రి న్యాయవాది రాజు కూడా గతంలో తైక్వాండోలో జాతీయస్థాయిలో బంగారు పతకాన్ని సాధించారు.





దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు, పల్లకిసేవలో పాల్గొన్న ఈవో రామారావు

దుర్గామల్లేశ్వరులకు పల్లకిసేవ

వన్‌టౌన్, ఆగస్టు 25: దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం సాయంత్రం దుర్గా, మల్లేశ్వరుల పల్లకీసేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల కోలాహలం మధ్య నడుమ పల్లకిని ఈవో రామారావు మోసి దుర్గామల్లేశ్వరులను అర్చించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

నూతన దంపతులకు ఆశీస్సులు

నూతనంగా వివాహం చేసుకున్న దంపతులకు దుర్గగుడిలో నేరుగా అంతరాలయం దర్శనం కల్పించి, ప్రత్యేకంగా ఆశీస్సులు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆలయానికి వచ్చిన నూతన దంపతులకు అమ్మవారి దర్శనం కల్పించి ఆశీస్సులు, ప్రసాదం అందజేశారు. ఈవో రామారావు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన, తరంగాల ఆలాపన

ధర్మపథం వేదికపై మంజూష ఆధ్వర్యంలోని అరుణోదయ కళాసమితికి చెందిన కళాకారులు ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పలు కీర్తనలకు చక్కని హావ, భావ ప్రదర్శనతో నాట్యం చేసి అభినందనలు అందుకున్నారు. ఇదే వేదికపై గోరకవి సంపత్‌కుమార్ నారాయణ తీర్థుల వారి తరంగాలను భక్తి శ్రద్ధలతో హృద్యంగా వినిపించారు. నారాయణ తీర్థుల వారి తరంగాలు భక్తుల హృదయాలను పులకింపజేశాయి. అత్యంత భక్తిపూరితమైన గానాన్ని సంపత్‌కుమార్ వినిపించారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రిన్సిపల్ సెక్రటరీ

దుర్గమ్మను ఆదివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్ దంపతులు దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలు అందజేయగా, దుర్గమ్మ దర్శనానంతరం ఈవో రామారావు ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందచేశారు. వేదపండితులు ఆశీస్సులందజేశారు.



అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్ దంపతులు

నిత్యాన్నదానానికి విరాళాలు

విశాఖపట్నం, శ్రీహరిపురానికి చెందిన డి. కృష్ణమూర్తి రెడ్డి తమ కుటుంబ సభ్యులతో ఆదివారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి నిత్యాన్నదానానికి ఈవో రామారావును కలిసి రూ.లక్షను చెక్కురూపంలో అందచేశారు. డి.చలపతి, కుందన, జ్యోతి, నిఖిత పేరిట నిత్యాన్నదానం చేసేందుకు ఈ విరాళాన్ని అందజేశారు. అలాగే కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లికి చెందిన కందిమల్ల శ్రీనివాసరావు, వాసంతి దంపతులు ఆలయానికి విచ్చేసి నిత్యాన్నదానం నిమిత్తం ఏఈవో రమేష్‌ను కలిసి రూ.1,01,116లను చెక్కురూపంలో అందచేశారు. దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, చిత్రపటం ఇచ్చారు.

రౌడీషీటర్లకు సీఐల హెచ్చరిక

వన్‌టౌన్, ఆగస్టు 25: అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు చేపడతామని పలువురు సీఐలు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం గవర్నర్‌పేట, కృష్ణలంక, సూర్యారావుపేట, భవానీపురం, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ రౌడీ షీటర్లపై నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే మరిన్ని కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా గొడవలు జరిగిన వెంటనే పోలీసు స్టేషన్లకు సమాచారం ఇవ్వాలన్నారు. మంచిగా ఉన్న వారిని గుర్తించి వారిపై రౌడీషీట్‌ను తొలగించేలా పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న గవర్నర్‌పేట సీఐ సత్యనారాయణ

మందుబాబులకు కౌన్సిలింగ్

విద్యాధరపురం: స్థానిక భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులకు ఆదివారం సాయంత్రం భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని సితార సెంటర్, అటకెన్‌సన్ స్కూల్ రోడ్డు, పంటకాలువ రోడ్డు, భవానీపురం అవుట్ ఏజెన్సీ, గొల్లపూడి కరకట్ట తదితర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 35 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారికి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఓమినీ వాహనం మొరాయించటంతో దిగిపోతున్న భక్తులు

దుర్గగుడి ఘాట్‌రోడ్డుపై అనధికార వాహనాల రాకపోకలు
● చోద్యం చూస్తున్న సిబ్బంది, గార్డులు, పోలీసులు ● ఈవో సీరియస్

వన్‌టౌన్, ఆగస్టు 25: దుర్గగుడి ఘాట్‌రోడ్డు కొండపైకి కొందరు డ్రైవర్లు తమ వాహనాలకు ఎలాంటి అనుమతి లేకుండానే భక్తుల నుంచి అదనంగా రుసుము వసూలు చేస్తూ వాహనాలు నడుపుతున్నారు. దుర్గగుడి టోల్‌గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, హోం గార్డులు, వన్‌టౌన్ పోలీసులు చోద్యం చూస్తున్నారు. అనధికారికంగా భక్తులను తరలిస్తున్న వాహనాలకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే అందుకు బాధ్యత ఎవరిదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఘాట్‌రోడ్డు కొండపైకి భక్తులు తమ స్వంత కారులు, మోటారు బైక్‌లపై రాకపోకలకు మాత్రమే అనుమతి ఉంది. దేవస్థానం ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. గతంలో ఘాట్ రోడ్డు కొండ పైకి టాటా ఏసీ వాహనాలు, మారుతీ వ్యాన్‌లు, ఆటోలు, ఇతర వాహనాలు అనధికారికంగా రాకపోకలు సాగించటంతో అప్పటి అధికారులు వాటిని నిలిపివేశారు. దీనిపై ఈవో ప్రత్యేక ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం కొందరు డ్రైవర్లు కనకదుర్గనగర్, మోడల్ గెస్ట్‌హౌస్, దుర్గాఘాట్ వద్ద నుంచి ఒక్కో భక్తుడి నుంచి రూ.30 చొప్పున వసూలు చేసి కొండపైకి తీసుకువెళుతున్నారు. టోల్‌గేట్ వద్ద తనిఖీ చేయాల్సిన ఉద్యోగులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, హోం గార్డులు, వన్‌టౌన్ పోలీసులు పట్టించుకోవటం లేదు. ఆదివారం ఉదయం ఓ డ్రైవర్ ఓమినీ వాహనంలో ఓ డ్రైవర్ సుమారు 15 మంది భక్తులను ఎక్కించుకుని ఘాట్ రోడ్డు నుంచి కొండపైకి బయలుదేరాడు. గాలిగోపురం వద్ద ఓవర్ లోడు కావటంతో వాహనం మొరాయించింది. దీంతో భక్తులు కొంత ఆందోళనకు గురయ్యారు. అదే సమయంలో కొండపైన భక్తులను దించి కిందికి వస్తున్న మరో ఓమిని వాహనం, టవేరా వాహనాలను ఆపి ఆ భక్తులను ఎక్కించి కొండపైకి పంపించాడు. సుమారు 10 ఓమినీ, టవేరా వాహనాల్లో అనధికారికంగా ఘాట్ రోడ్డు నుంచి కొండపైకి భక్తులను తీసుకుని వెళుతున్నారు. దీంతో దేవస్థానం ఆదాయానికి గండిపడుతోంది. ఈ వ్యవహారంలో వాహనాల డ్రైవర్లు టోల్‌గేట్ వద్ద టోకెన్‌లిచ్చే కాంట్రాక్టర్‌కు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, హోంగార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీ, వన్‌టౌన్ పోలీసులకు మాముళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈవో సీరియస్.. బాధ్యులపై చర్యలు

ఘాట్ రోడ్డు నుంచి కొండపైకి అనధికారికంగా ఓమినీ వాహనాలు, టవేరా వాహనాలను అనుమతిస్తున్న టోల్‌గేట్ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ, హోం గార్డులు, వన్‌టౌన్ పోలీసులపై ఈవో రామారావు సీరియస్ అయ్యారు. ఆయన స్వయంగా టోల్‌గేట్ వద్ద అనధికారికంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను గుర్తించారు. ఆ వాహనాల డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఎలాంటి ప్రైవేటు డ్రైవర్ల వాహనాలను ఘాట్ రోడ్డు కొండపైకి అనుమతించవద్దని ఆయన అధికారులను స్పష్టం చేశారు.



అనధికార వాహనాల్లో కొండపైకి తీసుకెళ్తున్న డ్రైవర్లు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 26 ఆగస్టు 2024

సెలబ్ ఫిట్

నాన్నే ఆదర్శంగా...

సినిమాల్లో పెద్దగా కనిపించకపోయినా... అభిమానులతో ఎప్పుడూ టచ్‌లోనే ఉంటుంది అథియా శెట్టి. హీరో సునీల్‌శెట్టి వారసురాలిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ... స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌ను ప్రేమించి పెళ్లాడి అటు క్రికెట్ ప్రేమికులకూ దగ్గరైంది. ఇన్‌స్టాలో తరచూ తన వర్కవుట్ సెషన్స్‌ను పోస్ట్ చేస్తూ... యువతను వ్యాయామాల వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తోంది.

'హీరో' చిత్రంతో తొలిసారి వెండితెర మీద కనిపించిన అథియా, ఆ ఏడాది ఫిలిమ్‌ఫేర్ అవార్డు గెలుచుకుంది. అయితే ఆ తరువాత రెండు మూడు చిత్రాల్లో మినహా పెద్దగా చేయలేదు. అయినా లేటెస్ట్ లుక్స్‌తో... తన దైనందిన జీవితానికి చెందిన విశేషాలతో సామాజిక మాధ్యమాల్లో నిత్యం బిజీగా గడుపుతోంది. అన్నిటికీ మించి భారత స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌తో ప్రేమాయణం ఎపిసోడ్‌వల్ల క్రికెట్ అభిమానులతో కూడా బాగా కనెక్ట్ అయింది. గత ఏడాది జనవరిలో రాహుల్‌ను పెళ్లి చేసుకున్న ఆమె... తన వైవాహిక జీవితంలోని మధురిమలను అప్పుడప్పుడూ ఇన్‌స్టాలో పంచుకొంటోంది. అంతేకాదు... పెళ్లి తరువాత కూడా అంతే నాజూకుగా మురిపిస్తోంది. అందుకు క్రమం తప్పని తన వ్యాయామాలే కారణమంటూ... ఆ చిత్రాలను పోస్ట్ చేస్తోంది. ఎందరికో ప్రేరణగా నిలుస్తోంది. ఆమె ఫిట్‌నెస్, డైట్‌ప్లాన్‌పై మీరూ ఓ లుక్కేయండి.

వర్కవుట్ ఇలా...

వారంలో కనీసం ఐదు రోజులు అథియా జిమ్‌కు వెళుతుంది. తన శరీర తత్వాన్ని బట్టి వివిధ రకాల వ్యాయామాలకు సమయం కేటాయిస్తుంది. ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ గోల్స్ నిర్దేశించుకొంటుంది. ఇందులో నాన్న సునీల్‌శెట్టినే ఆమెకు స్ఫూర్తి.

- ఉదయం ఇరవై నిమిషాలు కార్డియో. తరువాత వెయిట్ ట్రైనింగ్
- మూడు సెట్స్ చొప్పున పుషప్స్, పుల్‌డౌన్స్, ట్రైసెప్స్ పుష్‌డౌన్స్, డంబెల్స్, బైసప్స్.
- రోజూ ఒకటే రకం వ్యాయామాలు కాకుండా మార్షల్ ఆర్ట్స్ మిక్స్ చేస్తుంది అథియా.
- జిమ్‌కు వెళ్లే ముందు లాంగ్ వాక్స్‌తో ప్రకృతి ఆస్వాదనం.
- ఫ్లెక్సిబిలిటీ కోసం కాసేపు యోగా. మానసిక ప్రశాంతత, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ధ్యానం.

ఇదీ మెనూ...

బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన పోషకాహారం అథియా మెనూలో ఉంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకే ప్రాధాన్యం ఇస్తుంది. వీలైతే తనే వండుకొంటుంది. ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి. ఒకవేళ ప్రయాణంలోనో, పనిలోనో ఉంటే గ్రీన్ జ్యూస్‌లు తీసుకొంటుంది. తీపి పదార్థాలకు దూరం. శరీరం డీహైడ్రేట్ కాకుండా తరచూ కొబ్బరి నీళ్లు తాగుతుంది.

- బ్రేక్‌ఫాస్ట్‌లో పెద్ద బౌల్ నిండా బొప్పాయి, పైనాపిల్, పుచ్చకాయ తదితర తాజా పండ్ల ముక్కలు, జీడిపప్పు, బాదం, వాల్‌నట్స్ లేదంటే చెర్రీ టమోటా, అవకాడో, బాయిల్డ్ ఎగ్స్, మల్టీగ్రెయిన్ బ్రెడ్. అప్పుడప్పుడూ పాన్‌కేక్స్
- లంచ్‌కు రాజ్మా చావల్. ఇది తన ఆల్‌టైమ్ ఫేవరెట్.
- లంచ్ తరువాత గంటకు ఐస్‌డ్ లెమన్ వింట్ టీ.
- వారాంతంలో ఎప్పుడైనా ఐస్‌క్రీమ్





ఆమె అవమానం ఎదురైనా, ఆత్మాభిమానం గాయపడినా భగ్గున మండే భాస్వరం. ముఖ్యమంత్రులనైనా నిలదీసే ముక్కుసూటిదనం... గల్లా అరుణకుమారి స్వభావం. అలాంటి నిక్కచ్చి మనిషి తన 'స్వీయ చరిత్ర'ను అక్షరబద్ధం చేశారు. అది కేవలం ఆమె ఆత్మకథ మాత్రమే కాదు... ఆరు దశాబ్దాలుగా అనేక రూపాలు మార్చుకున్న తెలుగు నేల రాజకీయ చరిత్ర కూడా. ఆ వెయ్యి పేజీల పుస్తకం ఈ నెల 30న తిరుపతిలో విడుదల కాబోతున్న సందర్భంగా... 'నవ్య' ఆమెతో సంభాషించింది.

ఆ ప్రశ్నే నన్ను రాజకీయాల్లోకి నడిపించింది

మీకు ఆత్మకథ రాయాలని ఎలా అనిపించింది?

తొమ్మిదేళ్ల క్రితం అమెరికాలో ఉన్న మా అమ్మాయి రమ దగ్గరకు వెళ్లాను. "ఎవరెవరి కథలో రాశావు. నీ కథ కూడా రాయమ్మా" అంటూ తను నా వెంట పడింది. 'ఏం రాయాలి? ఎలా రాయాలి? అసలెందుకు రాయాలి?' అనే ప్రశ్నలు నన్ను ముందుకు కదలనివ్వలేదు. కానీ రమ వదలలేదు. లైబ్రరీకి తీసుకువెళ్లింది. "ఇక్కడ బోలెడు స్వీయచరిత్రలు ఉన్నాయి. చదువు" అని చూపించింది. "ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ రాసుకో" అని నోట్ పుస్తకాలు నాముందు పెట్టి వెళ్లిపోయింది. 'నన్ను నేను చూసుకోవాలి. నాలోకి నేను చూసుకోవాలి' అనుకున్నాను. అలా మొదలు పెట్టాను. పగలు నేను రాసినవన్నీ... రాత్రి తను ఆసుపత్రి నుంచి రాగానే నాతో చదివించుకొనేది. 300 పేజీలు రాశాక ఇండియా వచ్చేశాం. దాంతో రాయడం ఆగిపోయింది. కరోనా సమయంలో మళ్లీ కదిలింది. ఆ సమయంలోనే రాయడం పూర్తి చేసేశాను. రాతలో మొత్తం 3,000 పేజీలు వచ్చింది.

40 ఏళ్ల కిందటే కథలు రాశారు. ఆ అనుభవం పనికొచ్చిందా?

ఇది పూర్తిగా నా కథ. ఈ అనుభవం భిన్నమైనది. అమ్మలేని బిడ్డగా, ఆడపిల్లగా పెరిగాను. నాన్న చాటునుంచి బయటకు వచ్చి, భర్త సహచర్యంతో దేశం దాటాను. తిరిగి వచ్చాక అనేక రాజకీయ పదవుల్లో ఉన్నాను. నా ప్రయాణంలో ఎంతో ఘర్షణ ఉంది. ఇదంతా నా తరువాతి తరాలకు తెలియాలి అనిపించి రాశాను. ఇంట్లో ఎందరున్నా అమ్మలేనితనం నన్ను ఒంటరిని చేసేది. బిడియం, భయం, జంకు.. మాట పెగిలేది కాదు. ముడుచుకుపోయి ఉండేదాన్ని. మా బట్టలుతికే దేశవ్వ "నోట్లో నాలిక లేని బిడ్డ ఎట్లా బతకపోతాదో" అని బాధపడేది. అమెరికా జీవితం నాకు ప్రశ్నను నేర్పించింది. ఆ ప్రశ్నే నన్ను రాజకీయాల్లోకి నడిపించింది.

మీ స్వీయ చరిత్ర మొత్తం చదివాక... అది మీ నాన్నగారు పాటూరి రాజగోపాలనాయుడు జీవిత చరిత్ర అనిపిస్తోంది!

పెళ్లయిన నాలుగు సంవత్సరాలకే భార్య చనిపోతే, బిడ్డ కోసం ఒంటరిగా ఉండిపోయిన వ్యక్తి మా నాన్న. స్వాతంత్ర్య పోరాటం కాలంలో పత్రిక నడిపారని నాన్ననూ, అమ్మనూ కూడా జైల్లో పెట్టారట. అప్పుడు అమ్మకు ఏడో నెల. నేను కడుపులో ఉన్నాను. జైల్లోనే నొప్పులు మొదలుకావడంతో... ఇంటికి తీసుకువెళ్లమన్నారట. వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో కష్టం మీద కాన్పు అయిందట. వారం రోజులకే మళ్లీ తీసుకువెళ్లి అమ్మను జైల్లో పడేశారట. 1947 ఆగస్టు 1న నేను పుట్టాను. 15న దేశానికి వచ్చింది. అమ్మా, నాన్నా విడుదలయ్యారు. అప్పటికే అమ్మకు జైల్లో ఇన్‌ఫెక్షన్ సోకింది. మళ్లీ గర్భవతి అయింది. ఏడో నెలలోనే పుట్టిన బిడ్డ పురిటిలోనే పోయిందట. అమ్మ కొన్ని రోజులకు కన్నుమూసింది. అప్పటికి నాన్నకు పాతికేళ్లయినా లేవు. చెప్పులు కూడా లేకుండా ఒక పల్లె నుంచి మరో పల్లెకు నడిచి తిరుగుతూ ఉండేవాడు. కరువు రోజుల్లో ఒకసారి విరేచనాలు, వాంతులతో పసిబిడ్డనైన నేను ప్రాణాపాయ స్థితిలో ఉంటే... ప్రజల ఆకలి తీర్చడానికి గంజి కేంద్రాలకు వెళ్లిపోయారట. ఆయనకు నీడలా పెరిగిన దాన్ని నేను. మరి నా కథ అంటే ఆయన కథే కదా!

మీ నాన్నగారికి... ఎంపీ టికెట్టు ఇవ్వకపోవడం మిమ్మల్ని బాగా కలతపెట్టినట్టుంది. మీ స్వీయచరిత్రలో పదేపదే ప్రస్తావించారు?

ఇందిరాగాంధీ దగ్గరకు కూడా నేరుగా వెళ్లగలిగిన స్వతంత్రం ఆయనకు ఉండేది. కేంద్రమంత్రులు 'రాజన్నా' అంటూ అభిమానంగా గౌరవించేవారు. బహుశా ఇదే రాష్ట్ర నాయకుల్లో నిశ్శబ్దంగా భయాన్నీ, ఆయనపై వ్యతిరేకతనూ పెంచింది. ఆయన గురువులూ, ఆయన శిష్యులూ కూడా చాప కింద ఎసరు పెట్టారు. ఇందిరాగాంధీ హత్య తర్వాత అధికారం చేపట్టిన రాజీవ్‌గాంధీకి రాష్ట్ర రాజకీయాల పట్ల అప్పటికి అవగాహన లేకపోవడంతో నాన్నకు అన్యాయం జరిగింది.

దీని గురించి మీరు కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని, చెన్నారెడ్డిని, చివరకు అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీని కూడా నిలదీశారు కదా!

అవును. తనకు ద్రోహం చేసిన వారిని కూడా తప్పుపట్టని స్వభావం నాన్నది. నేను ఆయనలా కాదు. ఆయన కోసం నేను ఎవరినైనా కలుస్తానంటే ఆయన ఒప్పుకోరు. అందుకే నాకే టికెట్ కావాలనే సాకుతో అందరినీ కలిశాను. నాన్నకు చిత్తూరు ఎంపీ టికెట్ ఎందుకు ఇవ్వలేదు? అని అడిగాను. అందరూ ఒకే కారణం చెప్పారు... 'చంద్రబాబు వల్ల' అని. చంద్రబాబును కాంగ్రెస్‌లో నాన్న ప్రోత్సహించారు. చాలామంది వ్యతిరేకించినా మంత్రిని చేశారు. చంద్రబాబు ఆ తరువాత ఎన్టీయార్ దగ్గరకు వెళ్లిపోయారు. "ఎన్టీయార్‌కు రాజకీయ అనుభవం లేదు. చంద్రబాబు వల్లే తెలుగుదేశం బలపడుతోంది. ఆయన (మా నాన్న) శిష్యుడిని ఆపలేకపోయారు" అనేది వాళ్లందరూ చెప్పిన కారణం. అయితే 'చంద్రబాబు కేవలం సాకు మాత్రమే' అని నాకు తెలుసు. నాన్న పేరు ప్రతిష్టలు మరింత పెరగడం తమ ఉనికికి ప్రమాదమని అప్పటి నాయకులు చాలామంది భయపడ్డారు. చివరకు ఆచార్య రంగాగారు వారించినా వినకుండా రాజీవ్ గాంధీని నిలదీశాను.

చంద్రబాబు, రాజశేఖరరెడ్డి.... వీరిద్దరి రాజకీయ వ్యవహారశైలిని తప్పు పడుతూ రాశారు. కానీ ఆ సందర్భాల తరువాత కూడా ఆ ఇద్దరితోనూ మీరు సఖ్యతగానే ఉన్నారు. ఎలా సాధ్యం?

'రాజశేఖర్‌రెడ్డి ముందు ఎలా ఉండేవారో కానీ... సీఎం అయ్యాక ఎన్నడూ ఎవరిపట్లా కక్షగా వ్యవహరించలేదు. నేను విన్న రాజశేఖరెడ్డి వేరు, నేను చూసిన రాజశేఖరరెడ్డి వేరు.



ఎమెస్కో ప్రచురించిన ఈ పుస్తకం ఆవిష్కరణ ఈ నెల 30న తిరుపతిలో జరుగుతుంది.

తల్లిలేని బాల్యం, ఇల్లొదిలి ప్రజల్లో తిరిగే నాన్న, ఆడపిల్లను అదుపులో పెంచాలని చూసే నానమ్మ, రక్షణ గోడల్లా నిలిచే అత్తలు... ఆటలు.. భారతాలు... ఎన్జీరంగా తాతయ్య ఇంట్లో ఉండి సాగించిన చదువు... ఎన్నికల్లో నాన్న కోసం తిరిగిన పల్లెలు... ఒక సాధారణ రైతుబిడ్డ రామచంద్రనాయుడుతో పెళ్లి... అమెరికా ప్రయాణం... ఉద్యోగం కోసం అగచాట్లు... ఈ ఘట్టాలన్నీ గల్లా అరుణ కుమారి కథన శైలి వల్ల ఒక నవలలా సాగిపోతాయి. పీయూసీ చదువుకే పరిమితమైన అరుణ.. అమెరికాలో భర్త ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. కంప్యూటర్స్ విద్యను అభ్యసించి, క్రిస్లర్ కార్ల కంపెనీలో 9 ఏళ్లకు పైగా ఉద్యోగం చేయడం, జర్మన్, రష్యన్ భాషలు కూడా నేర్చుకోవడం ఆమెలోని పట్టుదలకు నిదర్శనం. ఇండియాలో పెట్టే పరిశ్రమ కోసం వచ్చిన అరుణకుమారి యాదృచ్ఛికంగా రాజకీయాల్లో ప్రవేశించారు. సుఖవంతమైన అమెరికా జీవితాన్ని కాదనుకుని, సొంత నేల మీద పరిశ్రమ పెట్టి, వేలాది మందికి ఉపాధి కల్పించినా ఆ కుటుంబం రాజకీయ కారణాలవల్ల ఒడుదొడుకులను ఎదుర్కోక తప్పలేదు. ఇరవై ఏళ్ళ ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు మంత్రిగా ఉన్నా ఆమెకు, రాజకీయాల్లోకి వచ్చిన ఆమె కుమారుడు జయదేవ్‌కు నిరంతర పోరాటం అనివార్యమయింది. వీటన్నిటినీ గల్లా అరుణకుమారి తన స్వీయచరిత్రలో నమోదు చేశారు. ఇది రాజకీయాలకు వీడ్కోలు చెప్పి, తను పుట్టిన దిగువమాఘం పల్లెలో కట్టుకున్న కొత్త ఇంట్లో భర్త రామచంద్రనాయుడితో విశ్రాంత జీవితం గడుపుతున్న గల్లా అరుణకుమారి కథ మాత్రమే కాదు, ఆత్మలేని రాజకీయాల తీరును జనం కళ్ల ముందు నిలబెట్టిన కథ.

ముఖ్యంగా రోజాను పార్టీలో చేర్చుకొనేటప్పుడు మీరు చాలా కఠినంగా వ్యవహరించారు కదా...

నా మనసుకు ఏమనిపించిందో అదే మాట్లాడాను. అలాగే వ్యవహరించాను.

రోజా విషయంలో మిమ్మల్ని ఆయన కన్విన్స్ చేసినట్టున్నారు కదా?

(నవ్వుతూ) కన్విన్స్ చేశానని ఆయన అనుకున్నారు.

'చంద్రబాబు టీడీపీలోకి వెళ్లిపోయినా నాన్న తప్పుపట్టలేదు. కానీ మీ నాన్న గారు ఆసుపత్రిలో ఉంటే పలకరించలేదు' అని రాశారు. మీకు కోపం రాలేదా? పైగా ఆ తర్వాత చంద్రబాబుకు రాజకీయంగా మీరు సన్నిహితులయ్యారు కూడా...

మేము అమెరికాలో ఉన్నపుడు నాన్న ఉత్తరాల్లో చంద్రబాబు గురించి రాసేవారు. "ఈసారి నువ్వు ఇండియాకి వచ్చేప్పటికి నీకో తమ్ముడుంటాడు ఇక్కడ" అని. చంద్రబాబుతోనూ "అమెరికాలో నీకో అక్క ఉంది" అని చెప్పేవారట. చంద్రబాబే నాతో ఆ విషయం చెప్పారు. అలా ఆయన పట్ల సోదర భావం నాలో పెరుగుతూ వచ్చింది. రోశయ్యగారితో సహా మావాళ్లు ఆయనకు వ్యతిరేకంగా అసెంబ్లీలో మాట్లాడాలని ఒత్తిడి చేసినా... "నాకు తెలియని విషయాల గురించి నేను మాట్లాడను" అని తిరస్కరించాను. అయితే చంద్రబాబునూ వ్యతిరేకించాల్సినపుడు గట్టిగానే వ్యతిరేకించాను.

మూడు తరాల రాజకీయాలు చూశారు. మీకేమనిపిస్తోంది?

భవిష్యత్తును తలచుకుంటేనే భయం వేస్తోంది.

రాజకీయాల్లో వివాదాల పుట్టను కదిలిస్తున్నారేమో?

నేను ఫేస్ చేయగలను.

కొన్ని అంశాలు కొందరు నాయకుల్ని బాధపెడతాయేమో?

నేను చేయగలిగిందేమీ లేదు. ఎవరినైనా బాధపెట్టడానికో, కించపరచడానికో నేనిది రాయలేదు. జరిగిన సంఘటనలను యథాతథంగా వివరించాను.

సెల్ఫ్ ఎడిటింగ్ చేసుకోవాలనిపించలేదా?

అలాంటప్పుడు రాయడం ఎందుకు?

• ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు

నవ్య | చిత్రజ్యోతి

పెళ్లి చేసుకున్న అమీ జాక్సన్



హీరోయిన్ అమీ జాక్సన్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. హాలీవుడ్ నటుడు ఎడ్ వెస్ట్‌విక్‌తో ఏడడుగులు వేశారు. వీరి వివాహం ఇటలీలో ఘనంగా జరిగింది. పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలను వారు ఆదివారం ఇన్‌గ్రామ్‌లో పోస్ట్ చేసి.. "ప్రయాణం ఇప్పుడే మొదలైంది" అని పేర్కొన్నారు. కాగా, అమీ జాక్సన్ గతంలో ఇంగ్లాండ్‌కు చెందిన జార్జ్ అనే వ్యక్తితో కొంతకాలం లివింగ్ రిలేషన్‌లో ఉండి.. ఓ బిడ్డను కూడా కన్నారు. 2022లో వారు విడిపోయారు.

మ్యూజిక్ లవర్స్‌ని అలరించేలా...



సంబీత్ ఆచార్య, జో శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ఎమ్4ఎమ్'. మోహన్ వడ్లపట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. తాజాగా, ఈ సినిమాలోని మ్యూజిక్‌పై ఓ స్పెషల్ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మోహన్ మాట్లాడుతూ "ఈ సినిమా మ్యూజిక్ లవర్స్‌ని అలరిస్తుంది. అందరికీ నచ్చే అంశాలు పుష్కలంగా సినిమాలో ఉన్నాయి" అని చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు



తెలుగు చిత్ర పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు కానుమిల్లి విజయం సాధించారు. సినీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా ఉంటానని ఆయన తెలిపారు.


ప్రేమంటే త్యాగం




సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండే నటీమణుల్లో సమంత ఒకరు. తాజాగా, ఆమె ప్రేమ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "చాలా మంది ప్రేమ.. స్నేహం అంటే ఇచ్చిపుచ్చుకోవడం అనుకుంటారు. ఈ విషయాన్ని నేనూ అంగీకరిస్తాను. కానీ నిజమైన ప్రేమంటే.. కొన్నిసార్లు అవతలి వ్యక్తి మనకు ప్రేమనివ్వలేని స్థితిలో ఉన్నా.. మనం ప్రేమనందించాలి అని నేర్చుకున్నాను" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. "ప్రేమంటే త్యాగం కూడా. పరిస్థితులకనుగుణంగా అది మారిపోతుండొచ్చు. నేను తిరిగి ప్రేమనందించలేకపోయినా.. నన్ను నిరంతరం ప్రేమించే అభిమానులకు రుణపడి ఉంటాను" అని అదే పోస్ట్‌లో పేర్కొన్నారు. సమంత నటించిన 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ' త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. అలాగే ఆమె నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం సెట్స్‌పై ఉంది.

పదవులకి రాజీనామా చేసిన సిద్ధిఖీ.. రంజిత్







మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ వెలువడినప్పటినుంచి.. పలు దర్శక, నిర్మాతలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న దర్శక నిర్మాతలు తమ పదవులకి రాజీనామా చేశారు. మలయాళ నటుడు, నిర్మాత, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి సిద్ధిఖీ లైంగికంగా వేధించారని నటి రేవతి సంపత్ ఆరోపించిన నేపథ్యంలో.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. మరోవైపు, మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. ఇటీవలే బెంగాలి నటి శ్రీలేఖ మిత్ర.. తనతో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వస్తున్న ఆరోపణలను చట్టపరంగా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

సిట్ ఏర్పాటు


మలయాళ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులపై వరుస ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ విషయాలపై విచారణ చేయడానికి ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. దీనిపై విచారణ జరిపి వీలైనంత తొందరలో నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

సుబ్బమ్మ సందేశం



చక్కని సందేశంతో పాటు ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందుతున్న చిత్రం 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ'. కిరణ్ దర్శకత్వంలో మంద మల్లికార్జున్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం చిత్రీకరణ ప్రారంభమైంది. తొలి షాట్‌కు మల్లికార్జున రెడ్డి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఈ చిత్రం ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. శ్యామ్ సెల్వన్, హన్విక హీరో హీరోయిన్లు. సంగీతం: చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: గాజుల శివ.

పొల్లాచ్చిలో ప్రేమ గీతం



వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ కొత్త షెడ్యూల్ ప్రస్తుతం పొల్లాచ్చిలో జరుగుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా ఐశ్వర్యారాజేశ్ నటిస్తున్నారు. భార్యభర్తల అనుబంధం నేపథ్యంలో సాగే పాటను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. మీనాక్షి చౌదరి కీలకపాత్ర పోషిస్తున్నారు. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సెప్టెంబర్‌లో చిన్న కథ



రానా దగ్గుబాటి సమర్పణలో ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 6న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి తెలిపారు. నందకిశోర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నివేదా థామస్ కథానాయిక.

సారంగపాణి జాతకం

ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. జాతకాల నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'సారంగపాణి జాతకం' అనే టైటిల్‌ను ఖాయం చేసి, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. జంధ్యాల గారి తరహా వినోదాన్ని పంచే చిత్రమిదని నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ అన్నారు. కుటుంబంతో హాయిగా చూడగలిగే హాస్య సంబరం ఈ సినిమా అని మోహనకృష్ణ చెప్పారు. ఈ చిత్రంలో రూప కొడువాయూర్ కథానాయిక. సంగీతం: వివేక్ సాగర్.

నాన్‌స్టాప్‌గా నవ్వించే చిత్రం



చిమటా రమేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'నేను కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. సినిమా ఈ నెల 30న విడుదలవుతున్న సందర్భంగా హీరో రమేశ్, హీరోయిన్ మేఘన మీడియాతో ముచ్చటించారు. "ఇదో విభిన్న తరహా చిత్రం. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరినీ నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది" అని హీరో రమేశ్ అన్నారు. "ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని హీరోయిన్ మేఘన చెప్పారు.

వేట మొదలైంది



తేజస్ వీరమాచినేని, అక్షయ రోమి జంటగా, బన్నీ అశ్వంత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి 'రాజా మార్కండేయ' అనే టైటిల్ ఖరారైంది. 'వేట మొదలైంది' అనేది ట్యాగ్‌లైన్. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొని, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. చిత్రీకరణ చివరి దశలో ఉందని నిర్మాతలు శ్రీధర్ సామా, వెంకట్ గౌడ్ పంజా తెలిపారు.

మరిన్ని 'టెక్' కొనుగోళ్లకు సిద్ధం

కొన్ని కంపెనీలతో చర్చలు షురూ
ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మరిన్ని కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. ఈ కొనుగోళ్ల డేటా అనలిటిక్స్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) వంటి రంగాలకు సంబంధించినవని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ చెప్పారు. ఇలాంటి కంపెనీలు అమెరికా, యూరప్ దేశాల్లో ఉన్నా కొనుగోళ్లకు వెనుకాడేది లేదన్నారు. ఇందుకోసం ఒక్కో కంపెనీ కొనుగోలుకు గతంలోలానే 45 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. ఇన్ఫోసిస్ ఈ ఏడాది జనవరిలో మన దేశానికే చెందిన ఇన్‌సెమీ టెక్నాలజీ సర్వీసెస్ అనే సెమీకండక్టర్ డిజైన్ సర్వీసెస్ కంపెనీని రూ.280 కోట్లకు కొనుగోలు చేసింది. మళ్లీ ఏప్రిల్‌లో జర్మనీకి చెందిన ఇన్‌టెక్ హోల్డింగ్ అనే ఇంజనీరింగ్ ఆర్ అండ్ డీ సర్వీసెస్ కంపెనీని 45 కోట్ల డాలర్లకు (సుమారు రూ.4,045 కోట్లు) కొనుగోలు చేసింది. తమ వ్యాపార ప్రయోజనాలకు దోహదం చేసే కొన్ని కంపెనీలను ఇప్పటికే గుర్తించి, చర్చలు కూడా జరుపుతున్నట్టు పరేఖ్ తెలిపారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చేందుకు ఎంత కాలం పడుతుందనే విషయాన్ని మాత్రం తాను చెప్పలేనన్నారు.

'ఏఐ'తో కొలువులకు ధోకా లేదు

జెనరేటివ్ ఏఐ వంటి కొత్త టెక్నాలజీల కారణంగా ఉద్యోగాలు పోతాయన్న భయాల్ని సలీల్ పరేఖ్ కొట్టివేశారు. తమ కంపెనీలో అలాంటి పరిస్థితి వస్తుందని కూడా తాను అనుకోవడం లేదన్నారు. తమ క్లయింట్లలో అనేక మంది ఇప్పటికే ఈ సరికొత్త టెక్నాలజీలపై ఆసక్తి చూపిస్తున్నట్టు తెలిపారు. ఐటీ రంగంలో ముందు ముందు ఈ టెక్నాలజీల వినియోగం మరింత పెరుగుతుందని పరేఖ్ తెలిపారు

యూజియా ఫార్మాపై ఎఫ్‌డీఏ కొరడా

హైదరాబాద్: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా ఫార్మా స్పెషాలిటీస్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ సమీపంలోని పటాన్‌చెరు ప్రాంతంలోని యూజియా ప్లాంటులో ఎఫ్‌డీఏ అధికారులు ఈ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఔషధాల ఉత్పత్తి, తయారీ ప్రక్రియకు సంబంధించిన వివరాలు (డేటా) సక్రమంగా నమోదు చేయడం లేవని గుర్తించారు. ఈ లోపాలను ఎలా సరిదిద్దుతారో 15 రోజుల్లో తెలియజేయాలని ఎఫ్‌డీఏ కోరింది. లేకపోతే ఈ ప్లాంటులో ఉత్పత్తి చేసే ఔషధాలపై వేటు తప్పదని హెచ్చరించింది. కంపెనీ మాత్రం ఈ లేఖ ప్రభావం ప్రస్తుత ఉత్పత్తులపై ఏ మాత్రం ఉండదని తెలిపింది.

సెబీ ఉత్తర్వులపై కోర్టుకు అనిల్ అంబానీ?



న్యూఢిల్లీ: రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీ ఇప్పట్లో దారికొచ్చేలా కనిపించడం లేదు. సెబీ తనపై రూ.25 కోట్ల జరిమానా విధించడం, ఐదేళ్ల పాటు క్యాపిటల్ మార్కెట్లో పాల్గొనకుండా వేటు వేయడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ విషయాన్ని న్యాయస్థానాల్లో సవాల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్టు అనిల్ అంబానీ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఫిబ్రవరి 11న సెబీ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా అనిల్ అంబానీ.. రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ ఛైర్మన్‌గా తప్పుకోవడమే గాక, ఫండ్స్‌ను దారిమళ్లించారని చెబుతున్న రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కంపెనీకీ దూరంగా ఉన్న విషయాన్నీ ఆ ప్రకటనలో గుర్తు చేశారు. 'ఈ నెల 22న సెబీ జారీ చేసిన తుది ఉత్తర్వులను అనిల్ అంబానీ పూర్తిగా సమీక్షిస్తున్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత దీనిపై అవసరమైన చర్యలు తీసుకుంటారు' అని ఆ ప్రకటనలో తెలిపారు.

ఇండిగో బుకింగ్‌కు 'ఎంఎక్స్' ఆప్షన్

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఇండిగో తన విమాన సర్వీసుల్లో ప్రయాణానికి టికెట్ బుకింగ్ చేసుకునే వారికి లింగ తటస్థ ఆప్షన్ "ఎంఎక్స్" అందుబాటులోకి తెస్తోంది. దీని ప్రకారం ఇండిగోలో ప్రయాణానికి టికెట్ బుక్ చేసుకునే వారు బుకింగ్ సమయంలో మేల్, ఫిమేల్‌తో పాటు లింగ తటస్థ ఆప్షన్ ఎంఎక్స్ కూడా ఎంచుకోవచ్చు. ట్రాన్స్ జెండర్లుగా తమ గుర్తింపు వెల్లడించడానికి ఇష్టపడని వారు ఈ ఆప్షన్ ఎంచుకోవచ్చు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా ఇప్పటికే బుకింగ్‌లకు ఎంఎక్స్ ఆప్షన్ అందుబాటులో ఉంచాయి. ఇదిలా ఉండగా తాము మరింత ఎక్కువ మంది దివ్యాంగులను రిక్రూట్ చేసుకోవాలనుకుంటున్నామని గ్రూప్ మానవ వనరుల విభాగం చీఫ్ సుఖ్‌జిత్ ఎస్ పశ్రిచా చెప్పారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి తమ ఉద్యోగుల సంఖ్య 36,860 కాగా వారిలో 5,038 మంది పైలట్లు, 9,363 మంది క్యాబిన్ సిబ్బంది ఉన్నారు.

కాగా కస్టమర్ సర్వీస్ విభాగంలో 60 పైగా నగరాల్లో 240 మంది వరకు దివ్యాంగులు కూడా పని చేస్తున్నారని ఆయన తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దివ్యాంగుల సంఖ్య మూడు రెట్లు పెంచాలనుకుంటున్నట్టు సుఖ్‌జిత్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26 వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	104
కర్నూలు	109	నెల్లూరు	104
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

ఆర్‌క్యాప్ అప్పులపై రుణదాతల ఆందోళన

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) సమస్య ఇప్పట్లో తేలేలా లేదు. ఈ కంపెనీని టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చిన హిందూజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్‌ఎల్) ప్రయత్నాలపై రుణదాతల కమిటీ (సీఓసీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్‌క్యాప్ టేకోవర్ కోసం రిలయన్స్ సెక్యూరిటీస్ సంస్థ ఈక్విటీ మొత్తాన్ని హామీగా పెట్టి రూ.7,300 కోట్లు రుణాలుగా తీసుకోవటానికి అనుమతిస్తే, తమ రుణాలు వసూలు చేసుకోవడం అసాధ్యమని ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్‌కి సీఓసీ తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఐఐహెచ్‌ఎల్ తమ రుణాల చెల్లింపులో విఫలమైతే ఆ సంస్థ ఎస్క్రో ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని తాము స్వాధీనం చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరాయి.

కేజీ బేసిన్‌లో మరో బావి ప్రారంభం
ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: బంగాళాఖాతంలోని కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో మరో చమురు బావిని తెరిచినట్టు ప్రభుత్వ రంగంలోని చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) ప్రకటించింది. దీనివల్ల క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి పెంచుకోగలుగుతామని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో కేజీ బేసిన్‌లో ఉత్పత్తిని ప్రారంభించిన ఓఎన్‌జీసీ శనివారం కేజీ-డీడబ్ల్యూఎన్-98/2 క్లస్టర్-2 అసెట్‌లో ఐదో బావిని తెరిచి ఒక మైలురాయిని నమోదు చేసిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పంపిన సమాచారంలో తెలిపింది. అయితే ఈ కొత్త బావి ఎంత ఆయిల్ ఉత్పత్తి చేస్తున్నది వెల్లడించలేదు. రిలయన్స్‌కు చెందిన కేజీ-డీ6 బ్లాక్ పక్కనే ఈ బావులున్నాయి. ఒక్కో బ్లాక్‌లోని కొన్ని బావులను కలిపి తాము ఒక క్లస్టర్‌గా వర్గీకరించినట్టు ఓఎన్‌జీసీ తెలిపింది. వాస్తవానికి ఈ క్లస్టర్-2లో ఉత్పత్తి 2021 నవంబరులోనే ప్రారంభం కావలసి ఉండగా కరోనా మహమ్మారి కారణంగా జాప్యం అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఈ బ్లాక్‌లో మరిన్ని బావులను ఉత్పత్తికి తెరవాలని నిర్ణయించామని సంస్థ తెలిపింది.

లాభాల బాటలోనే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పొవెల్ వడ్డీ రేట్ల కోతకు సమయం ఆసన్నమైందని చెప్పటం సానుకూల సంకేతాలు వెలువరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పొవెల్ ప్రకటనను అనుసరించే అవకాశం ఉంది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు కూడా లాభాల్లో పయనించే వీలుంది. ఈ వారం నిఫ్టీకి 24,750 వద్ద మద్దతు స్థాయిలుండగా 24,900 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఐటీ, టెలికాం, హెల్త్‌కేర్ షేర్లలో బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

సన్ ఫార్మా: ఈ షేరు సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. స్వల్ప కన్సాలిడేషన్ తర్వాత జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 1.4 శాతం లాభంతో రూ.1,775 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,770/1,750 శ్రేణిలో ప్రవేశించి రూ.1,860/1,880 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,730 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారతి ఎయిర్‌టెల్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు కన్సాలిడేట్ అవుతోంది. ప్రధాన మద్దతు స్థాయి రూ.1,450 వద్ద ఈ షేరు మళ్లీ పుంజుకుంది. గత శుక్రవారం ఈ షేరు 1.4 శాతం లాభంతో రూ.1,506 వద్ద ముగిసింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,480/1,490 శ్రేణిలో ఎంటరై రూ.1,550/1,620 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహీంద్రా అండ్ మహీంద్రా: సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం దిద్దుబాటు జరుగుతోంది. షేరు కీలక మద్దతు స్థాయికి చేరింది. గత శుక్రవారం రూ.2,759 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.2,740 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,850/2,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంక్: చాలా కాలంగా అప్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. రూ.1,160 స్థాయిలో ప్రధాన మద్దతు లభించటంతో చివరి రెండు సెషన్లలో ఈ షేరు లాభాల్లో ముగిసింది. గత శుక్రవారం ఈ షేరు 1.04 శాతం లాభంతో రూ.1,203 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,190 శ్రేణిలో ప్రవేశించి రూ.1,250/1,290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,170 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: కొన్ని రోజులుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ షేరు రెండు వారాలుగా దూకుడును ప్రదర్శిస్తూ జీవిత కాల గరిష్ఠం వైపు సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.941 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.930/920 స్థాయిలో ప్రవేశించి రూ.990/1,040 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.890 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ
25,000 స్థాయిలో పరీక్ష



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఐదు ట్రేడింగ్ రోజుల్లోనూ అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ముందు వారంతో పోల్చితే 280 పాయింట్ల లాభంతో 24,820 వద్ద ముగిసింది. ప్రస్తుతానికి పాజిటివ్ ధోరణిలోనే ఉన్నప్పటికీ ఇటీవల సాధించిన టాప్, జీవితకాల గరిష్ఠ స్థాయి 25,000-25,100కి చేరువవుతున్నందు వల్ల అప్రమత్తంగా ఉండాలి. గతంలో ఈ స్థాయి నుంచే బలమైన రియాక్షన్ ఏర్పడింది. పైగా గత కొద్ది రోజుల్లో 1,000 పాయింట్ల మేరకు లాభపడినందువల్ల కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడడం తప్పనిసరి. ఇది కూడా అప్రమత్త సంకేతం. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 900 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 640 పాయింట్లు లాభపడినా రెండు సూచీలూ శుక్రవారం రియాక్షన్ ఏర్పడడం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతను సూచిస్తోంది. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో ర్యాలీ వల్ల మార్కెట్ మరింత పాజిటివ్ ధోరణిలోనే ట్రేడ్ కావచ్చు. ఈ కారణంగా 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: తదుపరి స్వల్పకాలిక దిశ తీసుకునే ముందు జీవితకాల గరిష్ఠ స్థాయిలు 25,000-25,100 వద్ద కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం 25,000 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,850 కన్నా దిగజారితే మరింత బలహీనత ఏర్పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 24,700, 24,500. అంత కన్నా దిగజారితే బలహీనపడే ఆస్కారం ఉంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 416 పాయింట్ల లాభంతో 50,930 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 51,400. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 51,000. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడవచ్చు.

పాటర్న్: మార్కెట్లో 'వీ' ఆకారంలో రికవరీ ఏర్పడినందు వల్ల ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,940, 25,000
మద్దతు	24,860, 24,800

బంగ్లా చారిత్రక విజయం

పది వికెట్లతో పాక్ చిత్తు

రావల్పిండి: స్వదేశంలో రాజకీయ అస్థిరత..దేశం యావత్తూ అల్లకల్లోలం..ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలంతా బిక్కుబిక్కుమంటున్న తరుణం..ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ జట్టు తొలి టెస్ట్‌లో చారిత్రక విజయం అందుకుంది..పటిష్ఠమైన ప్రత్యర్థిని ఏకంగా పది వికెట్లతో చిత్తు చేసింది..రెండు మ్యాచ్‌ల వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. బ్యాటర్ ముష్ఫికర్ అద్భుత శతకంతో స్ఫూర్తి పొందిన బంగ్లా బౌలర్లు..ముఖ్యంగా స్పిన్నర్లు మెహ్దీ హసన్ మిరాజ్, షకీబ్ అల్ హసన్ ప్రత్యర్థిని తిప్పేయడంతో పర్యాటక జట్టుకు అపురూప విజయం దక్కింది. ఓవర్‌నైట్ 23/1తో ఆదివారం, చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 146 పరుగులకే కుప్పకూలింది. కీపర్ రిజ్వాన్ (51), అబ్దుల్లా షఫిక్ (37) ఆదుకోకుంటే ఆతిథ్య జట్టు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఇక 30 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా ఏడు ఓవర్లలోనే బంగ్లాదేశ్ ఛేదించింది. ముష్ఫికర్ రహీమ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్ట్ ఈనెల 30 నుంచి ఇక్కడే జరగనుంది.

సంక్షిప్తస్కోర్లు: పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 448/6 డిక్లేర్డ్; **బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** 565; **పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్:** 146 (రిజ్వాన్ 51, అబ్దుల్లా 37, మెహ్దీ హసన్ మిరాజ్ 4/21, షకీబ్ 3/44); **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** 30/0 (జాకీర్ హసన్ 15 నాటౌట్, షాద్‌మన్ 9 నాటౌట్).



మెహ్దీ హసన్



షకీబ్ @ 707

షకీబ్ అల్ హసన్ వ్యక్తిగతంగా ఓ మైలురాయిని చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన లెఫ్టామ్ స్పిన్నర్‌గా రికార్డు పుటలకెక్కాడు. షకీబ్ ఈ మ్యాచ్‌లో మొత్తం నాలుగు వికెట్లు తీశాడు. ఇక మూడు ఫార్మాట్లలో కలిసి మొత్తం 444 మ్యాచ్‌లాడిన షకీబ్ 707 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈక్రమంలో న్యూజిలాండ్ స్పిన్నర్ డేనియల్ వెటోరీ (442 మ్యాచ్‌ల్లో 705 వికెట్లు) రికార్డును బద్దలుగొట్టాడు. ఇటీవలే ప్రధానిగా పదవీచ్యుతురాలైన షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ నుంచి గతంలో బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యాడు. బంగ్లాదేశ్‌లో తాజా పరిస్థితుల నేపథ్యంలో హసీనాతోపాటు షకీబ్‌పైనా హత్య కేసు నమోదైంది.

1 పాకిస్థాన్‌పై 14 టెస్ట్‌ల్లో బంగ్లాకిది తొలి గెలుపు

5 స్వదేశంలో పాకిస్థాన్‌కు వరుసగా ఐదో టెస్ట్ ఓటమి

7 విదేశాల్లో బంగ్లాదేశ్ సాధించిన టెస్ట్ విజయాలు

భారత వీసా తిరస్కరణ.. పాక్ ఫిర్యాదు

కరాచీ: పాకిస్థాన్ బిలియర్డ్స్ ఆటగాళ్లకు వీసాలు మంజూరు కాకపోవడంతో వారు భారత్‌లో ఆడాల్సిన టోర్నీకి దూరమయ్యారు. శనివారం బెంగళూరులో ఐబీఎస్ఎఫ్ అండర్-18, అండర్-21 వరల్డ్ చాంపియన్‌షిప్స్ ఆరంభమయ్యాయి. ఈ టోర్నీ కోసం ముగ్గురు పాక్ ప్లేయర్ల వీసా దరఖాస్తును భారత హైకమిషన్ తిరస్కరించింది. దీంతో పాక్ బిలియర్డ్స్, స్నూకర్ సంఘం.. వరల్డ్ బాడీ ఐబీఎస్ఎఫ్‌తోపాటు నిర్వాహకులైన భారత బిలియర్డ్స్, స్నూకర్ సంఘానికి ఫిర్యాదు చేసింది.



అవనీ లేఖార

పారా హుషార్

మరో రెండు రోజుల్లో పారాలింపిక్స్

25 పతకాలు లక్ష్యంగా భారత్

రెండు వారాల కిందట ప్రపంచ అతి పెద్ద క్రీడా సంబరం ఒలింపిక్స్‌కు తెరపడింది. మరో క్రీడా సంరంభానికి ఇంకో రెండు రోజుల్లో తెరలేవనుంది. దాంతో పది రోజులకుపైగా పారిస్ నగరంలో సందడే.. సందడి..17వ పారాలింపిక్స్ ఈనెల 28 నుంచి వచ్చేనెల ఎనిమిది వరకు ప్రపంచ క్రీడా ప్రేమికులను అలరించనున్నాయి. ఇక ఈ విశ్వ క్రీడల్లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు 12 క్రీడాంశాల బరిలో దిగుతున్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో ఏకంగా 19 పతకాలు సొంతం చేసుకోవడంతో భారత అథ్లెట్ల ఆత్మవిశ్వాసం రెండింతలైంది. అంతకు ముందు లండన్ (2012) గేమ్స్‌లో ఒకే ఒక పతకంతో సరిపెట్టుకున్న మనోళ్లు.. రియో (2016)లో మరింత మెరుగైన ప్రదర్శనతో నాలుగు పతకాలు గెలిచారు. టోక్యోలో అవి దాదాపు అయిదింతలకు చేరడం భారత అథ్లెట్ల అద్భుత ప్రతిభకు అద్దం పట్టింది. ఈనేపథ్యంలో క్రీడాకారులంతా స్థాయికి తగ్గట్టుగా రాణిస్తే పారిస్‌లో 25 పతకాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. 1968లో భారత్ తొలిసారి పారాలింపిక్స్‌లో తలపడింది. అప్పటినుంచి 2016 క్రీడల వరకు మన అథ్లెట్లు సాధించిన మొత్తం పతకాల సంఖ్య 12 కావడం గమనార్హం. రియో క్రీడల్లో కేవలం 19 మంది అథ్లెట్లే పాల్గొన్నారు. టోక్యో పారాలింపిక్స్‌కొచ్చేసరికి అథ్లెట్ల సంఖ్య 54కి చేరింది. పారిస్‌లో సంఖ్యాపరంగా రికార్డు స్థాయిలో మనోళ్లు పోటీపడుతున్నారు. ఈసారి భారీ బృందంతో బరిలో దిగడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. పారా విశ్వక్రీడలను సీరియస్‌గా తీసుకోవడం అందులో మొదటిది. పారా అథ్లెట్లతో శక్తిసామర్థ్యాలను గుర్తెరగడం రెండోది.

స్ఫూర్తి నింపుతున్న ఆ అథ్లెట్లు..

పారిస్‌లోనూ వరల్డ్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకం కొల్లగొట్టాలని జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ లక్ష్యంగా నిర్దేశించుకున్నాడు. నీరజ్ చోప్రా స్ఫూర్తిగా తాను పారిస్‌లో 80మీ. ధ్యేయంగా పెట్టుకున్నట్టు సుమిత్ చెప్పాడు. ఇక, షూటింగ్‌లో అవనీ లేఖార, మనీష్ నర్వాల్ హాట్ ఫేవరెట్లుగా పోటీపడుతున్నారు. టోక్యోలో రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన అవని ఈసారి టైటిల్ నిలబెట్టుకోగలనన్న ధీమాతో బరిలోకి దిగుతోంది. మరోవైపు టేబుల్ టెన్నిస్‌లో భవినా పటేల్‌పై అంచనాలున్నాయి.

'టాప్స్', కార్పొరేట్ స్పాన్సర్‌షిప్

ప్రధాన అథ్లెట్లతోపాటు టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం (టాప్స్)లో చోటు కల్పించడం పారా అథ్లెట్లకు మరింత కలిసొచ్చింది. అలాగే కార్పొరేట్ సంస్థలు కూడా వారిని స్పాన్సర్ చేసేందుకు ముందుకొస్తున్నాయి. దాంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా పారా అథ్లెట్లు శిక్షణ కొనసాగించడంతో పాటు అంతర్జాతీయ టోర్నీలలో పాల్గొనగలుగుతున్నారు. జావెలిన్ త్రోయర్ దేవేంద్ర ఝఝూరియా 2004లో ఏథెన్స్ విశ్వక్రీడల్లో స్వర్ణ పతకం గెలవడం దేశ పారా అథ్లెటిక్స్‌లో అనూహ్య మార్పులకు నాంది పలికింది. భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ)కి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. అప్పటి వరకు శిక్షణ, సదుపాయాల కొరత ఎదుర్కొన్న పారా అథ్లెట్లు..పీసీఐకి గుర్తింపు ఇచ్చాక ఆ కష్టాలకు తెరపడ్డాయి. 2019-21 మధ్య పారా క్రీడల సౌకర్యాలకు కేంద్రం రూ. 8.2 కోట్లు ఖర్చు పెట్టింది. పారా అథ్లెట్లు 'టాప్స్'తో ఎంతో లబ్ధి పొందారు. సుమిత్ అంటిల్ కృత్రిమ కాలుకోసం రూ. ఏడు లక్షలు వెచ్చించడంతోపాటు నీరజ్ చోప్రాతో కలిసి ప్రాక్టీస్ చేసే అవకాశం కల్పించింది. ట్యునీసియా, ఫిన్లాండ్‌లలో అంటిల్ శిక్షణ పొందాడు. ప్రస్తుతం దేశంలో పారా క్రీడలకు పెరిగిన ప్రాధాన్యం రీత్యా చూస్తే పారిస్‌లో మన పతకాల సంఖ్య ఊహించని స్థాయిలో పెరిగే అవకాశాలు లేకపోలేదు. పారిస్‌లో 25కిపైగా పతకాలు లభించే చాన్సుందని పీసీఐ చీఫ్ దేవేంద్ర ఝఝూరియా అంచనా వేస్తున్నాడు.



పారిస్ పయనమైన బ్యాడ్మింటన్, జూడో, తైక్వాండో క్రీడాకారులు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)





స్వియటెక్

జొకోవిచ్ 25 కొడతాడా?

సిన్నర్, అల్కారజ్ నుంచి గట్టిపోటీ
మహిళల ఫేవరెట్‌గా సబలెంక, స్వియటెక్
నేటి నుంచే యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఒలింపిక్స్ పసిడి కలను నెరవేర్చుకొన్న వరల్డ్ నెం:2 నొవాక్ జొకోవిచ్.. మరో అరుదైన రికార్డుపై గురిపెట్టాడు. సోమవారం నుంచి జరిగే సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంప్ జొకో మరోసారి టైటిల్ నిలబెట్టుకోవాలనుకొంటున్నాడు. ఫ్లషింగ్ మెడోస్‌లో నొవాక్ విజేతగా నిలిస్తే ఓపెన్ ఎరాలో అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్‌లతో చరిత్ర సృష్టించడమే కాకుండా.. రోజర్ ఫెడరర్ (2004 నుంచి 2008) తర్వాత వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ నెగ్గిన ఘనతను సొంతం చేసుకోనున్నాడు. ఈ క్రమంలో కెరీర్‌లో 99 మేజర్ టైటిల్స్ నెగ్గిన జొకోకు 'సెంచరీ' కూడా పూర్తవుతుంది. ప్రస్తుతం 24 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన మార్గరెట్ కోర్ట్‌తో అతడు సమంగా ఉన్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో అల్కారజ్‌నే ఓడించి స్వర్ణం సొంతం చేసుకొన్న నొవాక్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనున్నాడు. తొలి రౌండ్‌లో రదు అల్బాట్ (మల్డోవా)తో జొకో తలపడనున్నాడు. అయితే, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సిన్నర్, ఈ సీజన్‌లో రెండు గ్రాండ్‌స్లామ్‌ల విజేత అల్కారజ్, అలెగ్జాండర్ జ్వెరెవ్, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ కూడా సత్తాచాటాలనుకొంటున్నారు. మహిళల సింగిల్స్‌లో బెలారస్ భామ అర్యానా సబలెంక ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డిఫెండింగ్ చాంప్ కోకో గాఫ్ (అమెరికా) పేలవ ఫామ్‌లో కొనసాగుతుండడంతో.. టాప్ సీడ్ ఇగా స్వియటెక్ (పోలెండ్), సబలెంక మధ్య ఫైనల్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలెనా రిబకినా (కజకిస్థాన్), జాస్మిన్ పాలెనీ (ఇటలీ) కూడా టైటిల్ రేసులో ఉన్నారు.

స్పోర్ట్స్

తన్విదే ఆసియా కిరీటం



న్యూఢిల్లీ: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ తన్వి పత్రి అండర్-15 బాలికల చాంపియన్‌గా నిలిచింది. చైనాలోని చెంగ్డూలో ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ తన్వి 22-20, 21-11తో రెండోసీడ్ థి తూ హుయెన్ గుయెన్ (వియత్నాం)ను ఓడించి స్వర్ణం అందుకుంది. సామియా, తస్నిమ్ తర్వాత ఆసియా జూనియర్ అండర్-15 టైటిల్ నెగ్గిన భారత షట్లర్‌గా 13 ఏళ్ల తన్వి రికార్డుకెక్కింది.



హార్దిక్ నటాషా

అందుకే విడిపోయారా?

న్యూఢిల్లీ: భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. భార్య నటాషా స్టాన్కోవిచ్‌తో విడిపోయిన సంగతి తెలిసిందే. అయితే వీరిద్దరూ ఎందుకు విడిపోయారన్న విషయం అభిమానులను అంతుపట్టడంలేదు. పాండ్యా తీరు కారణంగానే నటాషా కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని.. వారి గురించి తెలిసిన వారంటున్నారు. 'నటాషా అతడితో సర్దుకుపోవాలని చూసినా ఆమె వల్ల కాలేదు. క్రమంగా ఇద్దరి మధ్య అగాథం ఏర్పడింది. నేనింతే అన్నట్టుగా పాండ్యా వ్యవహరించడంతో.. నటాషా కూడా చేసేదేమీ లేకపోయింది. ఇదేమీ క్షణికావేశంలో తీసుకొన్న నిర్ణయం కాద'ని వారు చెప్పారు. వీరిద్దరి వివాహం 2020లో జరిగింది. విడాకుల తర్వాత కొడుకుని తీసుకుని నటాషా ఆమె పుట్టిల్లు సెర్బియా వెళ్లిపోయింది. ఇక హార్దిక్ ప్రస్తుతం బ్రిటన్ సింగర్ జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేస్తున్నాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

బ్లాక్‌బర్డ్స్‌కు రెండోస్థానం

చెన్నై: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో తొలిరోజు నిరాశపరిచిన హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ జట్టు రెండోరోజు సత్తా చాటింది. ఆదివారం జరిగిన తొలిరౌండ్ రెండో రేసులో బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ రవీంద్ర రెండోస్థానంతో రన్నరప్‌గా నిలిచాడు. బెంగాల్ టైగర్స్ డ్రైవర్ అలిస్టర్ యాంగ్ ప్రథమస్థానంతో రేసు ముగించి విజేతగా నిలిచాడు.

3000 మీ. రేసులో జాకబ్ ప్రపంచ రికార్డు



సిలీసియా (పోలెండ్): నార్వే రన్నర్ జాకబ్ ఇంజ్‌బ్రిగ్‌సెన్ 3000 మీ. రేసులో ప్రపంచరికార్డు నెలకొల్పాడు. ఆదివారం జరిగిన సిలీసియా డైమండ్ లీగ్‌లో జాకబ్ 7 నిమిషాల 17.55 సెకన్ల రికార్డు టైమింగ్‌తో రేసును ముగించాడు. ఈ క్రమంలో 28 ఏళ్ల క్రితం డేనియల్ కోమెన్ (కెన్యా) నెలకొల్పిన 7 నిమిషాల 20.67 సెకన్ల రికార్డును 3 సెకన్ల తేడాతో సవరించాడు.

చెరువుల్లో శ్రీమంతుల ఫాంహౌస్‌లు



- భగవద్గీత స్ఫూర్తితోనే ఆక్రమణల కూల్చివేతలు
- శ్రీకృష్ణుడి యుద్ధనీతిని పాటిస్తున్నాం
- చర్యలు తీసుకోకుంటే మేం విఫలమైనట్టే!
- కక్షసాధింపులు లేవు: తెలంగాణ సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్రమ కట్టడాలను కూల్చివేతకు స్ఫూర్తి 'భగవద్గీత' అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ధర్మాన్ని రక్షించేందుకు 'గీత'లో శ్రీకృష్ణుడు బోధించిన యుద్ధనీతి స్ఫూర్తితోనే ప్రజల జీవన విధానంలో, సంస్కృతిలో భాగమైన చెరువులను సంరక్షించే మహాయజ్ఞానికి తమ ప్రభుత్వం నాంది పలికిందని చెప్పారు. "ప్రజా ప్రతినిధులు విధి నిర్వహణలో భాగంగా తెలియకుండా కొన్ని తప్పులు చేస్తుంటారు. వాటిని సవరించుకోడానికి తెలిసి కొన్ని మంచిపనులు కూడా చేయాలన్నది నా ప్రగాఢ విశ్వాసం. ఆ క్రమంలోనే చెరువులను కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేయాలన్న ఏకైక లక్ష్యంతో.. మా మీద ఎంత ఒత్తిడి వచ్చినా, ఎవరినీ వదలకుండా ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఆదివారం హరేకృష్ణ భక్తి ఉద్యమం ఆధ్వర్యంలో కోకాపేటలో చేపట్టిన హరేకృష్ణ హెరిటేజ్ టవర్స్ నిర్మాణ ప్రక్రియలోని అనంత శేష స్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "హైదరాబాద్‌ను వరదల నుంచి సంరక్షించడం కోసం ఆనాడు నిజాం ప్రభుత్వం.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి నిపుణుల సూచనలతో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను నిర్మించింది. మొన్నటికి మొన్న కృష్ణా, గోదావరి ఎండిపోయి, వేసవిలో తాగునీటి సమస్య వస్తే.. ఈ జలాశయాలే నగరవాసుల దాహార్తిని తీర్చాయి. అలాంటిది కొంతమంది శ్రీమంతులు, గొప్పవ్యక్తులుగా పేరొందిన వారు చెరువుల్లో ఫాంహౌస్‌లు నిర్మించుకొని, వాటి నుంచి పారే మురుగు కాల్వలను నగరానికి తాగునీరు సరఫరా చేసే జంట జలాశయాల్లో కలిపారు. సామాన్యుల తాగునీటి చెరువుల్లో మురుగు నీరు కలపడాన్ని చూస్తూ ఊరుకొంటే, అక్రమ నిర్మాణాలను అలానే వదిలేస్తే ఇక నేను ప్రజా ప్రతినిధిగా విఫలమైనట్టా? కాదా?" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే తనపై ఎంత ఒత్తిడి వచ్చినా, మిత్రులకు ఫాంహౌస్‌లున్నా.. ఏవీ వదలకుండా హైడ్రా సంస్థను ఏర్పాటు చేశామని, చెరువుల్లో ఉన్న అక్రమ కట్టడాలను కూలగొడుతున్నామని వివరించారు. కాగా, చెరువులను ఆక్రమించిన వారిలో కొందరు ప్రభుత్వాన్ని, సమాజాన్ని అత్యంత ప్రభావితం చేయగలిగిన స్థానాల్లో ఉన్నారని, మరికొందరు ప్రత్యక్షంగా ప్రభుత్వంలో భాగస్వాములుగానూ ఉండవచ్చునని, అయినా వాటిని పట్టించుకోదలచుకోలేదని అన్నారు.

సెంటు కూడా ఆక్రమించలేదు: నాగార్జున



ఎన్ కన్వెన్షన్ సెంటర్‌పై వస్తున్న వార్తల్లో వాస్తవాల కంటే ఊహాగానాలే అధికంగా ఉన్నాయని సినీ నటుడు అక్కినేని నాగార్జున అన్నారు. తాము ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించిన భూమి పట్టా భూమి అని, ఒక్క సెంటు కూడా ఆక్రమించింది కాదని ఎక్స్‌లో ఆదివారం పోస్టు పెట్టారు. తమ్మిడికుంట చెరువు ఆక్రమణకు గురికాలేదని ఏపీ ల్యాండ్ గ్రాబింగ్(ప్రొహిబిషన్) యాక్ట్ ప్రత్యేక న్యాయస్థానం 2014లో తీర్పు ఇచ్చిందన్నారు. న్యాయస్థానం ఇచ్చే తీర్పుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. ఊహాగానాలు నమ్మవద్దని అభిమానులను కోరారు.

నాగార్జున హరిశ్చంద్రుడు కాదు: సీపీఐ నారాయణ



నాగార్జున ఏమీ సత్యహరిశ్చంద్రుడు కాదని, ఆయన ఎన్ కన్వెన్షన్ మీద భారీగా సంపాదించారని సీపీఐ నేత కె. నారాయణ అన్నారు. మాదాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేసిన ఎన్ కన్వెన్షన్ ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలు గజం స్థలం ఆక్రమిస్తేనే నానా రాద్ధాంతం చేసే అధికారులు, పాలకులు.. నాగార్జున ఏకంగా చెరువును ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ నిర్మిస్తే ఏళ్ల తరబడి చోద్యం చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెరువుల్లో కళాశాలలు కట్టారని.. వారంతా కబ్జాకోరులని ఆరోపించారు. పెద్దలు కబ్జాలు చేసినా, దొంగ పట్టాలు పొందినా వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

పేరు ఘనం.. సేవ గగనం

- ఇంతపెద్ద ఎయిమ్స్‌లో ఐసీయూ పడకల సంఖ్య 20 మాత్రమే. ఇందులో కూడా రెండు పనిచేయడం లేదు. మొత్తం 960 పడకలు ఉన్నట్టు ప్రచారం జరిగినా.. 500 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.
- కార్డియాలజీలో ఒకే ఒక డాక్టర్ ఉన్నారు. కేన్సర్ విభాగంలో సర్జికల్, మెడికల్ ఆంకాలజీలకు సంబంధించి ఒక్కొక్క వైద్యుడు మాత్రమే ఉన్నారు. కార్డియాలజీకి సంబంధించి ఒక్క శస్త్రచికిత్స కూడా జరగలేదు. కనీసం యాంజియోగ్రామ్ చేసేందుకు కూడా అనువైన వసతులు కల్పించలేదు.

(మొదటి పేజీ తరువాయి)

దృశ్యం. కానీ రోగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. చుట్టు పక్కల జిల్లాల నుంచి మంగళగిరి వచ్చిన రోగులకు.. అటు బైపాస్ నుంచి కానీ ఇటు బస్టాండ్ లేదా రైల్వేస్టేషన్ నుంచి కానీ ఎయిమ్స్ ప్రాంగణానికి చేరుకోవడం ఓ ప్రహసనంలా ఉంటుంది. తగిన రవాణా సదుపాయం లేదు. ఎలాగోలా వ్యయప్రయాసలు ఓర్చి ఎయిమ్స్ ఆస్పత్రికి చేరాక.. అక్కడి నుంచి అసలు కష్టాలు మొదలవుతాయి. ముందుగా టోకెన్ కోసం పరిగెత్తాలి. ఆ తర్వాత ఓపీ రిజిస్ట్రేషన్ కోసం పరిమితంగా ఉండే కౌంటర్ల వద్ద గంటల కొద్దీ క్యూలో ఉండాలి. అనంతరం సంబంధిత వైద్యుడి చాంబర్‌ను వెతుక్కుంటూ వెళ్లి అక్కడ ఉండే చాంతాడంత క్యూ లైన్లలో వేచివుండాలి. డాక్టర్ రాసిచ్చిన పరీక్షలు చేయించుకోవడానికి ఫీజు కట్టేందుకు మళ్లీ బిల్లింగ్ కౌంటర్ల వద్ద పడిగాపులు పడాలి. బిల్లింగ్ అయ్యాక మళ్లీ ల్యాబ్‌ల వద్ద రక్తనమూనాలను ఇచ్చేందుకు ఇంకోసారి కాళ్లకున్న శక్తిని పరీక్షించుకోవాలి. ఒకవేళ వైద్యుడు ఏ సీటీస్కానో లేదా ఎమ్మారై స్కానో రాశారంటే అంతే సంగతులు. టెక్నీషియన్లు ఇప్పుడు కుదరదంటూ నెలకో, నెలన్నరకో షెడ్యూల్ ఇస్తారు. అప్పుడొచ్చి ఆ స్కాన్ ఏదో చేయించుకుంటే మళ్లీ పది, పదిహేను రోజుల తరువాత కానీ రిపోర్టు ఇవ్వరు. మంగళగిరి ఎయిమ్స్‌లో రోగులు ఎదుర్కొంటున్న అవస్థలు ఇవీ!



మంగళగిరి ఎయిమ్స్‌లో ప్రారంభానికి నోచుకోని ఆయుష్ విభాగం బ్లాకు

ఆలస్యం ఎందుకంటే...

మంగళగిరి ఎయిమ్స్‌లో 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నుంచే వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో ఓపీడీ బ్లాకు, ఆయుష్ బ్లాకులను వినియోగించుకుని అవుట్ పేషెంట్లకు వైద్యసేవలు అందిస్తూ కార్యకలాపాలను కొనసాగించింది. ఆస్పత్రిలో అతి ప్రధానమైన ఇన్‌పేషెంట్ వార్డు తాలూకు భారీ బ్లాకును కూడా సన్నద్ధం చేసుకున్నాక ఈ ఏడాది ఫిబ్రవరి 25న అధికారికంగా ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆరంభించారు. 2019 ఆరంభకాలంలో ఓపీ రిజిస్ట్రేషన్స్ కౌంటర్లు ఎన్ని ఉన్నాయో ఇప్పటికీ అన్నే ఉన్నాయి. మొదట్లో మూడొందల నుంచి నాలుగొందల మంది వరకు రోగులు వచ్చేవారు. ఇపుడు రోజుకు మూడు వేలమంది వరకు ఓపీకి వస్తున్నారు. రోగుల సంఖ్యకు తగినట్టుగా రిజిస్ట్రేషన్స్ కౌంటర్లు కానీ, బిల్లింగ్ కౌంటర్లు కానీ, మందుల దుకాణంలో కౌంటర్లు కానీ పెంచలేదు. మొదట్నుంచీ ఎన్ని ఉన్నాయో ఇప్పటికీ అన్నే ఉన్నాయి. దీంతో ఎయిమ్స్ ఓపీడీ బ్లాకు అంతా రద్దీగా క్యూ లైన్లతో దర్శనమిస్తూ ఉంటుంది. ఇక సిటీస్కాన్, ఎమ్మారై స్కాన్‌లకు సంబంధించి రోజుకు నాలుగొందల వరకు కేసులు వస్తున్నాయి. కానీ టెక్నీషియన్లు, మిషన్ల కొరతతో రోజుకు 70 నుంచి 100 వరకు మాత్రమే తీయగలుగుతున్నారు. దీంతో అనివార్యంగా మిగిలినవన్నీ పెండింగ్ పడిపోయి ఒక్కో కేసు షెడ్యూల్ నెలలు దాటుతోంది. దీంతో రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రచారం ఫుల్ కానీ..!

2019 నుంచి దఫదఫాలుగా వివిధ విభాగాలకు చెందిన వైద్యులను రిక్రూట్ చేసుకుంటూ క్రమంగా వైద్యసేవలను విస్తరింపజేస్తూ వచ్చారు. మంగళగిరి ఎయిమ్స్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని నిర్వాహకులు చెబుతున్నప్పటికీ... ఆచరణలో మాత్రం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. డిమాండ్‌కు తగ్గ స్థాయిలో వైద్యులు లేరు. మౌలికసదుపాయాలు లేవు. అసలు ఇంతపెద్ద ఎయిమ్స్‌లో ఐసీయూ పడకల సంఖ్య 20 మాత్రమే ఉందంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఈ 20లో కూడా ప్రస్తుతం రెండు పనిచేయడం లేదు. అంటే.. 18 మాత్రమే వినియోగంలో ఉన్నాయన్నమాట! మరోవైపు ఎయిమ్స్‌లో ఎమర్జెన్సీ సేవలను కూడా 24/7గా అందించాలని నిర్ణయించారు. దీంతో రోడ్డు యాక్సిడెంట్ వంటి కేసులతో పాటు ఇతరత్రా ఐసీయూ బెడ్‌ల అవసరంతో కూడిన కేసులను సంబంధిత రోగుల బంధువులు ఎంతో ఆశగా ఎయిమ్స్‌కు తీసుకువస్తున్నారు. అయితే ఐసీయూ బెడ్‌ల కొరత కారణంగా వారికి ప్రాథమిక చికిత్సను అందించి ఇతర ఆసుపత్రులకు తీసుకెళ్లాలని పురమాయిస్తున్నారు. మొత్తం 960 పడకలతో కూడిన ఎయిమ్స్ ఆసుపత్రిగా ముమ్మర ప్రచారం జరిగినా ప్రస్తుతం 500 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ప్రధాన విభాగాలేవీ..?

మంగళగిరి ఎయిమ్స్‌లో ఇంకా ప్రధాన డిపార్టుమెంటులు ఏవీ ఆరంభం కాలేదు. పనిచేస్తున్న కొన్ని విభాగాల్లో అరకొర సేవలు మాత్రమే లభిస్తున్నాయి. ప్రస్తుత కాలంలో గుండె, కేన్సర్, కిడ్నీ, శ్వాసకోశ సంబంధిత కేసులు బాగా ఎక్కువయ్యాయి. అయితే అవసరమైనంత మంది వైద్యులు అందుబాటులో లేరు. మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలు ఆరంభానికే నోచుకోలేదు. ఎనస్థీషియా విభాగం కూడా సమర్థవంతంగా పనిచేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎనస్థీషియా విభాగంలో చెప్పుకోదగిన స్థాయిలో డాక్టర్లు ఉన్నప్పటికీ మరికొంత మంది కావాల్సిన అవసరం ఉందంటున్నారు. ఐసీయూలో ఎనస్థీషియన్‌ల కొరత బాగా ఉందంటున్నారు. పోస్ట్ ఆపరేషన్స్ రోగులను ఐసీయూలో పరిశీలించేందుకు తగినంతమంది ఎనస్థీషియన్‌లు లేరని చెబుతున్నారు.

అవుట్ సోర్సింగ్‌లో అంతా మాయ

మంగళగిరి ఎయిమ్స్‌లో సిబ్బంది చాలావరకు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నావారే! నియామకంలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎయిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ కింద సుమారు 600 మందికిపైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరినీ విజయవాడకు చెందిన ఓ వ్యక్తి తన ఏజెన్సీ కింద నియమించారు. మంగళగిరి ఎయిమ్స్ ఆవిర్భావం నుంచి కూడా ఈ ఏజెన్సీ యజమాని అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకంలో చక్రం తిప్పుతూ వచ్చారని అంటున్నారు. మొదట్లో 3 నెలల పాటు నామినేషన్ పద్ధతిపై సాగిన కాంట్రాక్టు ఎప్పటికప్పుడు పొడిగించుకుంటూ నాలుగేళ్లుగా కొనసాగడం గమనార్హం. సదరు ఏజెన్సీ యజమాని అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇవ్వాలంటే హౌస్ కీపింగ్‌కు రూ.లక్ష, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు రూ.మూడు లక్షల చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆయుష్ విభాగం ప్రారంభమెప్పుడో?

మంగళగిరి ఎయిమ్స్‌లో ఓపీడీ బ్లాకుతో పాటు అన్ని హంగులతో తయారైన భవనం ఆయుష్ బ్లాకు. 2019 నాటికే దాదాపు పూర్తిస్థాయిలో సిద్ధమైంది. కానీ ఇప్పటికీ ఇందులో ఆయుష్ విభాగాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రతీ ఎయిమ్స్‌లో ఆయుష్ విభాగాన్ని విధిగా నెలకొల్పి అందులో ఆయుర్వేదం లేదా హోమియోపతి లేదా యునాని, సిద్ధ, యోగా వంటి ప్రాచీన వైద్య విభాగాలను నెలకొల్పాలన్న విధానాన్ని కేంద్రప్రభుత్వం ఎయిమ్స్ చట్టాలలో తీసుకొచ్చింది. కానీ ఇక్కడ ఆయుష్ బ్లాకులో ఆ తరహా వైద్యవిభాగాలను ఏళ్ల తరబడి అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. హోమియోపతి విభాగాన్ని ఏర్పాటు చేస్తారని కొందరు, ఆయుర్వేద విభాగాన్ని నెలకొల్పుతారని మరి కొందరు అంటున్నారు.



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ అభిమానులు బహూకరించిన చలువ కళ్లద్దాలతో ఏపీ సీఎం చంద్రబాబు

మబ్బుల్ని ఛేదించే నాయకత్వం ఉండాలి

- తెలంగాణ టీడీపీ నేతలకు చంద్రబాబు పిలుపు
- పార్టీలో చేరికలకు ప్రోత్సాహం
- యువ నాయకత్వానికి ప్రాధాన్యం
- కమిటీల రద్దు .. త్వరలో అడ్‌హాక్ కమిటీలు
- చంద్రబాబుతో బాబూ మోహన్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): "మబ్బులు వస్తూ ఉంటాయి. కానీ వాటిని ఛేదించుకుని ముందుకు వెళ్లే నాయకత్వం ఉండాలి. పార్టీపై స్థానిక నాయకత్వం ప్రజల్లో నమ్మకం కలిగించాలి. విశ్వాసాన్ని పెంచుకోవాలి" అని టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో టీడీపీ నేతలతో అన్నారు. ఆదివారం, ఎన్టీఆర్‌భవన్‌లో ఆయన రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. రాష్ట్రంలో టీడీపీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు. నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని తిరిగి ఆహ్వానించాలని, వారితో పాటు కొత్తవారిని కూడా చేర్చుకోవాలని సూచించారు. పార్టీకి గుర్తింపు తీసుకువచ్చే నాయకత్వం అవశ్యకత ఉందని.. నాయకుల సీనియారిటీని, పార్టీపట్ల అంకితభావాన్ని గౌరవిస్తూనే.. పార్టీలోకి కొత్తగా వచ్చే నాయకులను ప్రోత్సహిస్తామని, యువతకు ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. ప్రతి 15 రోజులకూ ఒకసారి తాను రాష్ట్ర పార్టీ కార్యక్రమాలను సమీక్షిస్తానని తెలిపారు. తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణం తన లక్ష్యమని చంద్రబాబు చెప్పారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్ర స్థాయి నుంచి విస్తృత అభిప్రాయ సేకరణ చేపట్టి, రాష్ట్రస్థాయిలో సమీక్ష చేయాలని ముఖ్యనేతలకు సూచించారు. అలాగే.. పార్టీ రాష్ట్ర కమిటీని చంద్రబాబు రద్దుచేశారు. దీంతో పార్లమెంటు, మండల, గ్రామ కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలు కూడా రద్దయ్యాయి. సభ్యత్వ నమోదు కోసం రాష్ట్రస్థాయిలో, పార్లమెంటు నియోజకవర్గస్థాయిలో అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటుచేయనున్నారు. ఏపీ, తెలంగాణల్లో ఒకేసారి సభ్యత్వ నమోదు ప్రారంభం అవుతుందని చంద్రబాబు ప్రకటించారు. సభ్యత్వ నమోదు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఉంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదు చేస్తూనే పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాగా.. సినీ హాస్య నటుడు, మాజీ మంత్రి బాబూమోహన్.. ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. త్వరలో ఆయన టీడీపీలో చేరే అవకాశం ఉందని పార్టీ నేతలు తెలిపారు.

తప్పులు కప్పిపుచ్చే తనిఖీలు!

కమీషన్లు దండుకుంటున్న సోషల్ ఆడిట్ బృందాలు

- అవినీతిపరులతో బేరసారాలు.. బెదిరింపులు
- నాలుగు రకాల నిఘా వ్యవస్థలూ నిర్వీర్యం
- గత ఐదేళ్లుగా ఉపాధి హామీ పథకం తీరు
- పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాలని డిమాండ్లు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో నిఘా కొరవడింది. ఎన్ని తప్పులున్నా తనిఖీల్లో కప్పిపుచ్చుతూ సరిపెడుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వమే ఉపాధి సిబ్బందితో తప్పులు చేయించి, దానిని కప్పిపుచ్చుకునేందుకు నిఘా సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు నాలుగు రకాల నిఘా వ్యవస్థలను ఏర్పాటుచేసినా.. వాటి కళ్లకు గంతలు కట్టి యథేచ్ఛగా అక్రమాలకు గేట్లు ఎత్తేశారు. ఒకప్పుడు ఉపాధిలో సామాజిక తనిఖీ విభాగం(సోషల్ ఆడిట్) అంటే అక్రమాలకు పాల్పడే సిబ్బందికి సింహస్వప్నంగా ఉండేది. ప్రతి మండలంలో సోషల్ ఆడిట్ సిబ్బంది నెలరోజులు తిష్టవేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించేవారు. ప్రతి ఆర్నెల్లకు సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహిస్తున్నారంటే గ్రామాల్లోని ఉపాధి సిబ్బంది అప్రమత్తంగా ఉండేవారు. రికవరీలు రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. గత ఐదేళ్లలో వైసీపీ సర్కార్ ఆ పరిస్థితిని మార్చేసింది. సోషల్ ఆడిట్ సిబ్బందికి పర్సంటేజీలిస్తే చాలు.. వాళ్లే మేనేజ్ చేస్తారన్న భావనకు ఉపాధి సిబ్బంది వచ్చారు. చాలీచాలని సిబ్బందితో వచ్చి నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారు. కమిషనరేట్ నుంచి జిల్లా స్థాయి దాకా సోషల్ ఆడిట్ అధికారుల చేతులు కట్టేసి అవినీతికి గేట్లు ఎత్తేశారు. విజిలెన్స్ విభాగం కూడా అచేతనంగా మారిపోయింది. అంబుడ్స్‌మెన్‌గా సొంత పార్టీ వాళ్లనే ఎక్కువమందిని నియమించుకోవడంతో వారు అంతగా స్పందించకపోవడం, స్పందిస్తే ప్రభుత్వ పెద్దల ఆగ్రహాలకు గురి కావాల్సి వస్తుందని భయపడ్డారు. ఉన్న వ్యవస్థల్లో క్వాలిటీ కంట్రోల్ కొంత మెరుగ్గా వ్యవహరించింది. అయితే క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేసేది 10 శాతం పనులు మాత్రమే అయినందున అవినీతిపరుల ఆటలు కట్టించలేకపోయారు.

పనులు చేయకున్నా.. చేసినట్టు..

ఉపాధి పనుల్లో దొంగ మస్టర్లు వేయడం, క్షేత్రస్థాయిలో భౌతికంగా పనులు కనిపించకపోవడంతో రికవరీ రాస్తామని సోషల్ ఆడిట్ సిబ్బంది ఉపాధి సిబ్బందితో బేరాలకు దిగుతున్నారు. పనిచేసిన మొత్తం విలువలో 10 శాతం ముడుపులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి పనుల్లేకుండానే టార్గెట్లు పెట్టి మస్టర్లు రాయించడంతో ఇప్పుడు వాటిని మేనేజ్ చేసుకునేందుకు సోషల్ ఆడిట్ సిబ్బందికి పర్సంటేజీలిచ్చి ఉద్యోగాలు కాపాడుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఉపాధి సిబ్బంది వాపోతున్నారు. గ్రామాల్లో పనులు ఎటూ చేయలేదని, చేసినట్లు మేనేజ్ చేసేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చేదని చెబుతున్నారు. టార్గెట్లు పెట్టి మస్టర్లు రాయించిన అధికారులు ఇప్పుడు మొహం చాటేస్తున్నారంటున్నారు. దీంతో కొందరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగాలను కాపాడుకునేందుకు అప్పులు తెచ్చి తనిఖీ సిబ్బందికి ముట్టచెబుతున్నారు.

నిఘా ఏజెన్సీల తీరు మారాలి....

ఉపాధి హామీలో కీలకమైన నిఘా ఏజెన్సీలు ఇకనైనా ధోరణి మార్చుకోవాలి. ఈ నాలుగు రకాల వ్యవస్థలు జవాబుదారీగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. సోషల్ ఆడిట్ డైరెక్టర్ పదవీ కాలం ఇప్పటికే పూర్తి కావడంతో కొత్త డైరెక్టర్‌ను నియమించాల్సి ఉంది. ఈ లోపు పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజను ఇన్‌చార్జ్‌గా నియమించే అవకాశముంది. ఆయన సోషల్ ఆడిట్‌ను ప్రక్షాళన చేస్తారని అందరూ ఆశిస్తున్నారు. మిగతా నిఘా ఏజెన్సీల్లోనూ నిజాయితీ కలిగిన అధికారులను నింపి పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది.

గత ఐదేళ్లలో సోషల్ ఆడిట్ తీరు..

గత ఐదేళ్లలో అవినీతి జరిగిన మొత్తానికి, రికవరీ చేసిన మొత్తానికి భారీ వ్యత్యాసాలున్నాయి. తనిఖీలు నామమాత్రంగా జరిపి క్షేత్రస్థాయిలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు అధికారులే మేనేజ్ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. 2020-21 సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 5,683 గ్రామ పంచాయతీల్లో ఆడిట్ నిర్వహిస్తే రూ.139 కోట్లు దుర్వినియోగం అయ్యాయని సోషల్ ఆడిట్‌లో గుర్తించారు. అందులో రూ.63.33 కోట్లకు యాక్షన్ టేకన్ నివేదికలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే కేవలం రూ.2.25 కోట్లు(3.55 శాతం మాత్రమే) రికవరీ చేసి సరిపెట్టుకున్నారు. 1,379 మంది సిబ్బంది నుంచి రికవరీ చేశామని, 5,038 మంది ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్చరికలు చేశామని పేర్కొన్నారు. ఇక 2021-22 సంవత్సరంలో 5,956 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి, రూ.137.67 కోట్లు దుర్వినియోగమైనట్టు తేల్చారు. రూ.89.34 కోట్లకు యాక్షన్ టేకన్ రిపోర్టులను తయారుచేశారు. అందులో రూ.7.59 కోట్లు(8.50 శాతం మాత్రమే) రికవరీ చేయగలిగారు. అలాగే, 2022-23లో 13,070 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి రూ.80.64 కోట్లు తేడాలున్నట్లు గుర్తించారు. అందులో రూ.39 కోట్ల అవినీతి జరిగిందని నిర్ధారించి యాక్షన్ టేకన్ నివేదికలను తయారుచేశారు. అందులో రూ.5.35 కోట్లు(13.48 శాతం మాత్రమే) రికవరీ చేయగలిగారు. 2023-24లో 13,388 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి, రూ.56.12 కోట్ల తేడాలు ఉన్నట్లు తేల్చారు. అందులో రూ.10.64 కోట్లు అవినీతి జరిగిందని నిర్ధారించి యాక్షన్ టేకన్ నివేదికలను తయారుచేశారు. అందులో రూ.1.48 కోట్లు (13.98% మాత్రమే) రికవరీ చేయగలిగారు. ఇక 2024-25 సంవత్సరానికి ఇప్పటి వరకు 2,131 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించగా రూ.21.86 కోట్ల పనుల్లో తేడాలు గుర్తించి, రూ.6.36 కోట్లు అవినీతి జరిగిందని తేల్చారు. రూ.2.73 లక్షలు(0.43 శాతం మాత్రమే) రికవరీ చేయగలిగారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఇటీవల సోషల్ ఆడిట్ నిర్వహిస్తే ఎప్పుడూ లేని విధంగా రూ.76 లక్షలు అవినీతి జరిగినట్లు తేల్చారు. దీంతో ప్రత్యక్షంగా హాజరైన సోషల్ ఆడిట్ డైరెక్టర్ జగదీష్, అంబుడ్స్‌మెన్ ముక్కున వేలేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత తిరుపతి జిల్లా చిల్లకూరులో జరిగిన సోషల్ ఆడిట్‌లోనూ భారీగా రికవరీ పెట్టారు.





ఘటనా స్థలంలో గాయపడిన వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకుంటున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రోడ్డుపై వృద్ధురాలికి గాయాలు.. కారు ఆపి పరామర్శించిన పురందేశ్వరి

- వెంటనే ఆస్పత్రికి తరలించే ఏర్పాటు

రాజానగరం, ఆగస్టు 25: రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు తీవ్రగాయాల పాలై రోడ్డుపై పడి ఉంది. అటుగా వెళుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ఆ ఘటన చూసి చలించిపోయారు. వెంటనే కాన్వాయ్ ఆపి ఆమె దగ్గరకు వెళ్లారు. ఏం జరిగిందో తెలుసుకుని కంగారు పడొద్దంటూ ధైర్యం చెప్పారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు, రమా మణి (55) దంపతులు పదేళ్లగా దివాన్‌చెరువులో నివాసం ఉంటున్నారు. రమామణి తన సోదరి కుమార్తె వివాహానికి పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని అయినపర్రు గ్రామానికి వెళ్లి తిరిగి ఆదివారం రాజమహేంద్రవరం వరకు బస్సులో వచ్చారు. అక్కడ నుంచి ఆటోలో దివాన్‌చెరు బయల్దేరారు. భర్తకు ఫోన్ చేసి సెంటర్‌లో ఉండమని చెప్పారు. గైట్ కళాశాల వద్ద ఆటో దిగి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా రాజానగరం వైపు వేగంగా వస్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రగాయాలపాలైంది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎంపీ పురందేశ్వరి కారు ఆపి గాయపడిన మహిళ పరిస్థితిని గమనించారు. వెంటనే ప్రైవేట్ వాహనంలో జీఎస్ఎల్ ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఆమె వెంట రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు.

అటవీ శాఖ.. పెద్దిరెడ్డి ఇలాకా!

- మారేడుమిల్లి అడవుల్లో కోట్లాది రూపాయల అక్రమాలు
- ఓ ఐఎఫ్ఎస్ అధికారిని కాపాడుతున్న కీలక అధికారులు
- రేంజ్ అధికారిని సస్పెండ్ చేసి నెల తిరక్కుండా పోస్టింగ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అటవీ శాఖ మాత్రం మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇలాకా గానే కొనసాగుతోంది. ఈ శాఖలోని కొందరు కీలక అధికారులు ఇంకా గత వైసీపీ ప్రభుత్వం నాటి తీరునే కొనసాగిస్తున్నారు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జగన్ సర్కారు పాలనలో చోటుచేసుకున్న అక్రమాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తూ.. వాటి తీవ్రతను తగ్గించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇక్కడి అడవుల్లో వందలాదిగా టేకు చెట్లను మాయం చేయడంతో పాటు ఎకో టూరిజం పేరిట నిధులు స్వాహా చేయడం వంటి వ్యవహారాల్లో రూ.కోట్ల మేర అక్రమాలు జరిగాయని అటవీశాఖ విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాల విచారణలో నిర్ధారణ అయింది. ఈ బాగోతంలో రంపచోడవరం అటవీ డివిజన్‌లోని ఓ ఐఎఫ్ఎస్ అధికారి నుంచి నాటి అటవీశాఖ మంత్రి పేషీ వరకూ వివిధ స్థాయుల్లో ఉన్నతాధికారులు పాత్రధారులు కాగా అప్పటి అటవీ మంత్రి, ఎమ్మెల్సీ అనంతబాబు తదితర జగన్ సన్నిహిత నేతలు సూత్రధారులుగా ఉన్నారు. వీరందరికీ ఎప్పటికప్పుడు ఎవరి వాటాలు వారికి అందడంతో అటవీ సంపద దర్జాగా చెక్‌పోస్టులు దాటిపోయేది. అడవి దాటిపోయిన కలపను తిరిగి వేరే ప్రాంతంలో దొరికినట్లుగా చూపిన ఓ ఉన్నతాధికారి బృందానికి విచారణాధికారులు అండగా నిలిచారు. రంపచోడవరంలో ఉండే ఈ ఐఎఫ్ఎస్ అధికారికి, ఇక్కడే ఉండే ఓ ఐఏఎస్ అధికారి, మరో ఐపీఎస్ అధికారి కొమ్ముకాశారు. ఇక మారేడుమిల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టు ముసుగులో వీరు తమ అక్రమాలను కొనసాగించారు. గిరిజనులతో నడిచే కమ్యూనిటీ బేస్డ్ ఏకో టూరిజం కార్యక్రమాల్లో కమిటీలు లేకుండా చేసి నిధులను స్వాహా చేశారు. గుడిసె టూరిజం ప్రాజెక్టులో అధికారులే గిరిజన కమిటీని రద్దుచేసి నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసేశారు. ఈ బాగోతాలపై మీడియాలో కథనాలు రావడంతో విచారణలు జరిగి, ఆయా అడవుల్లో అక్రమంగా నరికివేతకుగురై, చెట్లు గల్లంతైన లెక్కలు తేలినా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనుకంజ వేస్తూ వచ్చారు. మొక్కుబడిగా ఓ రేంజ్ అధికారిని, మరో ఇద్దరిని సస్పెండ్ చేసినా, మళ్లీ నెల రోజులకే ఆ రేంజ్ అధికారికి తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ఈ అక్రమాల్లో ప్రధాన బాధ్యుడిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారిపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన చేస్తున్నారు.



అక్రమాలకు పాల్పడిన టీటీడీ చైర్మన్లు, ఈవోలకూ నోటీసులు

- పది రోజుల్లో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక
- విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ వెల్లడి

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో టీటీడీలో జరిగిన అక్రమాలు, అవకతవకల గురించి చేపట్టిన విచారణలో భాగంగా అప్పటి బోర్డు చైర్మన్లు, ఈవోలకు కూడా నోటీసులు జారీ చేశామని రాష్ట్ర విజిలెన్స్ విచారణ బృందానికి నాయకత్వం వహిస్తున్న ఎస్పీ కరీముల్లా షరీఫ్ వెల్లడించారు. 'వెంకన్నా ఇదేం విచారణ?... సూత్రధారులను వదిలేసి ఉద్యోగులపై విజిలెన్స్' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. గత ఐదేళ్ల కాలంలో టీటీడీలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు, ఆశ్రిత పక్షపాతం వంటి వాటికి పాల్పడిన చిన్న ఉద్యోగుల నుంచి పెద్ద ఉద్యోగులకే కాకుండా అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు కూడా నోటీసులు జారీ చేసినట్లు వివరణ ఇచ్చారు. నోటీసులను అందుకున్నట్టు వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ కూడా ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు సంబంధించిన అంశాలతోపాటు తమ పరిశీలనలో ఉన్న అన్ని అంశాలనూ క్షుణ్ణంగా విచారించి పది రోజుల్లో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జామిలో 'తూర్పు గంగ' శాసనాలు



త్రిపురాంతక స్వామి ఆలయంలో శిలాశాసనం

- 900 ఏళ్ల కిందటివంటున్న పురావస్తు శాఖ నిపుణులు
- త్రిపురాంతకస్వామి సన్నిధిలో వెలుగులోకి..

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ఎస్.కోట రూరల్, ఆగస్టు 25: విజయనగరం జిల్లా జామిలో పురాతనమైన రాతి శిలా శాసనాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఇవి 900 సంవత్సరాల కిందట తూర్పు గంగ చక్రవర్తి అనంత దేవ వర్మ చెక్కించినవిగా భావిస్తున్నారు. కళింగ సామ్రాజ్యాన్ని ఏలిన రెండో చోళగంగదేవుడు సందర్శించిన సమయంలో రాసిన రాతి శాసనాలుగా భావిస్తున్నారు. జామిలోని త్రిపురాంతక స్వామి ఆలయ ప్రాంగణంలో ఎప్పటి నుంచో ఈ శాసనాలు ఉన్నాయి. అయితే.. వీటి ప్రాశస్త్యాన్ని ఇప్పుడే గుర్తించారు. కొద్దిరోజుల కిందటే శాసనాలు బయటపడ్డాయి. ఎపిగ్రాఫికల్ ఇండియా సొసైటీకి చెందిన పురావస్తు శాస్త్రవేత్త వెంకటరాఘవేంద్రవర్మ తన సిబ్బందితో వచ్చి శాసనాలను పరిశీలించారు. తెలుగు, సంస్కృతం భాషల్లో ఉన్న లిపిని అచ్చు తీయించారు. దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నారు.

పాండవులు నడిచిన నేలగా...

జామిలోని త్రిపురాంతక ఆలయంలో భూమిలో నుంచి 174 అడుగుల ఎత్తు వరకు స్వయంభూ శివలింగం ఉంది. ద్వాపరయుగంలో పాండవులు 14 ఏళ్ల అరణ్యవాసం అయ్యాక ఒక ఏడాది అజ్ఞాతవాసం ఇక్కడే గడిపారని చెబుతుంటారు. శ్రీకృష్ణదేవరాయులు ఈ ఆలయాన్ని సందర్శించినట్టు మనుచరిత్ర గ్రంథంలో రాసి ఉంది. శ్రీకృష్ణదేవ రాయుల వారి అస్థాన కవి అల్లసాని పెద్దన ఈ త్రిపురాంతకస్వామి గురించి, అజ్ఞాతంలో గడిపిన పాండవుల గురించి వర్ణించారని చెబుతారు. అప్పటి ఒడిశా రాజు అయిన చోళగంగదేవుడు క్రీ.శ. 1050లో శ్రీత్రిపురాంతకస్వామిని దర్శించుకున్నారని అంటారు. ఇదే విషయాన్ని అప్పటి సామంతరాజులు ఇక్కడి శిలాశాసనం ద్వారా అచ్చువేయించినట్లు చెప్పుకుంటున్నారు. దీనిపై ఒక దశాబ్దం క్రితం ఆంధ్రా యూనివర్సిటీ పురావస్తుశాఖ పరిశోధనలు చేసింది.



జామిలోని త్రిపురాంతకస్వామి ఆలయంలో శివలింగం

అనంతబాబు అక్రమాల్లో అధికారులూ పాత్రధారులే

- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష



అమరావతి(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 25: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అక్రమాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులూ పాత్రధారులేనని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష ఆరోపించారు. ఆదివారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' లైవ్‌లో పాల్గొన్న ఆమె అనంతబాబు బూతు వీడియో దగ్గర నుంచి పదేళ్లుగా ఆయన చేసిన అక్రమాల వరకూ చిట్టా విప్పారు. రంపచోడవరం మన్యాన్ని అడ్డాగా చేసుకొని అన్ని వనరులనూ ఆదాయంగా మార్చుకున్నారని, ఇందులో జగన్ ప్రభుత్వ పెద్దలతో పాటు, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖల్లోని ఉన్నతాధికారులు కూడా పాలుపంచుకున్నారన్నారు. ఆయన అక్రమాల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు భాగస్వామ్యులు కావడం బాధాకరమని పేర్కొన్నారు. తన అనంతబాబు అక్రమాలపై తగు విచారణతో పాటు బాధ్యులందరిపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతానని ఆమె చెప్పారు.

2022 బ్యాచ్ ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

అమరావతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2022 బ్యాచ్‌కు చెందిన 8మంది అఖిల భారత సర్వీసు అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.విద్యాధరిని చిత్తూరు జేసీగా బదిలీ చేశారు. 31న పదవీ విరమణ చేయనున్న బాపట్ల జేసీ వి.సుబ్బారావు స్థానంలో ప్రభాకర్ జైన్‌ను నియమించారు. పాడేరు ఐటీడీఏ పీవోగా అభిషేక్‌ను కొనసాగించారు. బి.సహేదిత్ వెంకట్ త్రివినాగ్‌ను మార్కాపురం సబ్ కలెక్టర్‌గా, యశ్వంత్ కుమార్ రెడ్డిని పాలకొండ సబ్ కలెక్టర్‌గా, కేఆర్ కల్పశ్రీని నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా, మంత్రి మౌర్య భరద్వాజ్‌ను పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా, రాఘవేంద్ర మీనాను గూడూరు సబ్ కలెక్టర్‌గా, శౌర్యమన్ పటేల్‌ను పాడేరు సబ్ కలెక్టర్‌గా, తిరుమాణి శ్రీపూజను కందుకూరు సబ్ కలెక్టర్‌గా, సంధ్యానా సిన్హాను తెనాలి సబ్ కలెక్టర్‌గా నియమించారు.

'గాలి'ని మించిన ఘనులు



(మొదటి పేజీ తరువాయి)

లేటరైట్ అంత నాణ్యమైనది కాదు! అందుకే... తామే మూసివేయించిన గనిపై పడి దోచుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ పర్మిట్లు నిలిచిపోయినా.. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం లేటరైట్ తవ్వకాలు ఓ రేంజ్‌లో సాగిపోతున్నాయి. దీనికి కారణం... కూటమి సర్కారులోని అధికారులను కూడా వైసీపీ పెద్దలు 'మేనేజ్' చేయడమే అని తెలుస్తోంది. జిల్లాలోని రెవెన్యూ గనుల శాఖ అధికారులు కొందరు వారికి ఇప్పటికీ సలాం కొడుతున్నట్లు సమాచారం. అధికారులు సైతం ప్రభుత్వాన్ని తప్పుదోవపట్టిస్తూ అందంతా 'అధికారికం' అంటూ చెప్పుకొస్తుండడం గమనార్హం.

90 హెక్టార్లలో లీజు

తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులో ఓ ప్రముఖ కంపెనీకి లేటరైట్ మైనింగ్ ఉంది. 90 హెక్టార్ల మేరకు లీజుకు తీసుకున్నారు. ఆ లీజుపై జగన్ హయాంలో కీలక పాత్ర పోషించిన వైసీపీ 'పెద్ద' కన్నుపడింది. అంతే! విజిలెన్స్‌లో తనవారుగా ముద్రపడిన కొందరు అధికారులను ఉసిగొలిపి దాడులు చేయించారు. రూ.70కోట్ల పెనాల్టీ కట్టాలని ఆదేశాలు ఇప్పించారు. అది చెల్లించలేదనే కారణంతో మైనింగ్‌ని నిలిపివేయించారు. దాని పక్కనే మరో కంపెనీకి లీజు ఉంది. అది ఆ 'పెద్ద మనిషి' బినామీదే. అయితే, ఈ సంస్థకిచ్చిన భూముల్లో అంత నాణ్యమైన లేటరైట్ నిల్వలు లేవు. అయినా సరే, పక్కనే ఉన్న అడవిలో లేటరైట్ తవ్వి ఈ కంపెనీకిచ్చిన భూముల్లో మైనింగ్ చేసినట్లుగా మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. ఇలా.. లేటరైట్ దోపిడికి ఈయన గాలి జనార్దన్ రెడ్డి తరహా స్కెచ్ వేసి అమలు చేస్తున్నారు. ఏడెనిమిది నెలలుగా ఈ అక్రమం సాగుతోంది. అక్కడ లభించే లాటరైట్‌ను ప్రాసెస్ చేస్తే భారీగా బాక్సైట్ వస్తుందని అధికారవర్గాలు కూడా చెబుతున్నాయి. ఈ విషయం తెలిసే ఆ లీజు ఏరియాను దక్కించుకునేందుకు వైసీపీ 'పెద్ద' అధికారంలో ఉండగా తీవ్రంగా శ్రమించారు. చివరకు లీజుపొందిన కంపెనీకి రూ.70 కోట్ల పెనాల్టీలు వేయించి, మైనింగ్‌ను సైతం ఆపివేయించారు.

'పెద్ద' మాయ

సీఎం చంద్రబాబు ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు అక్రమాలపై విచారణ చేసిన విషయం తెలుసుకున్న వైసీపీ పెద్ద తన మనుషులను రంగంలోకి దించి మాయచేసిన ట్లు తెలిసింది. గనులశాఖలోని విజిలెన్స్ విభాగంలో ఉన్న తన అస్మదీయుడి ద్వారా మొత్తం విషయాన్ని తప్పుదోవపట్టించినట్లు సమాచారం. "ప్రత్తిపాడులో మైనింగ్ చేస్తున్న కంపెనీకి లీజు, పర్మిట్లు ఉన్నాయి. దాని డంప్‌యార్డ్‌లో ఉన్న లేటరైట్ అధికారికమైనదే. మూసివేయించిన కంపెనీ యార్డులోని లేటరైట్ వేరు. వారి వ్యాపారం వేరు. రెండింటిని పోల్చొద్దు. రెండూ వేర్వేరుగా చూడాలి" అంటూ ప్రభుత్వానికి రిపోర్టు ఎలా ఇవ్వాలో కూడా ఆయన సూచించినట్టు సమాచారం. దీంతో ప్రత్తిపాడు ఏరియాలో ఎక్కడా అక్రమ లేటరైట్ లేదని, అంతా సవ్యంగానే సాగుతోందని ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. దీంతో వైసీపీ పెద్ద తన అక్రమ లాటరైట్‌ను దర్జాగా కొనసాగిస్తున్నారు. గతంలో చీకట్లో సాగిన ఈ దందా ఇప్పుడు పగలు, రాత్రి తేడా లేకుండా సాగుతుండడం గమనార్హం.

లెక్క తేల్చేదెలా?

వారికి కేటాయించిన లీజు ఏరియాలోనే మైనింగ్ జరుగుతోందని గనులు, రెవెన్యూ అధికారులు చెబుతున్నా.. ఎవరి మైనింగ్ ఏరియా ఎంత? ఎవరు ఎంత మేర మైనింగ్ చేయాలి? అటవీ భూమి ఎంత? ప్రస్తుత పరిస్థితి ఏమిటి అనేది తేలిస్తే వైసీపీ 'పెద్ద' చేస్తున్న అక్రమ దందా బయటపడుతుంది. గనులు, అటవీ, రెవెన్యూశాఖలు సంయుక్తంగా నడుం బిగిస్తేనే ఇది వెలుగు చూస్తుంది. కానీ, అధికారులు ఆ పనిచేయడం లేదు. అధికారిక అనుమతులు, పర్మిట్లు ఉన్నాయంటూ అక్కడి లాటరైట్‌ను తరలించేందుకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారు.

సిబ్బంది సర్దుబాటు!

(మొదటి పేజీ తరువాయి)


ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఇరిగేషన్ శాఖలో ఏఈలుగా సర్దుబాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇలా 660 మందిని ఏఈలుగా తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్‌కి ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. మిగతా శాఖల్లోనూ ఇదే విధంగా సర్దుబాటు చేసి.. పనిలేకుండా ఉన్న గ్రామ సచివాలయాల సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 1,34,000 మంది సిబ్బందికి గాను ప్రస్తుతం 1,26,000 మంది ఉన్నారు. సగటున 8 మందికి పైబడి ఉన్నారు. చాలా సచివాలయాల్లో 10 నుంచి 14 మంది వరకు ఉన్నారు. వీరిలో నలుగురైదుగురిని మాత్రమే సచివాలయాల్లో ఉంచి మిగతా సిబ్బందిని ఆయా శాఖల్లో సర్దుబాటు చేసుకోవడం ద్వారా ఉద్యోగుల కొరతను నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇరిగేషన్‌తో పాటు పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి పథకం విభాగాల్లో ఏఈల కొరత ఉంది. ఆయా మండలాల్లో ఈ ఉద్యోగాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో భర్తీ చేయడం ద్వారా సిబ్బంది కొరతను అధిగమించాలని యోచిస్తోంది.

లోపాలపుట్ట..

గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థలో లోపాలపై ఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్' సంస్థ జగన్ ప్రభుత్వ హయాంలోనే అధ్యయనం చేసింది. దీనిని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. బలోపేతానికి తీసుకోవలసిన చర్యలనూ సూచించింది. అయితే దాని నివేదిక అప్పటి ప్రభుత్వ పెద్దల మనోభావాలకు వ్యతిరేకంగా ఉందనే ఉద్దేశంతో అధికారులు దానికి బహిర్గతం చేయడానికి సాహసించలేదు. గ్రామ/వార్డు సచివాలయాల్లో చెప్పుకోదగిన రీతిలో సేవలు అందడం లేదు. పనిభారం పెద్దగా లేదని 'రీసెర్చ్' సంస్థ అధ్యయన నివేదిక పేర్కొంది. '2022 నవంబరు-2023 మే నెల నడుమ 37 శాతం గ్రామ సచివాలయాలు, 39.3% వార్డు సచివాలయాలు నెలకు కేవలం 5 శాతం లోపే సేవలు అందించాయి. గ్రామ సచివాలయాల్లో క్షేత్రస్థాయి పనులు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ.. పట్టణాల్లో చాలా తక్కువ. గ్రామ సచివాలయాలు గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పనిచేయాలి. కొన్ని సెమీఅర్బన్ ప్రాంతాలను గ్రామీణ ప్రాంతాలుగా, ఇతర ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా పంచుకోవాలి. సెమీ అర్బన్ ప్రాంతాలన్నీ గ్రామీణ, పట్టణ అవసరాలను కలిగి ఉంటాయి. వ్యవసాయం, ఉద్యానవనం, పట్టణ స్థాయి మౌలిక వసతుల ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుంది. గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా జీవనోపాధి అంశాలు, వ్యవసాయం, పశుసంవర్థకం, తదితర మానవ వనరులున్నాయి. కానీ వార్డు సచివాలయాల్లో లేవు. ఎనర్జీ కార్యదర్శులు రెండు సచివాలయాల్లోనూ ఉన్నారు. భద్రత దృష్ట్యా విద్యుత్ శాఖ ఉద్యోగులతో కలిసి టీమ్ వర్క్ చేస్తున్నారు. ఇక గ్రామ సచివాలయాలు గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా మారాయి. వీటి మధ్య సంబంధాల్లో స్పష్టత లేదు. గ్రామ సచివాలయాల్లోని కార్యదర్శులు పలు శాఖల ఆదేశాలతో పనిచేస్తున్నారు. ఇదే పరిస్థితి వార్డు సచివాలయాల్లోనూ నెలకొంది. వాటిలోని కార్యదర్శులు ఎక్కువగా మున్సిపల్ శాఖతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. స్థానికంగా ప్రజల అవసరాలను పరిష్కరించడం కన్నా ఆయా శాఖలు, మున్సిపల్ శాఖకు వారు జవాబుదారీగా ఉండాల్సి వస్తోంది. దీంతో గ్రామ/వార్డు సచివాలయాలు సామాజిక లక్ష్యాలను సాధించే శాఖలుగా కాకుండా పలు శాఖలకు అవుట్‌పోస్టులుగా ఉన్నాయి. ఏఎన్ఎం, రెవెన్యూ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు గతంలోనూ ఉన్నారు. సచివాలయాల ఏర్పాటుతో వారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య భారీగా పెరిగింది. వార్డు సచివాలయాల్లో రెవెన్యూ అధికారులకు పెద్దగా పనిలేదు. శానిటేషన్ కార్యదర్శులు పదే పదే పలు కార్యక్రమాలు తిరిగి చేపడుతున్నారు. కొంత మంది టౌన్‌ప్లానింగ్-రెగ్యులేటరీ కార్యదర్శులకు పని పరిమితంగానే ఉంది. కొంత మంది కార్యదర్శులకు విస్తృతమైన బాధ్యతలు పెట్టగా.. కొంత మందిని కొన్ని పథకాలకే పరిమితం చేశారు. శాఖాపరమైన నిబంధనల ప్రకారం ప్రాక్టికల్‌గా కొన్ని పరిమితమైన విధులు మాత్రమే వారు చేపడుతున్నారు. సచివాలయాల కార్యదర్శులు సామాజిక చైతన్యం కల్పించడంలో కీలక భూమిక పోషించడం లేదు. వారికి నిర్ణయాత్మక అధికారాలు లేకపోవడంతో పౌరుల అవసరాలకు సంబంధించి తక్షణమే స్పందించలేని పరిస్థితి నెలకొంది. వార్డు సచివాలయాల్లో పనిచేసే రెవెన్యూ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్-రెగ్యులేషన్, శానిటేషన్ కార్యదర్శులను తగ్గించాలి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో సిబ్బందిని పెంచుకోవాలి. విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సామాజిక అవసరాలకు అనుగుణంగా కార్యదర్శుల పాత్ర ఉండాలి' అని సూచనలు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకున్న కొత్త ప్రభుత్వం ప్రక్షాళనకు శ్రీకారం చుడుతోంది.

ఈఎస్ఐపై విజి'లెన్స్'!

జగన్ హయాంలో మందుల కొను'గోల్‌మాల్'పై దృష్టి



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈఎస్ఐ కార్పొరేషన్ చరిత్రలో ఎప్పుడూ జరగని.. ఎవరూ ఊహించని కుంభకోణం చోటుచేసుకుంది. గత ప్రభుత్వంలో ఈఎస్ఐ ఆస్పత్రి పేరుతో కోట్ల రూపాయల ఖరీదుచేసే మందులు కొనుగోలు చేసి.. వాటిని ప్రైవేటు మార్కెట్లో నాలుగు రెట్లు ఎక్కువకు అమ్మి సొమ్ము చేసుకున్న ఉదంతాన్ని 'ఆంధ్రజ్యోతి' అప్పట్లోనే 'ఈఎస్ఐలో మందుల మాయ' శీర్షికతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై జగన్ సర్కారు విచారణ కమిటీ వేసింది. అది తూతూ మంత్రంగా విచారణ చేసి కొన్ని అనుమానాలు మాత్రమే ఉన్నాయని నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను గత ప్రభుత్వం పక్కన పడేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ స్కాంను వెలుగులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. దీనిపై విచారణ చేపట్టాలని కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్.. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్‌కుమార్ గుప్తాకు నివేదించారు. దీనిపై 2-3 రోజుల్లోనే విచారణ ప్రారంభం కానుంది.

> జగన్ హయాంలో ఈఎస్ఐలో జరిగిన అక్రమాలు, అవినీతిపై ప్రభుత్వం దృష్టి సారించింది. మందుల కొనుగోలు పేరుతో అప్పటి అధికారులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. సీఎంవోలోని వసూల్‌రాజా సహకారంతో ఈఎస్ఐ ఉన్నతాధికారి ఒకరు భారీ కుంభకోణానికి తెరలేపారు. దీనితో పాటు ఉద్యోగుల పదోన్నతుల్లో అక్రమాలు, భారీగా ముడుపులు తదితర వ్యవహారాలపై విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో విచారణ చేయించాలని సర్కారు నిర్ణయించింది.

అసలేం జరిగింది..?

ఈఎస్ఐ నిబంధనల ప్రకారం ఆస్పత్రులకు అవసరమైన మందులన్నీ.. కేంద్రం ఎంపిక చేసిన కంపెనీల నుంచే కొనుగోలు చేయాలి. ఇవి కాకుండా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు అత్యవసర మందులు, సర్జికల్ ఐటమ్స్ కొనుగోలు చేయడానికి కొంత వెసులుబాటు ఉంటుంది. అది కూడా మూడు నెలల వ్యవధిలో లక్ష రూపాయలకు మించకూడదు. అదికూడా 'లోకల్ పర్చేజ్' నిబంధన కింద స్థానికంగా టెండర్లు పిలిచి, ఒక ఏజెన్సీని ఎంపిక చేసుకుని దానిద్వారానే కొనుగోలు చేయాలి. జగన్ హయాంలో ఈఎస్ఐ ఉన్నతాధికారులు సరిగ్గా ఈ లోకల్ పర్చేజ్ రూల్‌ను ఆసరా చేసుకునే భారీ స్కాంకు పాల్పడ్డారు. వారు హైదరాబాద్‌లో మందులు తయారు చేసే కంపెనీల ప్రతినిధులతో ప్రైవేటుగా సమావేశమయ్యారు. ఐదు ప్రాంతాల నుంచి లోకల్ పర్చేజ్ కింద ఈఎస్ఐ తరఫున భారీ మొత్తంలో మందులు కొనుగోలు చేస్తామని.. బయటి మార్కెట్ కంటే బాగా తక్కువకు వాటిని విక్రయించాలని బేరం మాట్లాడుకున్నారు. కొన్ని కంపెనీలు 80 శాతం తక్కువకే మందులు సరఫరా చేసేందుకు అంగీకరించాయి. ఆ ఒప్పందం మేరకు ఈఎస్ఐ ఉన్నతాధికారులు తొలుత రాజమండ్రి నుంచి లోకల్ పర్చేస్ ఏజెన్సీ ఎంపిక కోసం టెండర్లు ఆహ్వానించారు. ఈ టెండర్లలో అప్పటికే కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు పాల్గొనడానికి లేదు. దీంతో ఉన్నతాధికారులే ఒక డమ్మీ ఏజెన్సీని సృష్టించారు. రాజమండ్రి సూపరింటెండెంట్ పిలిచిన టెండర్లల్లో సదరు డమ్మీ సంస్థ ద్వారా బిడ్ వేయించారు. దానినే ఎల్1గా ఎంపిక చేశారు. ఒకేసారి, ఒకే రోజు రూ.3 కోట్ల విలువైన మందుల కొనుగోలుకు పీవో (పర్చేజ్ ఆర్డర్)లు సిద్ధం చేశారు. నిబంధనల ప్రకారం మూడు నెలలకు కలిపి రూ.లక్షకు మించి పీవోలు ఇవ్వకూడదు. కానీ ఒకేరోజు రూ.3 కోట్లకు పీవోలు సిద్ధం చేశారు. మరో విషయం ఏమిటంటే ఆర్డర్ విలువ ఎంతైనా సూపరింటెండెంట్లకు మాత్రమే సరఫరా చేయాలి. కానీ ఉన్నతాధికారులు నేరుగా ఈఎస్ఐ డైరెక్టరేట్‌కు తెప్పించుకున్నారు. ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ప్రతినిధులతో మళ్లీ హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. పీవోలను నేరుగా వారికి ఇచ్చేసి, వెంటనే మందులు సరఫరా చేయాలని ఆదేశించారు. పీవోలు మొత్తం రాజమండ్రి సూపరింటెండెంట్ పేరుతోనే ఇవ్వడం గమనార్హం.

ప్రైవేటు గోదాముకు..

రాజమండ్రి సూపరింటెండెంట్ పేరుతో ఇచ్చిన పీవోల ఆధారంగా కంపెనీలు మందులన్నిటినీ రాజమండ్రి సెంట్రల్ డ్రగ్ స్టోర్(సీడీఎస్)కు సరఫరా చేయాలి. కానీ ఉన్నతాధికారులు వాటిని ప్రైవేటు గోదాముకు తరలించారు. ఈఎస్ఐకి రూ.2కి వచ్చిన ఒక్కో మాత్ర ధర.. బయటి మార్కెట్లో దాదాపు రూ.10 ఉంది. కొనుగోలు చేసిన దానికంటే 8 రూపాయలు అధికంగా వస్తుందని వెంటనే ఆ మందులను ఈఎస్ఐ ఉన్నతాధికారులే బయటి మార్కెట్లో అమ్మేశారు. మూడు ప్రాంతాల నుంచి ఇలా దాదాపు రూ.60 కోట్లు స్కాం చేశారు.

వసూల్ రాజా హస్తం..

ఈ వ్యవహారం వెనుక కర్త, కర్మ, క్రియ మొత్తం నాటి సీఎంవోలో చక్రం తిప్పిన వసూల్ రాజాయే. స్కాంను అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో వెలుగులోకి తీసుకురాగానే ఆయన రంగంలోకి దిగారు. మొత్తం వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారు. విజిలెన్స్ లేదా ఇతర దర్యాప్తు సంస్థలతో విచారణ చేపడితే గుట్టు రట్టవుతుందని, ఈఎస్ఐ ఉన్నతాధికారులతో పాటు తన తలకూ చుట్టుకుంటుందని విచారణ తూతూ మంత్రంగా ముగించాలని భావించారు. శాఖపరమైన విచారణతో సరిపెట్టాలని సీఎంవో నుంచి ఒత్తిడి తెచ్చారు. ఓ కమిటీని వేసి అక్రమాలు జరగలేదని రిపోర్టు తెప్పించుకుని కేసు క్లోజ్ చేయాలని చూశారు. ఇప్పుడు విజిలెన్స్ విచారణలో ఈ మొత్తం వ్యవహారం బయటపడే అవకాశం ఉంది.



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సత్కరించిన స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు

రాష్ట్రంలో స్పేస్ పార్క్

- ఉప ముఖ్యమంత్రి పవన్ సానుకూలత
- రష్యా వ్యోమగామికి సత్కారం

అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధన ఫలాలను సక్రమంగా వినియోగించుకుంటే దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని ఉపముఖ్యమంత్రి, శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం రష్యాకు చెందిన వ్యోమగామి సెర్గి కోర్సకొవ్, స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లోని నివాసంలో పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించడం అవసరమన్నారు. శాస్త్రవేత్తలుగా మారేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. సమావేశంలో స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు చేసిన పరిశోధనలు, తయారు చేసిన శాటిలైట్ల గురించి చర్చించారు. ఇటీవల చేసిన అతిచిన్న శాటిలైట్ డిష్‌ప్లేయర్‌ను చూపించి, దాని పనితనాన్ని వివరించారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు ఆసక్తి పెంచాలంటే రాష్ట్రంలో స్పేస్ పార్క్ ఏర్పాటు చేయాలని స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ సీఈవో కేశన్ కోరారు. స్పేస్ పార్క్ నాసాలో మాత్రమే ఉందని, భారత్‌లో ఎక్కడా లేదని చెప్పారు. ఏపీలో ఏర్పాటు చేస్తే, విద్యార్థులకు మరింత అవగాహన పెంచవచ్చని పేర్కొన్నారు. దీనికి పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా రష్యా వ్యోమగామి సెర్గి కోర్సకొవ్‌ను పవన్ ఘనంగా సత్కరించారు. చంద్రయాన్-3 రాకెట్ నమూనాను బహూకరించారు. సెర్గి ఆరు నెలల పాటు అంతరిక్షంలో ఉన్నారు. అక్కడి విశేషాలను, అంతరిక్షంలో ఎలా ఉండగలిగారో పవన్ అడిగి తెలుసుకున్నారు. ఆయన కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన రష్యన్ వంటకాలను రుచి చూపించారు. ఈ భేటీలో స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు యజ్ఞసాయి, ఎస్పీ అర్జునర్, సాయితన్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్... అందని ద్రాక్ష!



విశాఖపట్నం రైల్వే స్టేషన్

- విశాఖకు జోన్ ఇవ్వకుండానే ఒడిశాలోని రాయగడకు డివిజన్
- డీఆర్ఎం కార్యాలయం నిర్మాణానికి టెండర్
- వాల్తేరు డివిజన్ రద్దు దిశగా అడుగులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ కేంద్రంగా ప్రకటించిన రైల్వే జోన్ అందని ద్రాక్షలా ఊరిస్తోంది. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటు చేయకుండానే ఒడిశాలోని రాయగడ డివిజన్ పనులు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర వాసులు మరోసారి నిరాశ చెందుతున్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన దశాబ్దాలుగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ 2019ఎన్నికల ముందు జోన్ ఇస్తామని హామీ ఇచ్చారు. దాని ప్రకారం దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న తూర్పు కోస్తా జోన్ నుంచి వాల్తేరు డివిజన్‌ను తప్పించి, దక్షిణ కోస్తాలో కొన్ని డివిజన్లతో విశాఖ కేంద్రంగా కొత్త జోన్ పెడతామని ప్రకటించారు. 2020-21 బడ్జెట్‌లోనే జోన్ కార్యాలయం నిర్మాణానికి నిధులు కేటాయించారు. అయితే జోనల్ కార్యాలయం నిర్మాణానికి అవసరమైన భూములు ఏపీ ప్రభుత్వం (జగన్ సర్కారు) ఇవ్వడం లేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో అనేకసార్లు ఆరోపించారు. తాజాగా జోన్ సమస్యలు పరిష్కారం అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఇటీవల తెలిపారు. అయితే తూర్పు కోస్తా రైల్వే కొత్తగా ఏర్పాటు చేయబోయే రాయగడ డివిజన్ కోసం రాయగడలో డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, సిబ్బందికి క్వార్టర్లు, సర్వీసు భవనం నిర్మించడానికి శనివారం టెండర్లను ఆహ్వానించింది. ఇది చూసి ఉత్తరాంధ్ర రైల్వే ప్రయాణికులు మరోసారి మోసపోయామని ఆవేదన చెందుతున్నారు.

జోన్ ఏర్పాటైతేనే... డివిజన్

విశాఖలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేస్తే వాల్తేరు డివిజన్‌లో ఉన్న కొన్ని ప్రాంతాలను తీసేసి, అటు ఒడిశాలోని మరికొన్ని ప్రాంతాలను కలిపి కొత్తగా 'రాయగడ డివిజన్' ఏర్పాటు చేయాలనేది ఓ ప్రతిపాదన. కొత్త డివిజన్ ఏర్పాటు చేసినట్టు అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. కానీ ఇప్పుడు రాయగడలో డీఆర్ఎం కార్యాలయ సముదాయం నిర్మాణానికి సెప్టెంబరు 24లోగా టెండర్లు సమర్పించాలని ప్రకటించారు. అంటే రాయగడ డివిజన్ ఏర్పాటు, వాల్తేరు డివిజన్‌లో కొన్ని ప్రాంతాలను అందులో కలపడం ఖాయమని తేలిపోయింది. ఒడిశాకు సంబంధించిన ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తెస్తున్న రైల్వే పెద్దలు విశాఖ జోన్ విషయంలో ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వాల్తేరు డివిజన్ రద్దు!

కొత్త జోన్ కార్యాచరణ ప్రక్రియ ముందుకు సాగాలంటే... ముందు విభజన అంశాల్లో భాగంగా 'వాల్తేరు రైల్వే డివిజన్' రద్దు చేయాలి. ఈ డివిజన్‌లో విశాఖపట్నం, విజయనగరం, చీపురుపల్లి వరకు విజయవాడ డివిజన్‌లో కలిసిపోతాయి. విజయవాడ డివిజన్ దక్షిణ కోస్తా జోన్‌లోకి వస్తుంది. ఇక వాల్తేరు డివిజన్‌లో మిగిలిన ఒడిశా ప్రాంతాలు కోరాపుట్, రాయగడ, కిరండోల్ వంటివి కొత్తగా ఏర్పాటయ్యే 'రాయగడ డివిజన్'లోకి వెళ్లిపోతాయి. ఈ మేరకు రాయగడలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే కొత్త జోన్ పనులు మొదలవుతాయని అంటున్నారు. అయితే వాల్తేరు డివిజన్‌తో కూడిన జోన్ కావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. ఎంపీలు కూడా అదే మాట ఢిల్లీ పెద్దలకు చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.